తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

గుంటూరు

fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

9-5-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 98 పేజీలు: 12 వెల: 6.50











శుక్రవారం ఇఫ్కో కిసాన్ సెజ్‌లో మహానాడు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపి వేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తదితరులు

# ప్రతిష్టాత్మకంగా మహానాడు ఏర్పాట్లు

### ప్రతి కమిటీతో సమన్వయంగా పనులు

### ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

**కొడవలూరు (నెల్లూరు), మే 8, ప్రభాతవార్త :** జిల్లాలో నిర్వహించనున్న తెలుగు దేశం పార్టీ మహానాడును ప్రతిష్టాత్మకంగా తీసుకుని కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేస్తున్నామని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. కొడవలూరు మండలం ఇఫ్కో కిసాన్ సెజ్‌లో జరుగుతున్న మహానాడు ఏర్పాట్లను శుక్రవారం వారు పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నెల్లూరులో మహానాడు నిర్వహించడం జిల్లాకు గర్వకారణమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జిల్లాకు రావడం ఆనందంగా ఉందన్నారు. మహానాడు నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. పార్టీ నియమించిన వివిధ కమిటీలతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో జరిగే ఈ మహానాడు చారిత్రాత్మకంగా నిలిచిపోయేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు మహానాడును విజయవంతం చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని చెప్పారు. సభా ప్రాంగణం, వసతి, పార్కింగ్, తాగునీరు, భోజన వసతులు తదితర అంశాల్లో ప్రత్యేక ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి టూర్ కోఆర్డినేటర్, జోనల్ కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, రాష్ట్ర మీడియా సమన్వయకర్త, రాష్ట్ర కార్యదర్శి బి.వి. వెంకట రాముడు, నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, తెలుగుదేశం పార్టీ నెల్లూరు నగర అధ్యక్షుడు మావిడాల మధు, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, చెముకుల కృష్ణ చైతన్య, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అదే సస్పెన్స్!

>> మద్దతు లేఖలను గవర్నర్‌కు ఇవ్వకపోవడంతో కేవలం 116 వద్దనే విజయ్‌మెజార్టీ నిలిచిపోయింది. ఇదిలా ఉంటే టిటివిదినకరన్ పార్టీ ఎఎంఎంకె తాము విజయ్‌కు మద్దతివ్వలేమని ఎఐఎడిఎంకెను ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాలంటూ గవర్నర్‌ను కలిసి లేఖ ఇచ్చారు. తాము టివికెకు ఎట్టిపరిస్థితుల్లోను మద్దతివ్వమని, ఎఐఎడిఎంకెకు మద్దతిస్తామంటూ దినకరన్‌ప్రకటించడం తంబిల రాజకీయాల్లో మరో మలుపు తిరిగినట్లయింది. కాగా సిపిఐ, సిపిఎం, విసికె ఈ మూడు పార్టీలుకూడా ఇప్పటివరకూ డిఎంకె కూటమిలోనే కొనసాగాయి. తీరా మద్దతు పరంగా టివికెపట్ల ఆసక్తిచూపాలంటే వాటికి ఇరకాటంగా మారింది. ఇపుడు కేవలం ఇద్దరు ఎమ్మెల్యేల మద్దతుపైనే టివికె విజయ్ భవిష్యత్తు ఆధారపడి ఉంది. తొలుతచోటుచేసుకున్న పరిణామాల్లో విజయ్‌తోపాటు పార్టీసీనియర్లు కూడా సంప్రదింపులు జరపడంతో విసికె మొగ్గుచూపింది. అయితే తమకు ఉప ముఖ్యమంత్రి పదవి కావాలని పట్టుబట్టడంతో కథ అడ్డం తిరిగింది. అయితే ప్రభుత్వంలో అత్యంత కీలక మంత్రిపదవి ఇస్తామని టివికె సర్దుబాటుకు ప్రయత్నించినా విసికె మంకుపట్టుతో గవర్నర్‌కు లేఖను పంపించలేదని తెలుస్తోంది. విసికె తమ నేత సీనియర్‌నాయకుడు తోల్ తిరుమావలన్‌కు డిప్యూటి సిఎం పోస్టు ఇవ్వాలని రవికుమార్ ఒత్తిడి తీసుకువచ్చారు. మరికొందరు నాయకులు పార్టీ విడియో సమావేశంలో టివికెకు మద్దతివ్వాలని అయితేకేబినెట్‌లో స్థానాలుండాలని పార్టీ డిప్యూటి ప్రధాన కార్యదర్శి వన్ని ఆరసుకు కేబినెట్‌పదవి ఇవ్వాలని కోరుతున్నారు. అలాగే రానున్న కొత్త ప్రభుత్వం దళిత పరిరక్షణకు కృషిచేసేదిగా ఉండాలని మరికొందరు చెపుతుంటే తిరుమావలన్‌ను తిరుచ్చి ఈస్ట్ స్థానంనుంచి పోటీకి టివికెసైతం తమనేతకు మద్దతివ్వాలని పట్టుబడుతున్నారు. ఇపుడు విజయ్ ప్రమాణ స్వీకారం కేవలం ఒకే ఒక్క ఎమ్మెల్యే మద్దతువద్ద నిలిచిపోయింది. ముఖ్యంగా విసికె, ఎఎంఎంకె, ఐయుఎంఎల్ ఎమ్మెల్యేలు మెజార్టీ మద్దతిస్తే తమకు సరిపోతుందని భావించిన విజయ్‌కు ఈపార్టీలు మొండిచెయ్యిచూపించాయి. ఇదిలా ఉంటే ఐయుఎంఎల్ పార్టీనుంచి గెలిచిన ఎమ్మెల్యే షాజహాన్ తమ పార్టీ టివికెకు మద్దతివ్వడంలేదని, తాము ఎవ్వరికీ మద్దతు లేఖలుఇవ్వలేదని, తమ పార్టీ డిఎంకెతోనే కొనసాగుతుందని స్పష్టంచేయడంతో ఈపార్టీకూడా టివికెకు మద్దతు అంశంలో వెనక్కు తగ్గిందనే చెప్పాలి.

**సందిగ్ధంలోప్రమాణస్వీకారం...**

ముందు సరిపడే ఎమ్మెల్యేలు మద్దతు తమకు ఉందన్న భావనతో టివికె అధినేత విజయ్‌ప్రమాణస్వీకారం ఉంటుందని, జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో ఉదయం 11 గంటలకు ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుందని పార్టీనేతలుప్రకటించారు. అయితే గవర్నర్ కార్యాలయంనుంచి తమకు మద్దతు లేఖలు అందలేదని, ఈనేపథ్యంలో తాము ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించలేమని లోక్‌భవన్ స్పష్టత ఇవ్వడంతో విజయ్‌ప్రమాణస్వీకారం రెండోసారి మళ్లీ సందిగ్ధంలోపడింది. శనివారం నాటికయినా స్పష్టత వస్తుందనేది టివికెనేతల్లోను అనుమానాలు చెలరేగుతున్నాయి.

**తమిళనాట పరిణామాల్లో మా ప్రమేయం లేనేలేదు...బిజెపి**

ఇదిలా ఉంటే తమిళనాడులోకొనసాగుతున్న తాజా పరిణామాల్లో తమ ప్రమేయం ఎంతమాత్రం లేదని టివికె గవర్నర్లమధ్య నెలకొన్న ప్రతిష్టంభన కేవలం మెజార్టీ నిరూపణతోనే తేలిపోతుందని బిజెపి చెపుతోంది. తీర్పు భిన్నంగా వచ్చిందని, టివికెకు మెజార్టీ తగ్గిందని, విజయ్ తన మెజార్టీ నిరూపించుకున్న పక్షంలో గవర్నర్ రాజ్యాంగపరంగా ఆమోదిస్తారని, ఇందులో ఎలాంటి సందేహంలేదని బిజెపి రాష్ట్రప్రతినిధి నారాయణ్ తిరుపతి ప్రకటించారు. తమిళనాడు ప్రస్తుత పరిణామాలను తమ పార్టీకి అంటగట్టడం భావ్యం కాదని అన్నారు. గవర్నర్‌ను ఎలా నడుచుకోవాలో బిజెపి మార్గనిర్దేశంచేస్తోందన్న వ్యాఖ్యలు అర్థరహితమని ఆయన కొట్టిపారేసారు. రాష్ట్రంలో ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగాజరిగాయని, టివికె విజయ్‌కు ఎక్కువ సీట్లు వచ్చాయని, ప్రతి సందర్భం కూడా ప్రజాస్వామ్యబద్ధంగానే జరుగుతుందని, గవర్నర్‌పై రాజకీయ పార్టీ ఎలా ఒత్తిడి తెస్తుందని నారాయణ్ పేర్కొన్నారు. ఇవన్నీ అవగాహనలేని వ్యాఖ్యలని కొట్టివేసారు.

# బెంగాల్ సిఎంగా సువేందు

హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ ప్రజలు బిజెపిపై విశ్వాసం ఉంచారని, తమ ప్రభుత్వం ఏర్పాటు కాగానే చొరబాటుదారులు, గోవుల అక్రమరవాణాకు పూర్తిగా కళ్లెం వేస్తామని స్పష్టం చేశారు. 'సోనార్ బంగ్లా లక్ష్య సాధన దిశగా పనిచేయడం, బెంగాల్ ప్రజల అంచనాలను నిలబెట్టడం మన బిజెపి కార్యకర్తలందరికి బాధ్యత. కవిగురు రవీంద్రనాథ్ ఠాగూర్ కలలు గన్న భయంలేని, ఆత్మగౌరవంతో తలెత్తుకుని జీవించే బెంగాల్ వైపు నేడు మన ప్రయాణం సాగుతోంది' అని అమిత్‌షా అన్నారు.

# ఖరీఫ్ రైతుకు సర్కార్ అండ

>> చేసిందని, 2025-26 సంవత్సరానికి సంబంధించిన చెల్లింపుల ప్రక్రియ కూడా కొనసాగుతోందని తెలిపారు. రైతులకు వివిధ పంటలపై ఆకర్షణీయమైన రాయితీలు కొనసాగిస్తున్నామని మంత్రి వెల్లడించారు. వరి విత్తనాలకు జిల్లాల వారీగా క్వింటాల్‌కు రూ.500 నుంచి రూ.1000 వరకు రాయితీ, చిరుధాన్యాలకు 50 శాతం, పప్పుధాన్యాలకు 30 శాతం, శనగలకు 25 శాతం, వేరుశనగ మరియు నువ్వులకు 40 శాతం, పచ్చిరొట్ట ఎరువు విత్తనాలకు 50 శాతం రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. ఏజెన్సీ మండలాల్లో గిరిజన రైతులకు 90 శాతం వరకు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో 80 శాతం వరకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 2026 సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని రైతులకు అవసరమైన ఎరువులను సమృద్ధిగా అందుబాటులో ఉంచామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రానికి ఖరీఫ్ 2026 సీజన్‌కు మొత్తం 18.09 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల కేటాయింపు ఉండగా, మే నెల వరకు ఇప్పటికే 3.44 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించబడినట్లు మంత్రి వెల్లడించారు. ఏప్రిల్ 1 నాటికి 7.13 లక్షల మెట్రిక్ టన్నుల ప్రారంభ నిల్వలు ఉండగా, ఇప్పటివరకు మరో 1.71 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు రాష్ట్రానికి చేరాయని తెలిపారు. దీంతో మొత్తం 8.84 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులోకి వచ్చినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు 1.08 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులకు విక్రయించగా, ప్రస్తుతం రాష్ట్రంలో 7.77 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని మంత్రి వివరించారు. యూరియా 2.40 లక్షల మెట్రిక్ టన్నులు, డీఏపీ 0.94 లక్షల మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 0.35 లక్షల మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 3.62 లక్షల మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 0.46 లక్షల మెట్రిక్ టన్నుల మేర అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి సరఫరాపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. జూన్ 1 నుంచి కృష్ణా తూర్పు డెల్టా, జూలై 1 నుంచి కృష్ణా పశ్చిమ డెల్టాకు నీటి విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పరిధిలో ప్రస్తుతం 9.22 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని మంత్రి తెలిపారు. సాగు పనులు జూన్ రెండో వారంలో ప్రారంభమవుతాయని, వరి నాట్లు జూలై రెండో వారంలో ప్రారంభమయ్యే అవకాశముందని పేర్కొన్నారు. ప్రస్తుతం కాలువల నిర్వహణ పనులు వేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు.

## రెండురోజులు పిడుగుల వానలు: వాతావరణ శాఖ హెచ్చరిక

**విజయవాడ మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఇవాళ, రేపు పలు ప్రాంతాల్లో పిడుగులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం దక్షిణ భారతదేశంపై కొనసాగుతున్న పలు వాతావరణ మార్పుల ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని అధికారులు తెలిపారు. ఆగ్నేయ అరేబియా సముద్రంలో సముద్ర మట్టానికి సుమారు 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. అలాగే లక్షద్వీప్ ప్రాంతం మీదుగా కేరళ వరకు మరో ఆవర్తనం విస్తరించి ఉండటంతో వర్షాలు కురుస్తున్నాయి. ఇదే సమయంలో ఒడిశా నుంచి ఛత్తీస్‌గఢ్ మీదుగా ద్రోణి కొనసాగుతుండటంతో వాతావరణంలో అస్థిరత పెరిగింది. ఈ ప్రభావాలకు తోడు తెలుగు రాష్ట్రాలపై నైరుతి, ఆగ్నేయ దిశల నుంచి గాలులు వీస్తుండటంతో పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశముందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఉత్తర కోస్తా, రాయలసీమ, తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా అధికారులు వేస్తున్నారు. రెండు రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లో పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. వర్షాల సమయంలో చెట్ల కింద నిలబడకూడదని, అవసరం లేకుంటే బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. రైతులు కూడా పంటల సంరక్షణ విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## నకిలీ డాక్యుమెంట్ల కేసులో కాకాణికి చుక్కెదురు

### విచారణను విజయవాడలోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టుకు బదలీ

**విజయవాడ,మే 8,ప్రభాతవార్తప్రతినిధి:** నకిలీ డాక్యుమెంట్ల కేసులో కాకాణికి చుక్కెదురయింది. కేసులో నుంచి తన పేరు తప్పించాలని డిశ్చార్జి పిటీషన్ కాకాణి వేసారు. ఆ తర్వాత కేసును నెల్లూరు కోర్టులోనే విచారణ జరపాలని మరో పిటీషన్ దాఖలు చేసారు. రెండు పిటీషన్లను కొట్టేస్తూ కాకాణి గోవర్ధన్ రెడ్డికి షాకిచ్చింది కోర్టు. మూడు రోజుల్లో విజయవాడలోని స్పెషల్ కోర్టుకు కేసు వివరాలన్నీ పంపాలని నెల్లూరు 4వ అదనపు మెజిస్ట్రేట్ కోర్టు ఆదేశించింది..2016లో సోమిరెడ్డి కుటుంబానికి విదేశాల్లో రూ.వెయ్యి కోట్లు ఆస్తులున్నాయంటూ నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి మీడియా ఎదుట ప్రదర్శించిన కాకాణి గోవర్ధన్ రెడ్డి..అప్పట్లో నకిలీ డాక్యుమెంట్ల విషయమై సోమిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రెండు నెలలు అజ్ఞాతంలో ఉండి సుప్రీం కోర్టులో కండిషన్ బెయిల్ పొందిన కాకాణి. ఇదే కేసులో కీలక ఆధారాలు కోర్టు భవనంలోనే చోరీకి గురికావడం అప్పట్లో దేశంలోనే సంచలనంగా మారింది. చివరకు ఆ కేసును చిల్లర దొంగలపైకి నెట్టి గోవర్ధన్ రెడ్డి తప్పించుకున్నారనే అభియోగాలున్నాయి.

# ఇక పాలన సరళం

>> ఒకే ప్లాట్ ఫాంపై ఉండేలా చూడాలని ఐటీ శాఖకు సీఎం సూచించారు. అన్ని శాఖలకు సంబంధించిన కేపీఐలతో ఓ డ్యాష్ బోర్డు తయారు చేస్తామని మంత్రి నారా లోకేశ్ వివరించారు. రోజువారీ లక్ష్యాలను ఈ డ్యాష్ బోర్డు నుంచి గుర్తించి దానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు ఉంటుందని చెప్పారు. 90 రోజుల్లో ఈ డ్యాష్ బోర్డును అందుబాటులోకి తెస్తామని మంత్రి లోకేష్ చెప్పారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సులో ఫైళ్ల క్లియరెన్స్ అత్యంత ముఖ్య మైనదని సీఎం చంద్రబాబు అన్నారు. సీఎస్, సెక్రటరీలు, హెచ్వోడీలు మొదలుకుని మండల స్థాయి వరకు ఫైళ్ల క్లియరెన్సులో వేగం పెంచాలని ఆదేశించారు. ఫైళ్లను త్వరగా క్లియర్ చేస్తే ప్రభుత్వ సేవలు వేగంగా అందుతాయని అన్నారు. 24 గంటల్లోపు ఇఫైల్స్ డిస్పోజ్ చేసేలా శ్రద్ధ పెట్టాలని నిర్దేశించారు. పాలనకు టెక్నాలజీ అనుసంధానించడంతో పాటు హ్యూమన్ టచ్ కూడా ముఖ్యమని అభిప్రాయపడ్డారు. ఓ నిర్దుష్టమైన తేదీల్లో దీపం 2.0 కింద ఇచ్చే సబ్సీడి డబ్బులు లబ్దిదారులకు ఇచ్చేలా చూడాలి. దీపం 2.0 పథకానికి ఇప్పటి వరకు రూ. 3504 కోట్లు మేర ఖర్చు అయ్యిందని సీఎం తెలిపారు. దీపం2.0 పథకం కింద 1.08 కోట్ల మంది లబ్దిదారులు ఉన్నారు.స్త్రీశక్తి కింద ఇప్పటి వరకు 60.6 కోట్ల ప్రయాణాలు చేశారు.ఏడాదికి రూ. 1940 కోట్లను స్త్రీ శక్తికి ఖర్చు పెడుతున్నాం. తల్లికి వందనం ద్వారా 67 లక్షల మందికి రూ.10 వేల కోట్ల ఇస్తున్నాం.మే 19వ తేదీన మత్స్యకారుల సేవలో కార్యక్రమం రూ.286 కోట్ల మేర లబ్దిదారులకు పంపిణీ చేశామన్నారు. హాస్టళ్లల్లో ఏదీ వృధా కాకుండా చూడాలి. నెట్ జీరో విధానాన్ని హాస్టళ్లకు వర్తింప చేయాలని హాస్టళ్ల కిచెన్ల నుంచి వ్యర్థాలను సర్క్యులర్ ఎకానమీకి అనుసంధానం చేయాలని పేర్కొన్నారు. గిరిజన, ఎస్సీ సంక్షేమ శాఖలో చదువు తున్న విద్యార్థులు ఐఐటీ ర్యాంకులు సాధించేలా శిక్షణ ఇవ్వాల న్నారు. పావలా వడ్డీకే జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో చదువుకునేలా విద్యారుణం ఇప్పించేలా కార్యాచరణ చేపట్టాలని పేర్కొన్నారు. విదేశాల్లో ఉద్యోగాలు దక్కించుకునేలా ఎస్సీ,ఎస్టీ యువతకు జర్మన్ భాష నేర్పిస్తు న్నామని, గిరిజన ప్రాంతాల్లో కాఫీ, పసుపు, కుంకుమపువ్వు సాగును చేపడుతున్నామని, వాల్యు అడిషన్ వచ్చేలా ప్రాసెసింగ్ ప్రక్రియ చేపట్టాలన్నారు. తుపాన్ల హెచ్చరికలను స్వర్ణ గ్రామ,వార్డుల ద్వారా కూడా పంపించాలి.సీవీడ్ సాగుపై తీరప్రాంత జిల్లాల కలెక్టర్లు దృష్టి పెట్టాలి.అర్బన్ డెవలప్మెంట్ అథారిటీల్లో అక్రమ కట్టడాలపై దృష్టి పెట్టాలన్నారు. ఈఫైళ్ల క్లియరెన్స్‌లో మంత్రి అచ్చెన్నాయుడు సరికొత్త రికార్డు సృష్టించారన్నారు. గంటల్లో ఫైళ్ల పరిష్కారం చేసారు. మంత్రి అచ్చెన్న పనితీరుకు సీఎం చంద్రబాబు ప్రశంసించారు. ఇకపై నియోజకవర్గాల్లోనూ ప్రతి శుక్రవారం 'ఫీల్డ్ గ్రీవెన్స్ డే'నిర్వహించాలని కలెక్టర్లను ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై జరిగిన కలెక్టర్ల సదస్సులో సీఎం సమీక్ష చేపట్టి పలు కీలక సూచనలు చేశారు. కాగితాలు తీసుకుని కార్లో వదిలిపెట్టకుండా పిటిషన్లకు పరిష్కా రం చూపాలి అని కలెక్టర్లకు సీఎం స్పష్టం చేశారు.

# అచ్చెన్నాయుడు భేష్

>> ను రోజుల వ్యవధి నుంచి గంటల వ్యవ ధిలోకి తీసుకురావడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతృప్తి వ్యక్తం చేశారు. పరిపాలనలో వేగం, పారదర్శకత, ప్రజా ప్రయోజనాల పట్ల కట్టుబాటుతో ముందుకు సాగుతున్న మంత్రి అచ్చెన్నాయుడి పనితీరును సీఎం ప్రత్యేకంగా అభినందించారు. మంత్రి అచ్చెన్నాయుడు నాయకత్వంలో వ్యవసాయ, అనుబంధ శాఖల పరిపాలన మరింత సమ ర్థవంతంగా మారుతోందని, ప్రజలకు వేగవం తమైన సేవలు అందించాలనే ప్రభుత్వ సంక ల్పాన్ని ఆయన కార్యాచరణ స్పష్టంగా ప్రతిబిం బిస్తోందని అధికారులు పేర్కొన్నారు.

## కొత్త వాహనాలకు 24 గంటల్లోనే రిజిస్ట్రేషన్

>> విధానానికి సంబంధించిన ప్రతిపాదనలను రవాణా శాఖాధికారులు ప్రభుత్వానికి పంపారు.అక్కడ ఆమోదం లభిస్తే వెంటనే అమలు చేస్తారు,. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 27,000 వాహనాలు శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం రవాణాశాఖ అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ముఖ్యంగా నిర్ణీత గడువు లేకపోవడమే దీనికి ప్రధాన కారణం. తాజా విధానం అమలులోకి వస్తే రవాణాశాఖ అధికారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను కచ్చితంగా 24 గంటల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. అదే విధంగా డీలర్ వాహనానికి సాధారణ రిజిస్ట్రేషన్ చూశాక, ఫ్యాన్సీ నంబర్ కోరుకునే వాహనాలు మినహా, మిగిలిన వాటికి ఆన్ లైన్ అప్లికేషన్‌లను పరిశీలించి, 24 గంటల్లోపు ఆమోదించాలి. దీనికితోడు శాశ్వత రిజిస్ట్రేషన్ నంబర్ రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియ ఆ గడువు లోపే పూర్తి కావాలి. ఒకవేళ రవాణాశాఖ అధికారులు 24 గంటల్లోపు ఈ పూర్తి చేయకుండా జాప్యం చేసినా, 24 గంటల తర్వాత ఆటోమేటిక్‌గా రిజిస్ట్రేషన్‌కు ఆమోదం లభిస్తుంది. సెలవు రోజు అయినా సరే, ఆన్‌లైన్‌లో అధికారులు ఆమోదం తెలపొచ్చనిరవాణాశాఖ వర్గాలు తెలిపాయి. తాత్కాలిక రిజిస్ట్రేషన్‌తో పాటు శాశ్వత రిజిస్ట్రేషన్ అధికారాన్ని సైతం వాహన డీలర్‌కే అప్పగించే అంశాన్ని కూడా పరిశీలిం చాలని సీఎం చంద్రబాబు తొలుత సూచించారు. దీనివల్ల న్యాయపరమైన చిక్కులు వస్తాయని, రవాణా శాఖ వద్దే రిజిస్ట్రేషన్ అధికారం ఉండాలని అధికారులు తెలిపారు.

# ఈ సెట్ ఫలితాలు

>> కలుగుతుంది. ఈసెట్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియ జరుగుతుంది. ఫలితాలు, ర్యాంకు కార్డులను విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీంతో పాటు, విద్యార్థులకు మరింత సౌలభ్యంగా ఉండేందుకు ప్రభుత్వం ఈసారి వాట్సాప్ సేవలను కూడా అందుబాటులోకి తెచ్చింది.తమ ఫోన్‌లోని వాట్సాప్ నుంచి 9552300009 నంబర్‌కు సందేశం పంపి కూడా ర్యాంకు కార్డును సులభంగా పొందవచ్చు.ఫలితాల విడుదల ప్రక్రియపూర్తవడంతో, త్వరలోనే అడ్మిషన్ల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఉన్నతవిద్యామండలి విడుదల చేయనుంది. విద్యార్థులు తదుపరి ప్రకటనల కోసంఅధికారిక వెబ్‌సైట్‌ను గమనిస్తూ ఉండాలని అధికారులు సూచించారు. అర్హత సాధించిన విద్యార్థులందరికీ లోకేశ్ అభినందనలు తెలిపారు.

# ఉచిత డయాలసిస్ కేంద్రాలు

>> చెప్పారు. గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వ ఐదేళ్ల సుదీర్ఘ పాలనలో రాష్ట్రంలో కేవలం 19 డయాలసిస్ కేంద్రాలు మాత్రమే ఏర్పాటయ్యాయని ఆయన గుర్తుచేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే, ఇప్పటికే ఏర్పాటు చేసిన 12 కేంద్రాలతో పాటు, ఇప్పుడు కొత్తగా మరో 12 కేంద్రాలతో కలిపి మొత్తం 24 కేంద్రాల ఏర్పాటుకు వేగంగా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ వైద్యసేవ కింద ఏటా సుమారు రూ. 165 కోట్లను కేవలం కిడ్నీ రోగుల కోసమే ప్రభుత్వం ఖర్చు చేస్తోందని వెల్లడించారు. రాష్ట్రంలో కిడ్నీ బాధితుల సంక్షేమానికి, వారి ప్రాణాలను కాపాడేందుకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# ఇళ్లు కట్టాలి..ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

### ప్రజలకు విద్య, వైద్యం, విద్యుత్ భారాలు తగ్గాలి

### జాతీయ, అంతర్జాతీయ విద్యకు పావలా వడ్డీ రుణాలు: సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే 8, ప్రభాతవార్తప్రతినిధి:** సంతృప్త స్థాయిలో అందరికీ ఇళ్లుఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అవసరమైన వారికి ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి క్రమ బద్ధీకరించడం వంటి అంశాలపై ప్రభుత్వ యంత్రాంగం ఫోకస్ పెట్టాలని ఆదేశించారు. 2027 చివరి నాటికి రీ సర్వే పూర్తి చేయడంతోపాటు.22ఏ భూముల సమస్యలను పరిష్కరించాలని స్పష్టం చేశారు. 7వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో భాగంగా రెండో రోజున సీఎం చంద్రబాబు సంక్షేమ శాఖలు, రెవెన్యూ, హౌసింగ్, సమ్మర్ యాక్షన్ ప్లాన్ వంటి అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆగస్టు 15లోగా 2.50 లక్షల ఇళ్లకు సామూహిక గృహ ప్రవేశాలు జరగాలి. డిసెంబర్ నాటికల్లా మరో 2.38లక్షల ఇళ్లకు గృహ ప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకోవాలి. 2027 డిసెంబర్ నాటికి మరో 10 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యం. 2లక్షల మందికి ఇంటి జాగాలు అవసరం అవుతాయని అంచనా. 3 సెంట్లు గ్రామాల్లో, 2 సెంట్లు అర్బన్ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సి ఉంది. లబ్దిదారులు అంగీకరిస్తే ప్రస్తుతం ఉన్న వారికి అదే లేఅవుట్లల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వండి. ఇబ్బందులు లేని చోట భూసేకరణ, సమీకరణతో ఇళ్ల స్థలాలు ఇవ్వండి. ప్రభుత్వ భూములు, కొండ ప్రాంతాల్లో నిర్మించుకున్న ఇళ్లను క్రమ బద్ధీకరించాలి. ఇళ్ల క్రమబద్ధీకరణలో ఏమైనా ఇబ్బందులు వస్తే కెబినెట్‌కు పంపాలి మేం ఆమోదిస్తాం. ఇళ్ల క్రమ బద్దీకరణ పూర్తి చేయగలిగితే... విజయవాడలో 60 వేల మందికి, విశాఖలో 30 వేల మందికి లబ్ది చేకూరుతుంది. గుంటూరులో 22ఏభూముల సమస్యలను పరిష్కరించాలి. వచ్చే కలెక్టర్లసమావేశంలోగా 22ఏ పెండింగ్ ఉండకూడదు. భూవివాదాల్లో అతిపెద్ద లిటిగెంట్ రెవెన్యూ విభాగమే. 4 లక్షలకు పైగా భూవివాదాల కేసులు పెండింగులో ఉన్నాయి. ఖాళీగా ఉన్న డీఆర్వోలు, ఆర్డీవోల స్థానాలకు త్వరలో పోస్టింగ్స్ ఇస్తాం. జిల్లా కార్యాలయాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపడదాం. రీసర్వే ప్రక్రియను 2027మార్చిలోగా పూర్తి చేయాలి పట్టా దారు పాస్‌పుస్తకాలు కూడా జారీకావాలి అని సీఎం ఆదేశించారు.

**కమిషన్ నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు:** బుడగ జంగాలను ఎస్సీల్లో చేర్చాలనే డిమాండ్ ఉంది దీనిపై కేంద్రంతో మాట్లాడతాం. కేంద్రం నుంచి అనుమతులు వచ్చేలోపు ఉద్యోగాలు మినహా ఎస్సీలకు వర్తింప చేసే ప్రతి ప్రయోజనాన్ని బుడగజంగాలకు వర్తింప చేయాలి. రాష్ట్రంలో బీసీ కులాల వెనుకబాటుతనంపై అధ్యయనం చేయడానికి ఓ ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేశాం. కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల్లో తగిన రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు చేపడతాం. బీసీ హాస్టళ్లల్లో ఆర్వో యూనిట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాన్నారు. హాస్టళ్లకు మరమ్మత్తులు చేపట్టాం. ముస్లిం జనాభా ఉన్న చోట 175 నియోజకవర్గాల్లోనూ రూరల్ ఆటోనగర్‌లు ఏర్పాటు చేస్తే ఓ పారిశ్రామికవాడ సిద్ధం అవుతుంది. వక్ఫ్ బోర్డు స్థలాల్లో ఈ పారిశ్రామికవాడలను మైనారిటీల కోసమే ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. కలెక్టర్ల సమావేశాలు, సమీక్షలు గంటల తరబడి మీటింగులు అన్నీ ప్రజల కోసమేననే అంశాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ సిఎండిగా ఎంఎన్‌విఎస్ ప్రభాకర్ నియామకం

**న్యూఢిల్లీ:** భారతదేశ ప్రభుత్వ రంగ ఉక్కు పరిశ్రమలో ఒక కీలకమైన నాయకత్వ పరిణామంగా, విశాఖపట్నంలోని విశాఖ ఉక్కు కర్మాగారాన్ని (వైజాగ్ స్టీల్ ప్లాంట్) నిర్వహిస్తున్న 'రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్' (ఆర్ఐఎన్ఎల్) సంస్థకు ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి)గా ఎంఎన్‌విఎస్ ప్రభాకర్‌ను ఉక్కు మంత్రిత్వ శాఖ అధికారికంగా నియమించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఎన్ఎండిసి స్టీల్ లిమిటెడ్ (ఎన్ఎస్ఎల్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. భారత ప్రభుత్వ రంగ ఉక్కు సంస్థలకు అత్యంత కీలకమైన ఈ తరుణంలో ఆర్ఐఎన్ఎల్‌కు ఆయన్ను బదిలీ చేయడం వ్యూహాత్మక నాయకత్వ మార్పుగా పరిగణిస్తున్నారు. ఎంఎన్‌విఎస్ ప్రభాకర్ శ్రీకాకుళం జిల్లాకు చెందిన వ్యక్తి. ఈయన హయాంలో విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్యలు పరిష్కారం అవుతాయని విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## వారం - వర్జ్యం

09-05-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, కృత్తిక కార్తె
సప్తమి మ.1.59
శ్రవణ రా.11.21
వర్జ్యం : రా.3.35-తె.5.17
దు.తె.5.38-ఉ.7.17
శుభసమయం : ఉ.8.30-9.30
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** మీ వ్యక్తిగత విషయములను బయటకు వెల్లడి చేసే వ్యక్తులతో జాగ్రత్తగా ఉండుట మంచిది. ఆరోగ్యం జాగ్రత్త.

**వృషభం:** ఆలోచనలతో మీ మనస్సును ఆందోళనకు గురి చేయకండి. మిత్రుల నుండి ముఖ్య సమాచారం అందుకుంటారు.

**మిథునం:** పెద్దలతో సంభాషించనప్పుడు సంయమనమును పాటించండి. విందు, వినోదాలలో పాల్గొంటారు. వస్త్రలాభం.

**కర్కాటకం:** ఆర్థిక సంబంధిత విషయముల మీద మీ దృష్టిని కేంద్రీకరించవలసి వస్తుంది. ఉద్యోగులకు బదిలీలు.

**సింహం:** మీ కార్యాచరణకు సంబంధించిన ప్రణాళికలు పలువురితో ముడిపడి ఉండడం వలన పురోభివృద్ధి వేగం ఉండదు.

**కన్య :** ప్రతికూల వాతావరణంలో అనుకూల ఫలితాలు సాధించడానికి ఎంతో కృషి చేస్తారు. కొత్త మిత్రుల పరిచయాలు.

**తుల:** ఎంతో కృషి చేసి నామమాత్రపు ఫలితాలు సాధించడానికి ఎంతో కృషి చేస్తారు. నూతన విద్యావకాశాలు కలవు.

**వృశ్చికం:** ఉద్యోగములో కొందరు స్వార్థపరులు మీపై చేసే దుష్ప్రచారము వలన మానసిక ప్రశాంతతను కోల్పోతారు.

**ధనుస్సు:** వాహనముల మరమ్మత్తులకు గాను అధిక ధనవ్యయము సంభవము. భూవివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి.

**మకరం:** కోర్టు సంబంధమైన వ్యవహారములలో మధ్యవర్తుల సహాయ సహకారములను పొందుతారు. వాహన సౌలభ్యం.

**కుంభం:** వ్యక్తిగత విషయములలో సంయమనము పాటించండి. భవిష్యత్తులో సుఖపడాలంటే కష్టించక తప్పదని భావిస్తారు.

**మీనం:** చేపట్టిన పనులలో ఆటంకాలు తొలగి ఊపిరి పీల్చుకుంటారు. కుటుంబ సభ్యుల నుండి బయటపడతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కల్తీ 'పెద్దలు' తేలుతారా!

>> పాపంలో పెద్దలు ఎందరికి "ఉచ్చు"బిగుస్తుందోననే ఆందోళన రేకెత్తిస్తోంది. నిజంగా దేవదేవుడు ఏడుకొండల స్వామికి ఇంత పెద్ద పాపం తలపెట్టడం మాత్రం క్షమించరాని నేరమనేది కోట్లాదిమంది శ్రీవారి భక్తుల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటికే అదే కోణంలో సిబిఐ సిట్, ఏకసభ్యకమిటీ క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేపట్టి తగిన ఆధారాలతో నివేదికలు ఇవ్వడం సంచలనంగా మారింది. ఈ కల్తీపాపంలో పలువురు టిటిడి మార్కెటింగ్, కొనుగోళ్ళ విభాగాల జిఎం స్థాయి అధికారులు కటకటాల వెనక్కు వెళ్ళగా పాత్రధారులైన డెయిరీల ఉద్యోగులు, యాజమానులు, ట్యాంకర్ల డ్రైవర్లు రిమాండ్ నుండి బెయిల్‌పై బయట ఉంటున్నారు. 2019-24 మధ్యకాలంలో గత వైసిపి ప్రభుత్వంలోని టిటిడి బోర్డు ఛైర్మన్, కొందరు టిటిడి అధికారులు చేతులు కలిపి ఏకంగా టెండర్ల నిబంధనలే మార్పుచేశారనేది సిట్ నిగ్గుతేల్చింది.అంతేగాక అర్హత లేని డెయిరీలకు నెయ్యిసరఫరా టెండర్లు అప్పగించారనేది 2024లోనే వెలుగుచూసింది. దాదాపు 300కోట్లరూపాయలుపైమాటే ఆర్థిక లావాదేవీలు జరిగాయనేది తేల్చిన విషయం.

ఇప్పుడు కల్తీనెయ్యి పాపంలో మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, అప్పటి టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ (ఇప్పటికే చర్యలకు గురై పోస్టింగ్‌కూడాలేని), అదనపు ఇఒ ఏవి ధర్మారెడ్డి(కీలకమైన డిఆర్‌డిఒ శాఖ పదవి నుండి తప్పుకుని, విశ్రాంతత)పాత్ర తోబాటు ఎప్‌ఎసిఎఒ బాలాజీతో సహా చర్యలు తీసుకుని సస్పెన్షన్‌లో ఉన్న అప్పటి గోశాల డైరెక్టర్ డాక్టర్ హరనాథరెడ్డి, మార్కెటింగ్ విభాగం,కొనుగోళ్లకమిటీ, పోటు విభాగంకు చెందిన పాత్రధారులను 36మందిని గుర్తించిన సిట్ 11మంది టిటిడి అధికారులే ఉండటం విశేషం. మరీ ఈ త్రిసభ్యకమిటీ వీరందరినీ అరెస్ట్‌చేసేం దుకు చర్యలు తీసుకుంటుందా?లేక వారంరోజుల్లో నివేదికలు అందజేసి చేతులు దులుపుకుంటుందా అనేది మాత్రం వీడని సంశయం. ఏకసభ్యకమిటీ నివేదికలతో సంచలనాలు జరగనున్నాయని "వార్త"ముందే చెప్పింది. నెయ్యి "కల్తీ"లో గత అధికారుల మెడకు పాపం చుట్టుకుంటుందనే వెల్లడించింది.

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

గుంటూరు fb.com/vaartha Digital

Published from Guntur, Ongole, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

9-5-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 98 పేజీలు: 12 వెల: 6.50

హంటా వైరస్.. చాలా సీరియస్!

కట్టుబాట్లను కాదని అక్కా తమ్ముళ్ల వివాహం

# అదే సస్పెన్స్!



## ఇంకా 2సీట్ల దూరంలోనే..

- అర్ధరాత్రి దాటేదాకా కొనసాగిన హైడ్రామా
- విజయ్ ప్రమాణ స్వీకారానికి గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సాయంత్రం సమాచారం
- అంతలోనే ఇవ్వలేదంటూ వార్తలు
- మెజారిటీ మార్కుకు సంఖ్య చేరలేదని వెల్లడి
- ప్రమాణ స్వీకార కార్యక్రమం లేదని అర్ధరాత్రి ప్రకటన
- తాము మద్దతు ఇవ్వడంలేదన్న ఐయుఎంఎల్
- డిప్యూటీ సిఎం పదవి కావాలన్న విసికె

**గంటగంటకు మారిన రాజకీయంతో ఎడతెగని ఉత్కంఠ**



శుక్రవారం సాయంత్రం చెన్నైలోని లోక్‌భవన్‌లో గవర్నర్ ఆర్లేకర్‌తో భేటీ అయిన టివికె చీఫ్ విజయ్, ఎమ్మెల్యేలు

**చెన్నై, మే 8:** తమిళనాట రాజకీయాలు గంటగంటకు మారిపోతున్నాయి. విజయ్‌కు మద్దతిస్తామని ప్రకటించిన చిన్నపార్టీలు ఇపుడు ముఖం చాటేస్తున్నాయి. మూడు పర్యాయాలు గవర్నర్‌ను కలిసిన విజయ్ తనకు మెజార్టీ ఉందని లేఖలు ఇచ్చినప్పటికీ గవర్నర్ సంతృప్తి ప్రకటించలేదు. మరో ఇద్దరు తక్కువగా ఉన్నారని, 118 మార్కు వచ్చిన తర్వాత మాత్రమే ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానిస్తామని లోక్‌భవన్ కార్యాలయం స్పష్టంచేయడంతో విజయ్ ప్రమాణస్వీకారం శనివారం దాదాపుగా లేనట్లేనని తెలిపోయింది. ముందుగా సిపిఐ, సిపిఎం పార్టీలు మద్దతిస్తామని ప్రకటిం చాయి. విజయ్‌నేరుగా ఆ పార్టీల కార్యాలయాలకు వెళ్లి వారిని కలిసారు. తాము బయటినుంచి మద్దతిస్తామని మతశక్తులు రంగప్రవేశం చేయనీయకుండా ఉండేందుకే టివికెకు మద్దతిస్తామని ఈ రెండుపార్టీలుప్రకటించాయి. అయితే తాము డిఎంకె కూటమిలోనే ఉంటామని చెప్పిన వామపక్షాలు టివికెకు బయటినుంచి మద్దతిస్తామని స్పష్టంచేసాయి. అలాగే మరో రెండుస్థానాలున్న విసికె కూడా మద్దతిస్తున్నట్లు ముందుప్రకటించి తర్వాత ముఖం చాటేసింది. అదేవిధంగా రెండుస్థానాలు గెలిచిన ఐయుఎంఎల్ కూడా తాము టివికెకు మద్దతివ్వడం లేదని ప్రకటించడంతో తమిళనాడు రాజకీయ స్వరూపం ఒక్కసారిగా మారిపోయింది. విసికె, ఐయుఎంఎల్‌పార్టీలు తమ >>2

# ఇక పాలన సరళం

- విధానాల్లో సాంకేతికతతో పాటు మానవీయ దృక్పథం అవసరమే
- డిసెంబరు నాటికి అన్ని ప్రభుత్వ సేవలు వాట్సప్‌లోనే
- 'తల్లికి వందనం' కింద 10వేల కోట్ల భారీ సాయం
- ఇక ప్రతి శుక్రవారం గ్రీవెన్స్‌డే
- కలెక్టర్ల రెండోరోజు సదస్సులో సిఎం చంద్రబాబు




శుక్రవారం కలెక్టర్ల సమావేశంలో సిఎం చంద్రబాబు. చిత్రంలో సిఎస్ సాయి ప్రసాద్, డిజిపి హరీష్ గుప్తా, మంత్రులు లోకేష్, అనగాని

**విజయవాడ,మే 8,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ పాలనలో సాంకేతికతను పూర్తి స్థాయిలో వినియోగించడంతో పాటు మానవ ప్రమేయం కుడా నిబద్ధతతో కొనసాగాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. డిసెంబరు నాటికి అన్ని ప్రభుత్వ సేవల్ని వాట్సప్‌లో అందించాలని చంద్రబాబు కలెక్టర్లను ఆదేశిం చారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఉంటే ఎంత సమయం వృథా అవుతుందో ఆలోచించి నిబంధనలు, ప్రొసీజర్స్ సులభతరం చేయాలని సూచించారు. రెండో రోజు కలెక్టర్ల సద స్సులో అవేర్, వాట్సప్ గవర్నెన్స్, మనమిత్ర ద్వారా పౌరసేవలు వంటి 8 విభాగాలపై ముఖ్య మంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. డీప్ టెక్, సూపర్ సిక్స్, సంక్షేమంపై చంద్రబాబు సమీక్ష జరుపుతున్నారు. రెవెన్యూ, ఆదాయార్జన, విద్య, నైపుణ్యాభివృద్ధిపై చర్చించారు. కలెక్టర్ల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఎ. అను కున్న పనులు సకాలంలో జరగాల్సిందేనని సీఎం సూచించారు. తమ ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధిని సీఎంకు కలెక్టర్లు వివరించారు. ఆయ అంశాలపై సీఎం సమీక్షించారు. అవేర్ సహా వాట్సప్ గవర్నెన్స్ వినియోగంపై కలెక్టర్లకు సూచనలు చేశారు. ప్రజలకు త్వరితగతిన సేవలు అందిస్తూ ఆన్ లైన్ సేవలను పూర్తిగా అందుబాటులోకి తెస్తే సమయం వృథా కాదు అన్నారు. టెక్నాలజీ ఇంటిగ్రేషన్ జరిగితే పాలన సులభతరం అవుతుందన్నారు. వాట్సప్ గవర్నెన్స్ మనమిత్ర ద్వారా పౌరసేవలపై ప్రజలకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. అవేర్ 2.0 నుంచి వచ్చే సమాచారాన్ని ఇంటిగ్రేట్ చేసుకుంటూ నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. పరిపాలనలో భాగంగా వేర్వే రు వెబ్ సైట్లు, డ్యాష్ బోర్డులు కాకుండా >>2

## సత్యసాయిబాబాకు మాటిచ్చా!

- సత్యసాయి స్కీముల మెయింటెనెన్స్‌కు నిధులు ఇవ్వాల్సిందే
- సీనియర్ ఐఎఎస్ అధికారులను ఆదేశించిన సిఎం చంద్రబాబు
- జిల్లా కలెక్టర్ ఆనంద్ లేవనెత్తిన సమస్యపై స్పందించిన సిఎం

9లో



## పుదుచ్చేరి పీఠంపై మళ్లీ రంగస్వామి

ఎన్‌డిఎ శాసనసభాపక్ష నేతగా ఎన్నిక



## బెంగాల్ సిఎంగా సువేందు

నేడు కోల్‌కతాలో ప్రమాణం

హాజరు కానున్న ప్రధాని, కేంద్రమంత్రులు

**కోల్‌కతా, మే 8:** అన్ని ఊహాగానాలకు తెరదించుతూ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా సువేందు అధికారిని భారతీయ జనతా పార్టీ ఎంపిక చేసింది. శుక్రవారం కోల్‌కతాలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన బిజెపి శాసనసభా పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సువేందు పేరు ప్రతిపాదనకు రాగా, కొత్తగా ఎంపికైన ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఆమోదించారు. దీంతో పశ్చిమబెంగాల్ బిజెపి శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారిని కేంద్రం హోం మంత్రి అమిత్‌షా ప్రకటించారు. 'కాబోయే సిఎం'గా సువేందును అభివర్ణించారు. సోనార్ బంగ్లా కలల సాకారానికి కొత్త ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. తృణమూల్ కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలను ఓడిస్తూ తీర్పునిచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. బెంగాల్ ఎన్నికల్లో పలు బెదిరింపుల, >>2

# ఖరీఫ్ రైతుకు సర్కార్ అండ

- సమృద్ధిగా విత్తనాలు, ఎరువులు, సాగునీరు
- 15 నుంచే దశలవారీగా సాగునీటి విడుదల: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ, మే 8, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఖరీఫ్-2026 సీజన్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు వ్యవసాయశాఖ సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సాగునీరు సమయానికి అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. 2026-27 సంవత్సరానికి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా రూ.294 కోట్ల బడ్జెట్‌తో 7.46 లక్షల క్వింటాళ్ల విత్తనాలను రైతులకు రాయితీపై సరఫరా చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించడం ద్వారా అధిక దిగుబడులు సాధిం చేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఖరీఫ్- 2026 సీజన్‌కు అవసరమైన 93 వేల క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువు విత్తనాలను గత సంవత్సరాల మాదిరిగానే 50 శాతం రాయితీపై సరఫరా చేయ నున్నట్లు తెలిపారు. ఇప్పటికే 30 వేల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను సేకరించి రైతు సేవా కేం ద్రాల ద్వారా పంపిణీకి సిద్ధం చేసినట్లు చెప్పారు. మిగిలిన అవసరాల కోసం టీజీఎస్ డీసీ, హెచ్ఐఎల్, ఎన్ఎస్సీ, ఆంగ్రూ సంస్థల ద్వారా అదనపు విత్తనాల సేకరణ చర్యలు కొనసా గుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఏడాది 2.20 లక్షల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను 40 శాతం రాయితీపై పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. వేరుశనగ విత్తనాల సేకరణకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయిందని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మే 20 నుంచి రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ ప్రారంభమవుతుందని చెప్పారు. అలాగే 1.62 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాలను మే 15 నుంచి రాయితీపై రైతులకు అందజేయనున్నట్లు వెల్లడిం చారు. చిరుధాన్యాలు, అపరాలు తదితర ఇతర విత్తనాలను జూన్ 15 నుంచి రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఏపీ సీడ్స్ ద్వారా సరఫరా చేసే ప్రతి విత్తనాన్ని సంబంధిత ప్రయోగశాలల్లో నాణ్యతా పరీక్షలు నిర్వహించిన తరువాత మాత్రమే రైతు సేవా కేంద్రాలకు పంపిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలే అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. 2025-26 సంవత్సరం నుంచి గ్రామీణ విత్తనోత్పత్తి పథకానికి ప్రత్యామ్నాయంగా కొత్త విత్తన రకాల పెంపొందించడానికి తోడ్పాటు అనే సవరించిన సమగ్ర పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 1,03,901 క్వింటాళ్ల విత్తనోత్పత్తి జరిగిందని, 202627 సంవత్స రానికి 1,20,678 క్వింటాళ్ల విత్తనోత్పత్తి లక్ష్యంగా ప్రణాళిక రూపొందించామని చెప్పారు. గత ప్రభుత్వం 2019-20 నుంచి 2023-24 వరకు రాయితీ విత్తనాలు సరఫరా చేసిన సంస్థలకు రూ.476.94కోట్ల బకాయిలు ఉంచిందని మంత్రి విమర్శించారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి సంబంధిం చిన పూర్తి చెల్లింపులు ఇప్పటికే విడుదల >>2

## ఇ ఫైళ్ల క్లియరెన్స్‌లో అచ్చెన్నాయుడు భేష్



మంత్రిని ప్రశంసించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ మే 8, ప్రభాతవార్తప్రతినిధి:** ఇ ఫైళ్ల క్లియరెన్స్‌లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అసాధారణ వేగం ప్రదర్శిస్తూ పరిపాలనలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతున్నారు. ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఆయన తీసుకుంటున్న చర్యలు ప్రభుత్వ యంత్రాంగంలో చురుకుదనాన్ని పెంచుతున్నాయి. గతంలో ఇఫైళ్ల క్లియరెన్స్‌కు సుమారు 5గంటల సమయం తీసుకున్న మంత్రి అచ్చెన్నాయుడు, ప్రస్తుతం భారీ స్థాయిలో ఫైళ్లు వచ్చినప్పటికీ సరాసరి కేవలం 2గంటల 49నిమిషాల వ్యవధిలోనే ఫైళ్లను డిస్పోజ్ చేస్తుండటంపరిపాలనా సామర్థ్యానికి నిదర్శనమని అధికారులు వెల్లడించారు. ఇఫైళ్ల క్లియరెన్స్ >>2

## రాష్ట్రంలో కొత్తగా 12 ఉచిత డయాలసిస్ కేంద్రాలు



వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్

**విజయవాడ,మే 8,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని కిడ్నీ వ్యాధిగ్రస్తులకు కూటమి ప్రభుత్వం ఒక తీపిక బురు అందించింది. పేద రోగుల ఆర్థిక భారం తగ్గించే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. ప్రైవేట్, కార్పొ రేట్ ఆసుపత్రుల్లో వేలాది రూపాయలు ఖర్చు చేయలేక అవస్థలు పడుతున్న బాధితులకు అండగా నిలుస్తూ రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 12 ఉచిత డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రకటించారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వరంలా మారనున్న ఈ కొత్త కేంద్రాల పూర్తి వివరాలు తెలుసుకుందాం. కిడ్నీ వైఫల్యంతో బాధపడే రోగులు ప్రాణాలు నిలుపుకోవాలంటే క్రమం తప్పకుండా డయాలసిస్ (రక్తశుద్ధి) చేయించుకోవాలి. ఒక రోగి నెలకు కనీసం నాలుగు నుంచి ఐదు సార్లు రక్తశుద్ధి చేయించుకోవాల్సి న పరిస్థితి ఉంటుంది. దీనికోసం ప్రైవేట్ లేదా కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్తే ఒక్కో సెషన్‌కు రూ. 3,000 నుంచి రూ. 4,000 వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. దీంతో నెలకు పది నుంచి ఇరవై వేల రూపాయలు ఖర్చు చేయలేక పేద రోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఈ కష్టాలను పూర్తిగా తొలగించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా డయాలసిస్ సేవలను మరింత విస్తరించాలని ప్రస్తుతం ప్రైమ్ మినిస్టర్ నేషనల్ డయాలసిస్ ప్రోగ్రాంఖ కింద రాష్ట్రంలో 61 కేంద్రాలు చురుకుగా పని చేస్తున్నాయి. వీటికి అదనంగా ఇప్పుడు ప్రభుత్వం ప్రకటించిన 12 కేంద్రాలు తోడవుతాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉచిత డయాలసిస్ కేంద్రాల సంఖ్య 73కు చేరుకుంటుందని మంత్రి సత్యకుమార్ వివరించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల ప్రజలకు అందుబాటులో ఉండేలా ఈ కొత్త కేంద్రాలను వ్యూహాత్మకంగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ 12 కేంద్రాలు ఏర్పాటు కానున్న ప్రాంతాలు ఇవే. భీమవరం, పీలేరు, జమ్మలమడుగు, మైదుకూరు, వెంకటగిరి, అద్దంకి, కొండేపి, సున్నిపెంట, రైల్వేకోడూరు, కోవూరు, నందిగామ, వినుకొండ.రూ. 30 కోట్ల నిధులు, : ప్రభుత్వం ఈ కేంద్రాల ఏర్పాటు, నిర్వహణ బాధ్యతలను పారదర్శకంగా టెండర్ విధానం ద్వారా ఒక ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించింది. ఈ ఏజెన్సీ వచ్చే మూడు నెలల్లోగా ఈ కేంద్రాల నిర్వహణ బాధ్యతలను పూర్తిగా చేపట్టనుంది. రానున్న ఐదేళ్ల కాలానికి గానూ కూటమి ప్రభుత్వం ఈ ఉచిత సేవల ప్రాజెక్టు కోసం ఏకంగా రూ. 30 కోట్లు ఖర్చు చేయనుంది. ప్రతి కేంద్రంలో అత్యాధునిక సాంకేతికతతో కూడిన 5 రక్తశుద్ధి యంత్రాలను ఏర్పాటు చేస్తారు. ఒక్కో కేంద్రంలో ఈ యంత్రాల విలువే సుమారు రూ. 85 లక్షలు ఉంటుందని మంత్రి తెలిపారుగత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య ఉన్న చిత్తశుద్ధిని మంత్రి సత్యకుమార్ ఈ సందర్భంగా పోల్చి >>2

## ఈ సెట్ ఫలితాలు

మొత్తం 29,750 మందికి అర్హత

**విజయవాడ,మే8, ప్రభాతవార్తప్రతినిధి:** పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తయిన విద్యార్థులు బీటెక్ ద్వితీయ సంవత్సర ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఈసెట్ -2026 ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా విడుదల చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 23నరాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షకు మొత్తం 32,434 మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో 29,750 మంది అర్హత సాధించారు. ఈసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులందరికీ మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. పాలిటెక్నిక్, డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు నేరుగా బీటెక్, బీఈ కోర్సుల ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు (లేటరల్ ఎంట్రీ) ఈసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు. దీని ద్వారా విద్యార్థులు ఒక విద్యా సంవత్సరాన్ని ఆదా చేసుకునే అవకాశం >>2

## నేడు కోల్‌కతాకు సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే 8,ప్రభాతవార్తప్రతినిధి:** సీఎం చంద్రబాబు శనివారం పశ్చిమ బెంగాల్ పర్యటనకు వెళ్లనున్నారు. పశ్చిమబెంగాల్ నూతన సీఎం ప్రమాణస్వీకారంలో సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. పశ్చిమ బెంగాల్‌లో బిజెపి ఆధ్వర్యంలో కొత్త ప్రభుత్వం బాధ్యతలు చేపడుతుంది. ఏపీ సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవానికి వెళ్ళుతున్నారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో సీఎం ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం జరగనుంది.

## కొత్త వాహనాలకు 24 గంటల్లో రిజిస్ట్రేషన్



రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

**విజయవాడ.,మే8,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ విధానంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.గతంలో వాహనాలకు శాశ్వత రిజిస్ట్రేషన్ కావాలంటే రోజులు తరబడి ఎదురు చూడాల్సి వచ్చేది.ఇప్పుడు ఈ ప్రక్రియ 24 గంటల్లోనే పూర్తికానుంది. అమలు ఉన్న విధానాన్ని అనుసరించి వాహనానికి డీలర్ తాత్కాలిక రిజిస్ట్రేషన్ చూసిన తర్వాత దానికి రవాణా శాఖ అధికారులు తెలిపి, శాశ్వత రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది.ఇది తీవ్రమైన సమస్యగానే ఉంది. ఈ క్రమంలో ఈ వ్యవహారం సీఎం చంద్రబాబు దృష్టికి వెళ్ళింది.ఇటీవల రవాణాశాఖపై సమీక్షలో సీఎం ఈ అంశానికి తక్షణ పరిష్కారం తీసుకోవాలని ఆదేశించారు.ఈ క్రమంలో రవాణాశాఖ ఇప్పుడు కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చేందుకు తగిన చర్యలను చేపట్టింది. కొత్త >>2

# కల్తీ 'పెద్దలు' తేలుతారా!




- త్రిసభ్యకమిటీ ఏం తేలుస్తుందోనని అందరిలో ఉత్కంఠ
- కీలక సూత్రధారులపై విభిన్న అంచనాలు
- రూ.300 కోట్లుపైనే ఆర్థికలావాదేవీలు జరిగినట్లు స్పష్టం

**తిరుమల,మే 8ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండలస్వామి లడ్డూలకు రసాయనాలు కలిపిన కల్తీనెయ్యి సరఫరా, వినియోగించిన పాపంలో చిట్టచివరగా 'పెద్దల' పాత్రను తేల్చేందుకు ప్రభుత్వం నియమించిన 'త్రిసభ్య'కమిటీ తిరుమలకు రాకముందే ఉత్కంఠనెలకొంది. ఈ కేసులో తదుపరి ఎవరి పేర్లు బయటకు వస్తాయి, వారిని అరెస్టులు చేస్తారా తదుపరి పరిణామాలెలా ఉండబోతాయనేది తిరుమల,తిరుపతిలో సంచలనంగా మారింది. ఇప్పటికే 70లక్షల విలువైన కల్తీనెయ్యి తిరుమల లడ్డూలకు వాడారనే ఉదంతంపై సిబిఐ సిట్ అధికారులు, విశ్రాంత ఐఎఎస్,విశ్రాంత సిఎస్ దినేశ్ కుమార్ ఏకసభ్యకమిటీ సమగ్రంగా నివేదికలు అందించింది. ఈ ఇరుశాఖల నివేదికల్లో టిటిడి పెద్దలు, అధికారుల తప్పిదాలు, అక్రమాలు అవినీతి ఉందనేది దాదాపుగా తేల్చేసింది. అయితే 2019-24 మధ్యకాలంలో తొలినుండి ఈ అక్రమాలకు సూత్రధారులు ఎవరనేది మాత్రం తేల్చలేదు. ఇప్పుడు ఇందుకోసం ప్రభుత్వం ఆ నివేదికల ఆధారంగా పెద్దల పాత్ర నిగ్గుతేల్చి, వారిని శ్రీవారి భక్తుల ముందు దోషులుగా నిలబెట్టాలనే దృఢ నిశ్చయంతో ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా ,పోలీస్ బాస్ డిజిపి, న్యాయ శాఖ కార్యదర్శి సభ్యులుగా ఉన్నతస్థాయి త్రిసభ్య కమిటీని నియమించింది.ఈ కమిటీ శనివారం (నేడు),రేపు ఆదివారం తిరుమలకు రావచ్చని సమాచారం. ఈ కమిటీ సభ్యులు తిరుమల,తిరుపతికి చేరుకుంటే జరగబోయే తదుపరి విచారణ, దర్యాప్తు పరిణామాలు మాత్రం తీవ్రంగా ఉంటాయనే టిటిడి వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఉన్నతస్థాయి త్రిసభ్య కమిటీ తేల్చే నివేదికలతో చిట్టచివరగా "కల్తీ"నెయ్యి జిడ్డు >>2

వార్త

మూర్ఖుని హృదయం నాలుక మీద ఉంటుంది. వివేకవంతుని నాలుక హృదయంలో ఉంటుంది.

న- ఫ్రాంక్లిన్

# 'కడగండ్ల సాగు'

మానవుడు ఎంత సాంకేతిక పరిజ్ఞానం సంపాదించినా, ఇతర రంగాల్లో మరింత అభివృద్ధి సాధించినా ప్రకృతి ముందు తలవంచని పరిస్థితుల నుండి బయటపడలేకపోతున్నాడు. లేకుంటే ఏమిటి? తీవ్రమైన ఎండలతో అల్లాడుతూ గుక్కెడు మంచినీటి కోసం ఎదురుచూస్తూ ఎండవేడిమిని తట్టుకోలేకదేశ వ్యాప్తంగా ఎందరో ప్రజలు పరలోకానికి పయనం కడుతుంటే మరొకపక్క అకాల వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి మరింత క్లిష్టంగా తయారవుతున్నది. కొన్ని జిల్లాల్లో ఏకంగా నలభైఆరు డిగ్రీలు దాటినట్టు వార్తలు అందుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఎలా ఉంటుందోనని వాతావరణ శాస్త్రజ్ఞులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇలాంటి ఉపద్రవాలు సంభవించినప్పుడు వ్యవసాయరంగానికి అపార నష్టం జరుగుతున్నది. ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాల వల్ల తెలంగాణలో ఆరుగురు అన్నదాతలు మృతిచెందినట్లు సమాచారం. అర్థరాత్రి ఆకస్మికంగా ఉరుములు, మెరుపులతో, ఈదురుగాలులతో కురిసిన వర్షానికి మంచిర్యాల జిల్లా లక్సెటిపేట మండలం గంపలపల్లి గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు నాగయ్య, అభిరాంలు ధాన్యం కుప్పపై టార్పలేన్ కప్పేందుకు వెళ్లి అసువులు బాశారు. మరో రైతు ధాన్యం కుప్పల వద్దనే కాలం చేశాడు. ఈ అకాల వర్షాలు రైతులను కోలుకోకుండా చేస్తున్నాయి. ప్రస్తుతం యాసంగి వరి కోతలు ముమ్మరంగా సాగుతున్న ఈ సమయంలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు కుప్పలుగా పేరుకుపోయాయి. కిలోమీటర్ల కొద్దీ రోడ్లపక్కనే పోసి కొనేవారి కోసం ఎదురు చూస్తున్నారు. ఎందుకోఏమో కానీ రైతు పచ్చగా ఉంటే చూసి ఓర్వలేక పగబట్టి పిచ్చిబట్టి పంతం పూని ప్రకృతి దెబ్బమీద దెబ్బకొడుతున్నట్లుగా ఉంది. ఈసారి జనవరి, ఫిబ్రవరి నుండే ఈ అకాలవర్షాల దాడిఆరంభమైందనే చెప్పొచ్చు. ఇప్పుడు, అప్పుడు అని కాదు. ఎప్పుడు పడితే అప్పుడు అకాల వర్షాలు రైతులపై విరుచుకుపడుతున్నాయి. కలియుగం అంటే ఇదే కాబోలు. మనుషులతోపాటు కాలం కూడా మారిపోతున్నదేమోననిపిస్తున్నది. రుతువులను బట్టి కాలాలు, వాటి అనుగుణంగా సాగు చేయాల్సిన పంటలను దృష్టిలో ఉంచుకొని విధి విధానాలను రూపొందించుకుంటారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందిస్తున్న వ్యవసాయ ప్రణాళికలు, పథకాలు వీటికి తగి నట్లుగానే తయారు చేస్తారు. రైతులు తమ అనుభవాలను బట్టి ఏయే పంటలు ఎప్పుడు వేయాలో ముందే ప్రణాళిక వేసుకుంటారు. ఈ ప్రణాళికలన్నీ ఆయా రుతువులను బట్టి రూపొందించుకుంటారు. ఒక రకంగా చెప్పాలంటే రైతుల జీవన విధానం రుతుపవనాల మీదనే ఆధారపడి ఉంది. ఇప్పటికీ భారతదేశంలో అరవై శాతం మందికిపైగా రైతులు ఈ రుతువుల పైనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. ఇక సుడిగుండాలు, వాయుగుండాలు, తుఫానులు ఏర్పడడం కొత్తకాదు. వాటి వల్ల వర్షాలు కురవడం, జనజీవనాన్ని అతలాకు తలం చేయడంవంటివి రైతులకు తెలియని కావు. ఇదంతా ఖరీఫ్ సీజన్‌లో మాత్రమే జరుగుతుండడం సర్వసాధారణం. అలాగే రబీసీజన్‌కు సంబంధించి కూడా వేసవిలో మే చివరి వారంలో రోహిణికార్తె ముందో వెనుకో వడగండ్ల వానలు, గాలిదుమారాలు వచ్చి పంటలను నష్టం చేయడం విన్నాం, కన్నాం. అందుకే పంటలు మే రెండు వారానికి ఇంటికి చేర్చుకునే విధంగా రైతులు ప్రణాళికలను తయారు చేసుకుంటారు. ఇటు వ్యవసాయశాఖ కానీ, అటు నీటిపారుదలశాఖ కానీ అందుకు అనుగుణంగానే కార్యాచరణ రూపొందిస్తాయి. కానీ ఇప్పుడు అకాల వర్షాలు ఎప్పుడుపడితే అప్పుడు రావడంతో వారికి కూడా అంతుపట్టకుండాపోతున్నది. ఈ అకాల వర్షాలు ఒక్క తెలంగాణ జిల్లాలోనే కాదు, అటు ఆంధ్రప్రదేశ్ ఆ మాట కొస్తే దేశవ్యాప్తంగా కూడా విరుచుకుపడుతున్నాయి. ఇందుకు పాలకులు కూడా సమర్థ ప్రణాళికతో రైతులను ఆదుకునేందుకు అడుగులు వేయడం లేదేమోననిపిస్తున్నది. ముఖ్యంగా కొనుగోళ్ల విషయంలో పాలకులు చేస్తున్న నిర్లక్ష్యం రైతులకు మరింత కడగండ్లు వస్తున్నాయి. తెలం గాణలో వరిసాగు ఎంత జరిగిందో, ఎన్ని లక్షల టన్నుల దిగుబడి వస్తుందో అధికారవర్గాలకు తెలియంది కాదు. కానీ కొనుగోలుకు అందుకు తగినట్టుగా ప్రణాళికలు చేసుకోకపోవడం వల్లనే పరిస్థితి మరింత క్లిష్టంగా మారి రైతుల వ్యథ అరణ్యరోదనంగా మారిపోతున్నది. వరి పంటే కాదు, మొక్కజొన్న రైతుల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. రోడ్లపైనే ఎండబోసుకొని, ఎప్పుడు కొంటారా అని కొనేవారి కోసం ఎదురుచూడా ల్సిన దుర దృష్టపు పరిస్థితులు నెలకొన్నాయి. రాత్రిపగలు కాపలా ఉండాల్సి వస్తున్నది. ఈ బాధలు భరించలేక ప్రైవేట్ వ్యాపారులో ఏదో ఒక ధరకు తెగనమ్ముకుంటు న్నారని వెళ్లిపోతున్నారు. ఇక మామిడి తోటల రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కరోనా ప్రభావంతో లాక్‌డౌన్ ప్రకటించడంతో దాదాపు రెండేళ్లపాటు మామిడి పంటలను అమ్ముకోలేక రోడ్లపై పారబోయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇప్పుడు ఈ అకాల వర్షాలు, వడగండ్లు కోలు కోకుండా చేశాయి. ఇప్పటికే కొందరు మామిడి రైతులు తమ తోటలను నరికివేస్తున్నారు. ఇలాగే పరిస్థితి కొన సాగితే మామిడికి తిలోదకాలిచ్చే పరిస్థితులు ఇంకెతో దూరం లేదని చెప్పొచ్చు. కోట్లాది మంది రైతు కుటుంబాల జీవనోపాధికి సంబంధించిన వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేయడం ఏమాత్రం సమంజసంకాదు. నిరంతరం రాజకీయ వ్యూహ, ప్రతివ్యూహాలు, ఎత్తులు, పై ఎత్తులతో కాలం గడపకుండా రైతుల సంక్షేమం కోసం త్రికరణశుద్ధిగా కృషి చేయాల్సిన తరుణమిది.

లోకులు తొందరగా నిందిస్తారు. అంతే త్వరగా అభినందిస్తారు కూడా. అందువల్ల ఇతరులు నిన్ను గురించి అనుకునే మాటలకు అంత విలువ ఇవ్వొద్దు.



రామకృష్ణ పరమహంస

జీవితంలో విజయాలకు చాలా ఉపాయాలున్నాయి. కానీ మనం 'పని' చెయ్యనిదే అవి పనిచేయవు.



షేక్స్పియర్

# మాటలు దాటని 'అవినీతి వేటు'

**అప్పులు తెచ్చుకున్న నిధులు అవినీతిపరుల పాలుకాకుండా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. వారుతెచ్చిన, తెస్తున్న లక్షలాది కోట్ల రూపాయల అప్పులో వడ్డీతోసహా ప్రతిపైసా ప్రజలే చెల్లించాలనే వాస్తవాన్ని పాలకులు విస్మరించరాదు. చీకట్లో మూడోకంటికి తెలియకుండా జరుగుతున్న అవినీతిని అరికట్టలేకపోతేపోయారు. ప్రజల కళ్లముందు బాహాటంగా జరుగుతున్న అవినీతినైనా నియంత్రించకపోతే అప్రతిష్టపాలవు తారు. పాలకులు ఈ విషయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సామాన్యులు ప్రతిచిన్న విషయానికి ఆఫీసుల చుట్టూతిరగకుండా చూడగలిగితే చాలా వరకు సమస్యలు పరిష్కారమవుతాయి. పారదర్శకతను మరింత పెంచితే అవినీతిని కొంత అదుపు చేయవచ్చు. అవినీతిని నియం త్రించకుండా ఎన్ని లక్షల కోట్లు అప్పుతెచ్చినా పన్నుల రూపేణా ప్రజల ముక్కుపిండి ఎన్ని వేల కోట్ల రూపాయలు వసూలు చేసినా, సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా ఆశించిన ఫలితాలు చేకూరవు.**

దామెర్ల సాయిబాబ

శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలంటారు. అవినీతిని అరికట్టేందుకు ఎన్ని చట్టాలు చేస్తున్నా, మరెన్ని చర్యలు తీసుకుంటున్నా ఏదో ఒక రూపంలో అవినీతి పెరుగుతున్నదే తప్ప తగ్గడం లేదు. పాలకులు ఎంతగా అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు చేపట్టేకొద్దీ అవినీతి అంతగా పెరిగిపోతున్నది. అవినీతి, అభివృద్ధి కలిసి పయనించలేవు. అభివృద్ధి ముందుకు అడుగు వేస్తుంటే అవినీతి వెనక్కి గుంజుతుంటుంది. దేశవ్యాప్తంగా అవినీతిని అరికట్టేందుకు కేంద్ర పాలకులు పెద్ద ఎత్తునే చర్యలు చేపడుతున్నట్లు చెబుతున్నా క్షేత్రస్థాయిలో వాస్తవాలు వేరుగా ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో కూడా పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. అవినీతి రక్కసిని అదుపు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలుగు రాష్ట్రాల నేతలు ప్రకటనల మీద ప్రకటనలు గుప్పిస్తున్నారు. అవినీతిని కూకటి వేళ్లతో పెకిలించివేసేందుకు నడుం బిగించినట్లు చెప్పుకుంటున్నారు. అవినీతి రకరకాలుగా విస్తరిస్తున్నది. అందులో ఒక రకం మూడో మనిషికి కనపడదు. ఇచ్చిపుచ్చుకునే చేతులురెండూ అదృశ్యంగానే ఉంటాయి. ఆ అదృశ్యహస్తాలు మూడో నేత్రానికి దృశ్యమానమయ్యే అవకాశం ఉండదు. సమయం, సందర్భాన్ని బట్టి వదంతులు, ఆరోపణలు, నిజానిజాలు, వ్యక్తిగత గుణగణాలను బట్టి, ప్రస్తుత పరిస్థితులను బట్టి, వనరుల తాహతును బట్టి ఎవరికి వారు ఊహాజనితమైన నిర్ణయానికి రావాల్సిందే. అంతేకానీ అది ఫొటోలతోనో, ప్రత్యక్ష సాక్షులతోనో రుజువు చేయడం సామాన్యులకు సాధ్యమయ్యే పనికాదు. లంచాలు ఇచ్చినవారు తాము ఇచ్చినట్లు చెప్పరు. తీసుకున్నవారు తాము తీసుకున్నట్లు చెప్పరు. ఎవరైనా ఆరోపించినా ఇద్దరూ కలిసి ఖండిస్తారు. ఈ అవినీతి అరికట్టడానికి అధికారగణం కొంత కష్టపడాల్సి ఉంటుంది. కానీ మరో రకం అవినీతి బాహాటంగా, ప్రజల ముందు వికృతరూపం ధరించి నాట్యం చేస్తున్నా పాలకులు పట్టించుకోకపోవడం దురదృష్టకరం. ఈ అవినీతే ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేది. గతంలో పాలించిన నేతలు కొందరు ఇలా అప్రతిష్టపాలైన విషయం అందరికితెలిసిందే. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే ఏ పాలకులైనా వారి చెంతనే చేరిపోతారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో కొన్ని ప్రభుత్వ విభాగాల్లో ఈ అవినీతి అదుపులేకుండాపోతున్నది. ప్రభుత్వం నిబంధనలు విధించే కొద్దీ, చట్టాలు మార్చే కొద్దీ కొత్త పథకాలు ప్రవేశపెట్టే కొద్దీ వాటిని ఎలా లాభదాయకంగా మార్చుకోవాలనే విషయంలో కొందరు అధికారులు ఆరి తేరిపోతున్నారు. ప్రధానంగా రెవెన్యూ, మున్సిపల్, రిజిస్ట్రేషన్, పోలీసు, వైద్య ఆరోగ్య వంటి ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు ఉన్న శాఖల్లో అవినీతి పెరగడం ప్రభుత్వానికి అప్రతిష్ట తెచ్చిపెడుతున్నది. దీనికి తగ్గట్టుగా పాలకుల్లో కొందరు ఈ విషయంలో మాటలు చెప్తున్నారే తప్ప చేతల్లో నిక్కచ్చిగా వ్యవహరించకపోవడం వల్ల ఈ అవినీతిపరులకు అడ్డూ అదుపు లేకుండాపోతున్నది. దిగజారుతున్న ఈ మానవ విలువల పరిస్థితుల పట్ల నిజాయితీపరులైన అధికారుల వేదన మౌన రోదనగా మిగిలిపోతున్నది. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, అవినీతి నిరోధకశాఖ అంటూ నిఘా, తనిఖీ విభాగాలు పెంచుకుపోతున్నారే తప్ప అక్కడ సమర్థులు, అంకితభావం కలిగిన అధికారులను నియమించడంలో విఫలమవుతున్నారే మోననిపిస్తున్నది. ఒకవేళ అక్కడక్కడ

## ఒక్క మాట

నియమించినా వారిని స్వతంత్రంగా వ్యవహరించనీయకుండా కొందరు నేతలు మోకాలొడ్డుతున్నట్లు కూడా ఆరోపణలున్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో లక్షలాదిమంది రైతులు భూసంబంధమైన చిన్నచిన్న సమస్యల పరిష్కారం కోసం ఏళ్లతరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాలకు ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి తమ బాధలను లిఖిత పూర్వకంగా అందచేసుకుంటున్నారు. అయినా ఫలితం లేకుండా పోతున్నది. ఎక్కడికి వెళ్లి రైతులను కదలించినా రైతులు తమ బాధలను కథలుకథలుగా చెప్పుకుంటున్నారు. ఒక్క రెవెన్యూ శాఖలోనే కాదు మిగిలిన శాఖల్లో కూడా పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. చివరకు ప్రాణాలు కాపాడాల్సిన వైద్యరంగంలో కూడా ఈ పరిస్థితి పరాకాష్ఠకు చేరింది. ధర్మాస్పత్రుల్లో ఉచిత చికిత్స కరవైపోతున్నది. కొన్ని ఆస్పత్రుల్లో చివరకు శవాన్ని అప్పగించేందుకు కూడా డబ్బులు డిమాండ్ చేసి వసూలు చేసుకుంటున్నారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్య క్రమాల్లో అవినీతి గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. పేదలకు ఇచ్చే ఎన్ని లక్షల బోగస్ రేషన్ కార్డులు అనర్హుల చేతుల్లో ఉన్నాయో చెప్పలేం. పాలకులకు తెలిసినా వాటిని తొలగించలేని నిస్సహాయక స్థితి. అదేకాదు కరవులు వచ్చినా, వరదలు వచ్చినా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా అవినీతిపరుల పాలిట కల్పతరువుగా మారుతున్నాయి. రెండు రాష్ట్రాల్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఉన్నారు. ఊదురుగొట్టం వాడు ఊదుతూ ఉంటే చల్లార్పుగొట్టం వాడు చల్లార్పుతున్నట్లు లంచగొండి అధికారులను వలవేసి పట్టుకుంటున్నా, కేసులు పెడుతున్నా చట్టంలో ఉన్న లొసుగులుతోనో, రాజకీయ పలుకుబడితోనో కేసుల నుండి బయటపడి పాతమార్గంలోనే పయనిస్తున్నారు. రాజకీయ అండ ఉంటే ఎంతటి అవినీతికి పాల్పడినా తమకు ఎలాంటి ఇబ్బందులు ఉండవనే ధైర్యం ఈ లంచగొండి అధికారుల్లో పెరిగిపోతున్నది. అవినీతి నిరోధక శాఖ అధికారులు కూడా చిన్నచిన్న ఉద్యోగులనే వలవేసి పట్టు కుంటున్నారే తప్ప 'పెద్ద చేపల' జోలికి వెళ్లే సాహసం చేయడం లేదనే విమర్శలను కొట్టివేయలేం. అందుకు వారికి ఉన్న ఇబ్బందులు వారికి ఉన్నాయి. ఈ అవినీతిని నియంత్రించాలన్న చిత్తశుద్ధి పాలకులకు ఉంటే ఉన్నత స్థాయి నుంచే ప్రక్షాళన ప్రారంభించాలి. పెద్దపెద్ద పదవుల్లో కీలక స్థానంలో ఉన్న ఒకరిద్దరు అధికారులు, రాజకీయ నేతలను కట్టడి చేయగలిగితే కిందిస్థాయిలో కొంత జంకు ఏర్పడుతుంది. గతంలోఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాజకీయ అవినీతి అరికట్టేందుకు ఒక ప్రయత్నం జరిగింది. ఆ ప్రభావం కొంతకాలం కిందిస్థాయి వరకు కొనసాగింది. ఇంతకుముందు అవినీతి లేదని కానీ కొత్తగా వచ్చిందని కానీ చెప్పడం లేదు. పెరిగిపోతుండటంతోనే ఆందోళన వ్యక్తమవుతున్నది. మరొకపక్క తెలుగు రాష్ట్రాల ఆర్థిక పరి స్థితి అంతంత మాత్రంగానే ఉంది. ఉద్యోగులకు నెలనెలా జీతభత్యాలు చెల్లించేందుకే నిధులు వెతుక్కోవాల్సిన పరిస్థితి. పిట్టను కొట్టా పొయ్యిలో పెట్టా అన్నట్టుగా ఉంది. మరొక పక్క ఇప్పటికే లక్షలాది కోట్ల రూపాయలు అప్పులు తెచ్చారు. వేలాది కోట్ల రూపాయలమేర వడ్డీ చెల్లిస్తున్నారు. ఇలా అప్పులు తెచ్చుకున్న నిధులు అవినీతిపరుల పాలుకాకుండా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. వారుతెచ్చిన, తెస్తున్న లక్ష లాది కోట్ల రూపాయల అప్పులో వడ్డీతోసహా ప్రతిపైసా ప్రజలే చెల్లించాలనే వాస్తవాన్ని పాలకులు విస్మరించరాదు. చీకట్లో మూడోకంటికి తెలియకుండా జరుగుతున్న అవినీతిని అరికట్టలేకపోతేపోయారు. ప్రజల కళ్లముందు బాహాటంగా జరుగుతున్న అవినీతినైనా నియంత్రించకపోతే అప్రతిష్టపాలవుతారు. పాలకులు ఈ విషయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సామాన్యులు ప్రతిచిన్న విషయానికి ఆఫీసుల చుట్టూ తిరగకుండా చూడగలిగితే చాలా వరకు సమస్యలు పరిష్కారమవుతాయి. పారదర్శకతను మరింత పెంచితే అవినీతిని కొంత అదుపు చేయవచ్చు. అవినీతిని నియంత్రించకుండా ఎన్ని లక్షల కోట్లు అప్పుతెచ్చినా పన్నుల రూపేణా ప్రజల ముక్కుపిండి ఎన్ని వేల కోట్ల రూపాయలు వసూలు చేసినా, సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా ఆశించిన ఫలితాలు చేకూరవు. ●

# ఆత్మగౌరవానికి ప్రతీక లేబర్ అడ్డాలు

వాసంశెట్టి సుభాష్

లేబర్ అడ్డాలు (కార్మిక కూడళ్లు) కేవలం పనికోసం వేచి చూసే ప్రదేశాలు కావు, అవి శ్రమజీవుల ఆత్మగౌరవానికి, స్వాభిమానానికి ప్రతీకలు. కార్మికుల కష్టజీవుల చెమట, కండరాల నుండి చైతన్యం వస్తుందని, భావించే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు లేబర్ అడ్డాల ఏర్పాటుకు శ్రీకారంచుట్టారు. రాష్టంలోని 80 లక్షల మంది అసంఘటిత కార్మికుల సమస్యలకు పరిష్కార మార్గంగా, వారిని గౌరవప్రదమైన జీవనంవైపు నడిపించే కేంద్రాలుగా ఈ అడ్డాలు మారబోతున్నాయి. తెల్లవారుజామునే లేచి, ఎండనక, వాననక పని కోసం రోడ్డెక్కి, ఆత్మవిశ్వాసంతో కష్టపడే శ్రామికుల నైతిక బలం ఈ అడ్డాలు. ఎవరికీ తలవంచకుండా, సొంత శ్రమతో వచ్చిన డబ్బుతో కుటుంబాలను పోషించుకునే కార్మికుల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఈ అడ్డాలు నిలుస్తాయి. అంతేకాదు కూలీల్లో స్వాభిమానం పెరగడంతోపాటు వారికి తగినంత స్వేచ్ఛ కూడా లభిస్తుంది. అట్టడుగు వర్గాల కార్మికులు, కూలీలు ఒకచోట చేరినప్పుడు వారి సమస్యలను చర్చించుకుంటూ, సమాజంలో ఒకరికొకరు మద్దతుగా నిలవడంతో పాటు సామాజిక చైతన్యానికి ఈ లేబర్ అడ్డాలు ఎంతగానో దోహదపడతాయి. కూటమి ప్రభుత్వం కార్మికుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు లేబర్ అడ్డాల వద్ద ఆధునిక వసతులు, విశ్రాంతి గదులు కల్పించాలని నిర్ణయించడం వారి గౌరవాన్ని పెంచడమే కాదు. అడ్డా కూలీలకు అవి ఆధునిక ఆశ్రయాలు అనడంలో సందేహంలేదు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మాటల్లో చెప్పాలంటే, 'ఆత్మ గౌరవం లేని జీవితం వ్యర్థం. ఆత్మ గౌరవంతో జీవించాలంటే మనిషి కష్టాలనుఅధిగమించాల్సి ఉంటుంది'. ఒకప్పుడు నోట్లోకి నాలుగు వేళ్ళు వెళ్ళాలంటే కూలీ చేయాల్సిందే. ఉన్న ఊరిలో ఉపాధిలేక పట్టణాలకు వలసపోయి అడ్డా కూలీలుగా మారిన ఉదంతాలు కోకొల్లలు. గ్రామాల నుంచి పని కోసం నగరంలోని కూలీ అడ్డాకు తరలి వచ్చేవారు. కూలీ దొరికిన రోజుదొరికేది. దొరకని రోజుపస్తులే. అడ్డ కూలీల బ్రతుకులు నిత్యం పోరాటంతో కూడుకునేవి. తెల్లవారుజామునుంచే పట్టణాలలోని అడ్డాల వద్ద వేలాది మంది కార్మికులు కూలి పనుల కోసం పడిగాపులు కాసేవారు. తెల్ల చొక్కా వేసుకుని బైక్ పై, కారుపై వచ్చిన వ్యక్తుల వద్దకు వందలాది కూలీలు పరుగున వచ్చి సార్ పని ఉందా.. సార్ పని ఉందా.. ఏదైనా చేస్తాం, వస్తాం మీవద్దకు అంటూ బతిమిలాడుకుని పనికి వెళ్ళే పరిస్థితులను ముఖ్యమంత్రి స్వయంగా గమనించారు. ప్రతిపక్షనాయకుని హోదాలో రాష్ట్రంలో పర్యటించినప్పుడు కుటుంబాన్ని పోషించడానికి ఆ కష్ట జీవులు పడుతున్న తపనను చూసిన దృశ్యాలు ఆయన కండ్ల ముందు కదలాడుతున్నాయి. శ్రమ కోసం పాకులాడే పనిలోనే శ్రామికుడు నిమగ్నమైనప్పుడు మూడు పూటల తిండి కోసం తాను పడుతున్న నరకయాతనకు పుల్‌స్టాఫ్ పెట్టాలనే ఆలోచనముఖ్యమంత్రి మదిలో మెదిలింది. నిరుపేద కుటుంబాలు మనుషులుగా తల ఎత్తుకుని బతికినప్పుడే కదా అభివృద్ధి అని ఆయన భావించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఈ కూలీలకు ఏదో ఒక ప్రయోజనం చేకూర్చి వారిలో ఆత్మగౌరవాన్ని పెంపొందించే దిశగా కార్యాచరణ ప్రణాళికకు రూపకల్పన ప్రారంభించింది. ఆ ప్రణాళికకు అనుగుణంగా భవన నిర్మాణ కార్మికులు పనుల కోసం రోజూ ఉదయం రోడ్లపక్కన ఇకవేచి చూసే పని లేకుండా కూటమి ప్రభుత్వం లేబర్ అడ్డాలు(చౌక్‌లు)కుశ్రీకారం చుట్టింది. ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోని 15 నగరాల్లో ఈ అడ్డాలను నిర్మిస్తున్నారు. కేవలం ఇవి అడ్డాలేకాదు రాబోయే రోజుల్లో వీటిని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లుగా మార్చనున్నారు. స్కిల్డ్, అన్ స్కిల్డ్ కార్మికులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులిస్తారు. తద్వారా వీరికి ప్రత్యేకశిక్షణ ఇచ్చి స్కిల్డ్ లేబర్‌గా తయారు చేస్తారు. ఇప్పటికే నైపుణ్యం ఉన్న వారికి కూడా మరింత శిక్షణ ఇచ్చి హైపవర్ స్కిల్డ్ లేబర్ గా గుర్తిస్తారు. తద్వారా కార్మికుల సంక్షేమం, జీవితాలను సమూలంగా మార్చాలన్నది ఆయన ఉద్దేశం. అంతే కాకుండా అత్యాధునిక పనిముట్లతోపాటు ఈఎస్ఐ ఆస్పత్రుల ద్వారా మెరుగైన వైద్యం అందిస్తారు. ముఖ్యమంత్రి ఆలోచనలకనుగుణంగా పదిహేను నగరాల్లో ప్రయోగాత్మకంగా లేబర్ అడ్డాలను అభివృద్ధి చేస్తారు. కార్మికులసేవలు అవసరమైన ప్రజలు నేరుగా లేబర్ చౌక్‌కు వెళ్ళి సంప్రదించొచ్చు. రాష్ట్ర వ్యాప్తంగా 20లక్షల మంది భవన నిర్మాణ కార్మికులున్నారు. ఇప్పటివరకు వీరంతా ప్రధాన కూడళ్లలో రోజు ఉదయమే చేరి అక్కడి నుంచి పనులకు వెళ్ళుతుంటారు. ఈ 15 నగరాల్లో ఏర్పాటు కానున్న లేబర్ అడ్డాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.15 లక్షలు చొప్పున ఖర్చు చేస్తారు. వీటిలో తాగునీటి సదుపాయం, పురుషులు, మహిళలకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఏర్పాట్లు చేస్తారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన సరికొత్త ప్రయోగం లేబర్ అడ్డాలు విజయవంతమై కార్మికుల జీవితాల్లో వెలుగు క్రాంతులు ప్రసరించాలని ఆశిద్దాం. ●

## ప్రజావాక్కు



### వెంకన్న ఆస్తిలో సగం ఇవ్వాలి

నిన్న కర్ణాటకలో తొమ్మిదేళ్ళ అమ్మాయిని వెంకటేశ్వర స్వామి బొమ్మకు ఇచ్చి పెళ్లిచేశారు. పెళ్లి అయిన అమ్మాయికి భర్త ఆస్తిలో సగం వాటా రావాలి కదా!కనుక ఆ బాలికకు వేంకటేశ్వర స్వామికి ఉన్న వేలకోట్ల ఆస్తిలో సగం వాటా ఇవ్వటం న్యాయబద్ధం. 1970 దశకంలో ప్రకాశం జిల్లాలో బండ్లమ్మ అనే ఒక దొంగ మాత కూడా వెంకటేశ్వర స్వామిని పెళ్లి చేసుకొన్నది. తరువాత గర్భం వస్తె తీసి వేయించుకున్నది అని కూడా ఆరోజుల్లో పెద్ద ప్రచారం జరిగింది. టీటీడీ వారు ఈ విషయం పై స్పందించాలి. ఎవరంటే వారు ఇలా వెంకన్నను పెళ్లి చేసుకుంటే వెంకన్న పరువు పోదా!కనుక టీటీడీ వారు స్పందించాలి. వాటా అయినా ఇవ్వాలి లేదా ఇలాంటివి చెయ్యకూడదు , మా స్వామికి ఎలాంటి బాధ్యత లేదు అని ఐనా ప్రకటించాలి. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా ప్రభుత్వాలు బాధ్యులపై కటినమైన చర్యలు తీసుకోవాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### పెరుగుతున్న వాయుకాలుష్యం

పట్టణాలు నగరాల్లో రోజురోజుకు పెరుగుతున్న వాయు, ధ్వని, నీటి, ఆహారకాలుష్యం ప్రణాంతకమవుతున్నాయి. పెరుగుతున్న నగరజనాభాతోపాటు విపరీతంగా పెరుగుతున్న ప్రాణాంతక జబ్బులకు కారణం కాలుష్యంవాహనాలు వాయు కాలుష్యానికి ముఖ్యకారణం. దానికి తోడు వాహనాల నుండి విడుదల అయ్యేపొగ మీద సరైన నియంత్రణ లేకపోవడం.. వీధుల్లో వ్యర్థాలను తగులబెట్టడం మరో ముఖ్యమైన కారణం. పబ్లిక్ స్థలాల్లో ధూమపానం కూడా ఒకటి. మన భాగ్యనగరం కూడా ఢిల్లీతో కాలుష్యంలో పోటీ పడుతోంది. వాయు నాణ్యత నగరంలో విపరీతంగా పడిపోతుంది.

- టి. మురళీమోహన్, హైదరాబాద్

### పదవులు కల్పించాలి

2026-2027విద్యాసంవత్సరంలో నూతనవిద్య సంస్కరణలో భాగంగా 1 వ తరగతి నుండి 12 వ తరగతి వరకు ఒకే గొడుగు కిందికి తీసుకురావాలని ప్రభుత్వం ఆలోచిస్తుంది. ఈసందర్భంగాతెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేత నియమించబడిన అన్నిరకాల జూనియర్ లెక్చరర్స్ కు గెజిటెడ్ హోదా కల్పించి 11 వ తరగతి మరియు 12 వ తరగతి క్లాసులను బోధించే విధంగా ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆదేశాలు జారీ చేయాలి.

-రాపాక రవీందర్, జనగాం

### ప్లాస్టిక్ రహిత సమాజం సాధ్యమేనా?

ప్లాస్టిక్ రహిత సమాజం దిశగా అడుగులు వేయడం ప్రస్తుత కాలంలో అత్యవసరమైన కర్తవ్యం. మానవ నిర్మిత ఆవిష్కరణలలో ప్లాస్టిక్ అత్యంత ప్రమాదకరమైనదిగా మారింది. వాడుకలో సౌలభ్యంకోసం మనంవినియోగించే ప్లాస్టిక్ సంచులు, కప్పులు, సీసాలు భూమిలోకలిసిపోవడానికి వందల సంవత్సరాల సమయం పడుతుంది. ఈ విచ్చలవిడి వినియోగం పర్యావరణ వ్యవస్థను అతలాకుతలం చేస్తోంది. నగరాలలో మురుగునీటి కాలువలు పూడిపోవడానికి ప్లాస్టిక్ వ్యర్థాలే ప్రధాన కారణం. దీనివల్ల వర్షకాలంలో వరదలు సంభవించి జనజీవనం స్తంభిస్తోంది. ప్లాస్టిక్ కవర్లు తినడం వల్ల పశువులు, జలచరాలు మృత్యువాత పడుతున్నాయి. కాల్చడం వల్ల వెలువడే విషవాయువులు ఊపిరితిత్తుల వ్యాధులకు, క్యాన్సర్‌కు దారితీస్తున్నాయి. ప్లాస్టిక్ సూక్ష్మకణాలు ఆహార గొలుసు ద్వారా మానవ శరీరంలోకి ప్రవేశించి తీవ్ర ఆరోగ్య సమస్యలను సృష్టిస్తున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పదవీ విరమణ వయసు తగ్గించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయులు పదవీ విరమణ వయస్సు గురించి తీసుకున్న నిర్ణయం ఆహ్వానించదగ్గది. ప్రభుత్వ ఉద్యోగులు ఉపాధ్యాయులు పదవి విరమణ వయస్సు గతంలో ఏభైఎనిమిది సంవత్సరాలు ఉండేది. తర్వాత అరవై సంవత్సరాలుగా మార్చారు. ఓల్డ్ పెన్షన్ స్కీంలో పెన్షన్స్ ఇవ్వలేని కారణంగా అరవై రెండు సంవత్సరాలు గామాజీ మంత్రి జగన్మోహన్ రెడ్డి పెంచారు. పదవి విరమణ వయస్సు ఓల్డ్ పెన్షన్ స్కీం వలన ప్రభుత్వానికి భరించడానికి ఇష్టం లేని ఆర్థికభారం అవుతుంది. ఆనేపథ్యంలో ముప్పై మూడు ఏళ్ల సర్వీసు లేదా అరవై రెండు సంవత్సరాలు వయస్సు గానిర్ణయించి కొంతమందిని పదవి విరమణ చేయించాలని ప్రభుత్వం నిర్ణయించుకున్నట్టుగా కనిపిస్తూ ఉంది.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### బిసిలపై దృష్టి సారించాలి

బిసి కుటుంబాలు చాలా వరకు దిగువ స్థాయి ఆదాయంలోనే ఉంటారు. వృత్తులు బాగా పడిపోయిన తర్వాత కుటుంబ ఆదాయం బాగా తగ్గినది. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని పథకాలుపెడుతున్న కూడా బిసిలు నిరుద్యోగులుగా ఉంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల ఎంపికలో ఏ మాత్రం రిజర్వేషన్ ఇచ్చినా అది సమంజసమే. పోటీ పరీక్షల ఎంపికలో పరీక్ష ఫీజురాయితీ ఇవ్వాలి.

- బి.మేఘనాదం, విశాఖపట్నం

# అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత ఎల్‌నినో ప్రభావమేనా?



ఎం.నారాయణ స్వామి

రెండువేల ఇరవైఆరు ఎల్‌నినో ప్రభావం భారత్ పైనఉందా? అంటే ఉందని సీనియర్ సైంటిస్టులు చెబుతున్నారు. ఎల్‌నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల ఏర్పడే ఒకవాతావరణ పరిణామం. ఇది ప్రపంచవ్యాప్తంగా వాతావరణాన్ని ప్రభావితం చేస్తుంది. ప్రత్యేకంగా భారతదేశం వంటి దేశాల్లో వర్షపాతం మీద పెద్ద ప్రభావం ఉంటుంది. రాబోయే కాలంలో వర్షపాతం తగ్గే అవకాశం ఉంది. ఎల్‌నినో సమయంలో సాధారణంగా భారతదేశంలో ఋతుపవనాలు బలహీనంగామారుతాయి. వర్షాలు తగ్గేఅవకాశం ఉంది. ఉష్ణోగ్రతలు పెరగడం, ఎండలు ఎక్కువగా ఉండటమే కాకుండా, ఉష్ణోగ్రతలు సాధారణం కంటే పెరిగే అవకాశం ఉంటుంది. వేసవిలో గాలివేడి ఎక్కువగా రావచ్చు. వర్షాలు తగ్గితే పంటల దిగుబడి తగ్గుతుంది. నీటి కొరత పెరుగుతుంది. రైతులకు ఆర్థిక ఇబ్బందులు రావచ్చు. రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి స్థాయి తగ్గుతుంది. తాగునీరు, సాగునీటి కొరత పెరుగుతుంది. వాతావరణ అస్థిరత కొన్ని ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడం, మరికొన్ని చోట్ల ఒక్కసారిగా భారీ వర్షాలు పడటం వంటి అసాధారణ పరిస్థితులు రావచ్చు. ఎల్‌నినో ప్రభావం ప్రతి సంవత్సరం ఒకేలా ఉండదు. కొన్ని సంవత్సరాల్లో ప్రభావం తక్కువగా ఉంటుంది. కొన్ని సంవత్సరాల్లో ఎక్కువగా ఉంటుంది. ఇది భారత మెట్రోలాజికల్ డిపార్ట్‌మెంట్ అంచనాలపై ఆధారపడి మారుతూ ఉంటుంది. రాబోయే కాలంలో ఎల్‌నినో ఉంటే వర్షాలు తగ్గే అవకాశం ఎండలు ఎక్కువ ఉండి వ్యవసాయానికి, నీటికి కష్టం పెరుగడమే కాకుండా అనేక ఇబ్బందులకు దారి తీస్తుంది. ఎల్‌నినో అనేది గతంలో కూడా భారతదేశంపై ప్రభావం చూపింది. ఇది కొత్త విషయం కాదు. చాలాసార్లు భారత్‌లో వాతావరణాన్ని మార్చింది. 1982-83బలమైన ఎల్‌నినో వచ్చింది. భారతదేశంలో వర్షాలు తగ్గిపోయాయి. పంటలకు నష్టం జరిగింది. 1987 ఇది ఒక పెద్ద కరువు సంవత్సరం. ఋతుపవనాలు బలహీనంగా ఉండి వ్యవసాయం దెబ్బ తింది. 1997-98బలమైన ఎల్‌నినో వలన కొన్ని ప్రాంతాల్లో తక్కువ వర్షాలు, కొన్ని చోట్ల అసాధారణ వాతావరణ మార్పులు ఏర్పడ్డాయి. 2002లోఋతుపవనాలు భారీగా విఫలమయ్యాయి. దేశవ్యాప్తంగా కరువు పరిస్థితులు వచ్చా



యి. 2009మళ్లీ వర్షాలు తక్కువగాపడ్డాయి. వ్యవసాయం, నీటి వనరులు ప్రభావితమయ్యాయి. 2015-16 అనేక రాష్ట్రాల్లో ఎండలు ఎక్కువయ్యాయి. 2026-27లో ఎల్‌నినో ప్రభావం భారత్‌పై గణనీయంగా ఉండే అవకాశం ఉంది. ప్రపంచ వాతావరణ సంస్థలు చెబుతున్నది మే, జూలై 2026 మధ్య ఎల్‌నినో అభివృద్ధి అయ్యే అవకాశం (60-70శాతం) ఉంది. ఇది 2026 చివరి వరకు, 2027 ప్రారంభం వరకు కొనసాగవచ్చు. భారత్‌లో ఋతుపవనాల పై ప్రభావం ఉంటుందని ఐఎండి అంచనా వేసింది. ఐఎండి చెప్పే వివరాలు ప్రకారం చూస్తే సాధారణం కంటే తక్కువ వర్షపాతం (92శాతం) నమోదయ్యే అవకాశంఉంది. ఋతుపవనాలు బలహీనపడి వర్షాలు ఒకచోట ఎక్కువ, ఇంకొకచోట తక్కువ కురుస్తాయి. మధ్య మధ్యలో డ్రైస్పెల్స్ ఎక్కువ. రైతులకు ఇది పెద్ద ప్రమాదం. 2026లోఎక్కువ కాలం వేడి తరంగాలు రాత్రిపూట కూడా ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. 2026లో వేడి గాడ్పులు పెరిగి భూగర్భ జలాల పరిస్థితులు అయోమయంగా తయారయ్యే అవకాశం ఉంది. వర్షాలు తక్కువైతే బియ్యం, పత్తి, సోయాబీన్ పంటలు తగ్గే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో సాగు ప్రాంతం తగ్గవచ్చు. భూగర్భ జలాల మీదఆధారపడే పరిస్థితి పెరుగుతుంది. ఆహారధరలు పెరిగే అవకాశంఉంది. నీటి, విద్యుత్ కొరత ఏర్పడుతుంది. జీడీపీ మీద కూడా చిన్న ప్రభావం ఉండొచ్చు. హిందూ మహాసముద్ర ద్విధ్రువం ధనాత్మకం అయితే కొంత వర్షం పొదుపు అయ్యే అవకాశం ఉంది. గతంలో ఎల్‌నినో ప్రభావం చూపిన సంవత్సరాల్లో కూడా సాధారణ వర్షపాతం వచ్చిన సందర్భాలు ఉన్నాయి. 2026లో ఎల్‌నినో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలోని ఈ జిల్లాల పైన ఎక్కువ ప్రభావం ఉంటుంది అని చెబుతున్నారు. రాయలసీమ ప్రాంతంలోని కర్నూలు, అనంతపురం కడప, చిత్తూరు, జిల్లాలో మరింత కరువు పరిస్థితి వచ్చే అవకాశం ఉంది. దక్షిణ కోస్తా, ఆంధ్రా, నెల్లూరు ప్రకాశం జిల్లాలో కూడా వర్షాలు తగ్గవచ్చు. ఉత్తర కోస్తా (విజాగ్, శ్రీకాకుళం, విజయనగరం) జిల్లాలో బంగాళాఖాతం ప్రభావంవల్ల కొంతవరకు వర్షాలు కొనసాగుతాయి. తెలంగాణలో మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి జిల్లాలో వర్షాభావం ఎక్కువగా కనిపించొచ్చు. రంగారెడ్డి, మెదక్ నిజామాబాద్ జిల్లాలో, ఉత్తర తెలంగాణలో ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం అడవులు, స్థానిక వాతావరణం వల్ల కొంత వర్షం ఉంటుంది. 2026లో మే నెలల్లో వర్షాలు ఎలా ఉంటాయి? జూన్ -జూలై నెలలో ఋతుపవనాలు (వర్షాలు) ఆలస్యంగా మొదలయ్యే అవకాశం ఉంది. తక్కువ వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉంది. ఆగస్టు - సెప్టెంబర్ (పీక్ సీజన్)కొన్ని ప్రాంతాల్లో అకస్మాత్తుగా భారీ వర్షాలు కానీ మొత్తం వర్షపాతం మాత్రం సగటు కంటే తక్కువ ఉండొచ్చు. అక్టోబర్ - నవంబర్ తిరోగమిస్తున్న ఋతుపవనాలు కోస్తా ఆంధ్రలో మంచి వర్షాలు పడే అవకాశం ఉంది. తుఫాను ప్రభావం ఉండొచ్చు. ●

(రచయిత : సీనియర్ జర్నలిస్ట్)

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు

మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

MN 5 PAGE-GNT :MN 5 PAGE-GNT 01/01/2001 14:50 Page 1



గుంటూరు వార్త

# ఓపెన్ హార్ట్ సర్జరీల్లో..

# గుంటూరు జీజీ హెచ్ రికార్డ్..!

## జీ.జీ.హెచ్ సూపరిండెంట్ ఎస్ఎస్వి రమణ

**2 ఏళ్లలో 225 ఉచిత గుండె ఆపరేషన్లు**

**గుంటూరు మే 8 ప్రభాతవార్త ప్రతినిధి :** గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యులు అరుదైన ఘనత సాధించారు. కేవలం రెండు ఏళ్లలో 225 ఉచిత గుండె ఆపరేషన్లు చేసి రికార్డు సృష్టించారు. ఓపెన్ హార్ట్ సర్జరీల్లో జీ జీ

పేదలకు ఉచితంగా గుండె ఆపరేషన్ లు



హెచ్ గుంటూరు నగరంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరిండెంట్ ఎస్ ఎస్ వి రమణ మాట్లాడుతూ పేదల సేవలకోసం ప్రభుత్వ ఆసుపత్రి ఎప్పుడూ తెరిచే ఉంటుందని అన్నారు. 2025 మార్చి నుంచి 2026 మార్చి వరకు 125 గుండె శస్త్ర చికిత్సలు ఉచితంగా చేశామని తెలిపారు. అంతకు ముందు ఏడాది కాలంలో మరో 100 గుండె ఆపరేషన్లు చేశామని అన్నారు. రెండు ఏళ్లల్లో మొత్తం 225 ఉచిత గుండె శస్త్ర చికిత్సలు చేసి జిజిహెచ్ వైద్యులు అరుదైన ఘనత సాధించారని అన్నారు. ఇప్పటివరకు గుండె వాల్ ఆపరేషన్లు ఎన్టీఆర్ వైద్య సేవ కింద పేదలకు ఉచితంగా చేస్తున్నామని తెలిపారు. జిజిహెచ్ లో విజయవంతంగా చేయడం గర్వకారణమని అన్నారు. గుండె వైద్య నిపుణులు, మత్తు వైద్యులు, సిబ్బంది సహకారంతో పేదలకు వైద్య సేవలు అందిస్తున్నామని అన్నారు. గుండె కవాటాల శస్త్ర చికిత్సలు చేయడంలో నిపుణులైన వైద్యులు గుంటూరు జిజిహెచ్ లో వున్నారని స్పష్టం చేశారు. వాసక్యులర్, కిడ్నీ, జనరల్ సర్జరీలు ఉచితంగా చేసి విజయవంతంగా రోగులను ఇళ్ళకు పంపిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండె శస్త్ర చికిత్స విభాగాధిపతి డాక్టర్ హరికృష్ణ మూర్తి, డాక్టర్ కుప్పుస్వామి, డాక్టర్ యోగి, మత్తు వైద్యులు.. విభాగాధిపతి డాక్టర్ కె పోలయ్య, డాక్టర్ ఏమి మా ప్రియదర్శిని, డాక్టర్ ప్రవీణ్ , నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# అనవసరంగా ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే సహించం

## గుంటూరు నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ పనితీరుపై ఎమ్మెల్యే గళ్ళా మాధవి సీరియస్ రివ్యూ

**గుంటూరు, మే 8,ప్రభాతవార్త :** గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరుపై ఇటీవల అనేక ఆరోపణలు





వినిపిస్తున్నాయి, వాటిని వెంటనే సరిదిద్దుకోండి అని, అనవసరంగా ప్రజలను నిబంధనల పేరుతో ఇబ్బంది కలిగిస్తే సహించమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి హెచ్చరించారు. శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ నగర అభివృద్ధిలో టౌన్ ప్లానింగ్ శాఖ బాధ్యత చాలా కీలకమని, మంచి పనులు చేస్తే ప్రజల నుంచి ప్రశంసలు వస్తాయని, ఇదే అంశాన్ని ముఖ్యమంత్రి కార్యాలయం సైతం ధృవీకరించిందని, అన్నిటిలో బెస్ట్‌గా గుంటూరు వెస్ట్ టౌన్ ప్లానింగ్, శానిటేషన్ విభాగాల పని తీరు దారుణంగా ఉందని రిపోర్ట్ ఇచ్చారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. తప్పులు జరిగితే విమర్శలు కూడా సహజమని అన్నారు. అందుకే మీడియాలో వచ్చిన ప్రతి వార్తను అధికారులు బాధ్యతగా తీసుకుని పనితీరును మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా పనిచేయాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు. ప్రజలను అనవసరంగా ఇబ్బందులకు గురి చేయొద్దని, ఫైళ్లు పెండింగ్‌లో పెట్టి వేధించే పరిస్థితులు ఉండకూడదన్నారు. "మీరు నిజాయితీగా పని చేస్తే మీకు పూర్తి సహకారం ఉంటుంది. నిబంధనల ప్రకారం పనిచేసే అధికారులపై ఎటువంటి రాజకీయ ఒత్తిడులు ఉండవు" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. ప్రజలకు వేగంగా, పారదర్శకంగా సేవలు అందించడంతో పాటు నగర అభివృద్ధికి ఆటంకం కలిగించే అక్రమాలపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు.

# వివాహిత ఆత్మహత్యాయత్నం

**నిజాంపట్నం, మే 8, ప్రభాతవార్తః** మండల కేంద్రమైన నిజాంపట్నంకు కూతవేటు దూరంలో ఉన్న ఓ కుగ్రామంలో వివాహిత ఆత్మహత్యాయత ్నం మండలంలో అలజడి సృష్టిస్తోంది. మండలంలోని ప్రజలు ఈ విషయమై చర్చించుకుంటున్నారు. గురువారం అర్ధరాత్రి ఆ వివాహిత ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబ సభ్యులు వెంటనే చెరుకుపల్లిలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో ప్రథమ చికిత్స చేయించి అనంతరం తెనాలిలోని వైద్యశాలలో చేర్పించారు. అక్కడ ఆ వివాహిత మాట్లాడిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సదరు వివాహిత సోషల్ మీడియాలో చెప్పిన వివరాల ప్రకారం ఆమె తన భర్తతో కొంతకాలంగా దూరంగా ఉంటుందని తెలిపింది. మండలంలో వ్యవసాయశాఖలో చిరుద్యోగి. రైతు భరోసా సమావేశం ఉందని చెప్పి తనను తనపై అధికారి సమావేశానికి తీసుకువెళ్ళాడని, తనపై అసభ ్యకరంగా ప్రవర్తించాడని తెలిపింది. తనకు సహకరించకపోతే తన ఉద్యోగం తీసివేయిస్తానని బెదిరించాడని తెలియజేసింది. తనను అసభ్యకరంగా ఫొటోలు తీశాడని తాను కేకలు వేస్తున్నా ఎవరూ పట్టించుకోలేదని తెలిపింది. తన ఫొటోలు తన భర్తకు పంపాడని ఆ ఫొటోలు చూసి తన భర్త తనకు విడాకులు కావాలని కోర్టులో కేసు వేశాడని తెలియజేసింది. తాను పోలీస్‌స్టేషన్లో కేసు పెట్టగా సదరు అధికారి తనను వివాహం చేసుకుంటానని, కలిసి ఉందామని రాజీ చేసుకోమని కోరగా తాను అంగీకారం తెలిపానని చెప్పింది. తాము కొన్ని నెలలుగా సహజీవనం చేస్తున్నామని, మధ్యలో ఓ ప్రజాప్రతినిధి జోక్యం చేసుకుని తనకు , అధికారికి మధ్య మనస్పర్ధలకు కారణమయ్యాడన్నారు. విషయం డిఎస్పి దృష్టికి తీసుకువెళ్ళగా సదరు డిఎస్పి చందోలు పోలీస్‌స్టేషన్లో కేసు పెట్టమని తెలిపారని తాను అక్కడికి వెళ్ళే సరికి ఆ ప్రజా ప్రతినిధి మాటలు విన్న అధికారి ముందుగానే చందోలు పోలీస్‌స్టేషన్లో తనపై ఫిర్యాదు చేశాడని తెలియపర్చింది. ఆ ప్రజా ప్రతినిధి తనకు తరచూ ఫోన్‌లు చేస్తూ తనను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని తెలియజేసింది. తనకు న్యాయం చేయాలని ఆమె ఉన్నతాధికారులను వేడుకుంటున్నది. ఈ విషయమై వివరణ కోరేందుకు సదరు అధికారికి ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉండటం గమనార్హం.

# నిందితుని అరెస్టు

గుంటూరు క్రైమ్,మే8,ప్రభాతవార్త:నల్లపాడు జిడిసిసి బ్యాంక్ నిధుల దుర్వినియోగం కేసులో మరో నిందితుడిని గుంటూరు జిల్లా సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు.గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు సీసీఎస్ విభాగం డిఎస్పీ బి.వి. మధుసూదనరావు పర్యవేక్షణలో, నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో నమోదైన జిడిసిసి బ్యాంక్ నిధుల దుర్వినియోగం కేసులో మరో నిందితుడు కునిశెట్టి శివ నవీన్ (ఏ11) ను పోలీసులు అరెస్ట్ చేశారు.గురువారం మధ్యాహ్నం 1.30 గంటలకు గుంటూరు నగరంలోని నగరంపాలెం ఎస్.బి.ఐ బ్యాంక్ ఎదురుగా ఉన్న బస్ స్టాప్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం నల్లపాడు జిడిసిసి బ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేసిన దేవరకొండ అరుణ కుమారి, అప్పటి సీఈవో తొర్లికొండ కృష్ణవేణి, అప్పటి చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు లాలుపురం రాము,అప్పటి కమిటీ సభ్యులు కలిసి బ్యాంక్ నిధులను దుర్వినియోగం చేస్తూ, బ్యాంక్ నియమ నిబంధనలను ఉల్లంఘించి బ్యాంకుకు భారీ ఆర్థిక నష్టం కలిగించినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఈ వ్యవహారంపై గుంటూరు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డివిజినల్ కోఆపరేటివ్ అధికారి, తెనాలి వారు విచారణ నిర్వహించగా అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ అయింది.ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను సీసీఎస్ డిఎస్పీ బి.వి. మధుసూదనరావుకి అప్పగించగా, వారు అన్ని కోణాలలో విచారణ జరిపి,11వ నిందితుడు కునిశెట్టి శివ నవీన్ పాత్ర కూడా ఉన్నట్లు నిర్ధారించారు. ఈ కేసులో ఇంకా కొంతమంది నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు...

# పసుమర్రులో వైభవంగా శ్రీ కోదండ రామాలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం

## పాల్గొన్న శాసనసభ్యులు ప్రత్తిపాటి, ఎంపీ లావు



చిలకలూరిపేట, మే 8, ప్రభాతవార్త: మండల పరిధిలోని పసుమర్రు గ్రామంలో వేంచేసి ఉన్న సుమారు 100 సంవత్సరాల చరిత్ర కలిగిన పురాతన శ్రీ కోదండ రామాలయంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజా కార్యక్రమాలలో మణిమంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గారు, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు గారు పాల్గొన్నారు.. ఈ కార్యక్రమంలో వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మికతతో వెల్లివిరిసింది.

# ఇక పై ప్రతీ శుక్రవారం ఫీల్డ్ గ్రీవెన్స్ డే

## సీఎం చంద్రబాబు నాయుడు

**గుంటూరు మే 8 ప్రభాత వార్త ప్రతినిధి :** ప్రజలు అందించే అర్జీలు, ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి అలక్ష్యం చూపొద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కొందరు కలెక్టర్లు అర్జీలు తీసుకుని కారులోనే పడేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని.. అలా జరగకూడదని సీఎం స్పష్టం చేశారు. శుక్రవారం 7వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ రెండో రోజున వివిధ అంశాలపై సమీక్షి ంచారు. ఫైళ్ల క్లియరెన్స్.. ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, డేటా లేక్, అవేర్, వాట్సాప్ గవర్నెన్స్ వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇ ఫైళ్ల క్లియరెన్స్ రోజుల వ్యవధి నుంచి గంటల వ్యవధిలోకి రావడం మంచి పరిణామమని అన్నారు. ఇఫైళ్ల క్లియరెన్స్‌లో వేగంగా ఉన్న మంత్రులు, కలెక్టర్లు, ఎస్పీలు, సెక్రటరీలకు సీఎం అభినందించారు. పాలనకు టెక్నాలజీతో పాటు హ్యూమన్ టచ్ కూడా ముఖ్యమని, మానవీయ కోణంలో ఆలోచించి పరిపాలన చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఫైళ్ల క్లియరెన్స్ విషయంలో

**పీజీఆర్ఎస్ లో అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు**
**సత్వర ఫైళ్ల క్లియరెన్సుతో ప్రజలకు సత్వర సేవలు.**
**టెక్నాలజీని వినియోగించాలి..**
**మానవీయ కోణంలో వ్యవహరించాలి..**
**2వ రోజు జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు**

అందరి పని తీరును ఎప్పటికప్పుడు నమోదు చేస్తూనే ఉన్నామని స్పష్టం చేశారు. జిల్లా స్థాయిలో, హెచ్ఓడీలు తప్పనిసరిగా ఇఫైల్స్ మాత్రమే జనరేట్ చేయాలని, ప్రజలకు సేవలందించే విషయంలో వినూత్న ఆలోచనలతో పాటు మెరుగైన పాలనకూ కలెక్టర్లు చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు సూచించారు.





ప్రతి సోమవారం కలెక్టరేట్లో గ్రీవియన్స్ స్వీకరిస్తున్నట్టే ఇకపై ప్రతి శుక్రవారం నియోజకవర్గాల్లో గ్రీవియన్స్ స్వీకరించాలని తెలిపారు. ప్రతీ శుక్రవారం ఫీల్డ్ గ్రీవెన్స్ డేగా నిర్ణయించామని అన్నారు. కాగితాలు తీసుకుని కార్లో వదిలిపెట్టొద్దని, పిటిషన్లకు పరిష్కారం చూపాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. ప్రతీ నెలా ఒక నియోజకవర్గాన్ని నాలుగు సార్లు సందర్శించాలని అన్నారు.

**ఆన్ లైన్ సేవలతో అవినీతికి చెక్**

ప్రజలకు త్వరితగతిన సేవలు అందిస్తూ ఆన్ లైన్ సేవలను పూర్తిగా అందుబాటులోకి తెస్తే ప్రజల సమయం వృధా కాదని సీఎం స్పష్టం చేశారు. వాట్సప్ గవర్నెన్సు మనమిత్ర ద్వారా పౌరసేవలపై ప్రజలకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. డిసెంబరు నాటికి అన్ని సేవల్ని వాట్సప్ లో అందించేలా చూడాలన్నారు. ఆన్ లైన్ సేవల ద్వారా అవినీతితో పాటు దుర్వినియోగం కూడా తగ్గుతుందన్నారు. సీవీడ్ సాగుపై తీరప్రాంత జిల్లాల కలెక్టర్లు దృష్టి పెట్టాలని. మున్సిపాలిటీలు, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఎలాంటి అక్రమ నిర్మాణాలు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. పరిపాలనలో భాగంగా వేర్వేరు వెబ్ సైట్లు, డ్యాష్ బోర్డులు కాకుండా ఒకే ప్లాట్ ఫాంపై ఉండేలా చూడాలని ఐటీ శాఖకు సీఎం సూచించారు. అన్ని శాఖలకు సంబంధించిన







**పీజీఆర్ఎస్ కోసం ప్రజా దర్బార్లు**

పీజీఆర్ఎస్ కోసం ప్రజాదర్బార్ లాంటి ఓ వేదికను ఏర్పాటు చేయబోతున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఫిర్యాదులు స్వీకరించే సమయంలోనే ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పరిష్కరించే ప్రయత్నం చేద్దామని సూచించారు. మండల స్థాయిలోనూ పీజీఆర్ఎస్ విధానంలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించటం ద్వారా ప్రజలకు ఉపయోగపడుతుందని అన్నారు.

కేపీఐలతో ఓ డ్యాష్ బోర్డు తయారు చేస్తామని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ తెలిపారు. రోజువారీ లక్ష్యాలను ఈ డ్యాష్ బోర్డు నుంచి గుర్తించి దానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు ఉంటుందని మంత్రి లోకేష్ చెప్పారు. 90 రోజుల్లో ఈ డ్యాష్ బోర్డును అందుబాటులోకి తెస్తామని ఐటీ మంత్రి వెల్లడించారు. ఈ సమావేశంలో మంత్రులు, సీఎస్ సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

గుంటూరు, మే 8,ప్రభాతవార్త :ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే అవకాశం ప్రజాదర్బార్ ద్వారా కలిగిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. జగన్ ప్రభుత్వంలో సెంటు స్థలం ఇచ్చామని పట్టా చేతిలో పెట్టారు.. కానీ స్థలం ఎక్కడ ఉందో చూపించ లేదని, రేషన్ కార్డులు, పింఛన్లపై ఎమ్మెల్యే నసీర్ కు అర్జీలు అందజేశారు. వివిధ సమస్యలపై అర్జీలు దాఖలు కాగా కొన్ని సమస్యలపై సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే నసీర్ ఫోన్ లో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన అర్జీలను సంబంధిత అధికారులకు పంపించి పరిష్కారానికి చర్యలు చేపడతామని అర్జీదారులకు హామీ ఇచ్చారు. త్వరలో గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతామని భరోసా కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో కరెంటు బిల్లు ఎక్కువ వచ్చిందని, పెద్ద ఇల్లు ఉందని, ఇలా ఏవేవో కుంటిసాకులు చెప్పి పింఛన్లు, రేషన్ కార్డులకు ఎగనామం పెట్టారని తెలిపారు. దీంతో ప్రజాదర్బార్ లో ఎక్కువ శాతం పింఛన్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు వస్తున్నాయని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే పింఛన్ పెంచితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వెయ్యి రూపాయలు పెంచామని తెలిపారు. రాష్ట్రంలో అన్న క్యాంటీన్ల ద్వారా ఐదు రూపాయలకే కడుపు నిండా ఆహారం పెట్టే గొప్ప పథకానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. అగ్గిపెట్టెలులాంటి సెంటు భూమి ఇచ్చి నిరుపేదల జీవితాలతో ఆడుకున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. సూపర్ సిక్స్ ను సూపర్ హిట్ చేసి ప్రజలతో





# కుమార్తె పై అత్యాచారం కేసులో తండ్రికి జీవిత ఖైదు

**గుంటూరు లీగల్, మే 8 (ప్రభాతవార్త):** జీవితాంతం అండగా ఉంటానంటూ ఓ మహిళకు దగ్గరై, ప్రేమ, సహజీవనం, వివాహం అనంతరం, ఆమెకు పుట్టిన 12 ఏళ్ల బాలికపై అత్యంత పాశవికంగా అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ గుంటూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం శుక్రవారం సంచలనాత్మక తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం చిలకలూరిపేట, రెడ్ల బజారుకు చెందిన రాయపూడి శ్రీదేవికి 2006లో వివాహమై, ఒక పాప పుట్టాక భర్తతో విడిపోయింది. తిమ్మాపురం క్వార్టర్స్ లో ఉంటుండగా 2009లో ఆ ప్రాంతానికి చెందిన రాయపూడి మరియదాసు అనే పెయింటర్ తో పరిచయమై, ప్రేమగా మారి, కొంతకాలం సహజీవనం చేసిన అనంతరం వివాహం చేసుకున్నారు. శ్రీదేవికి కలిగిన కుమార్తె కూడా వీరితోనే కలిసి ఉండేది. శ్రీదేవి కూలి పనులకు వెళ్లిన సమయంలో బాలికపై మరియదాసు అత్యాచారానికి ప్రయత్నించేవాడు. రాయటానికి అవకాశం లేని అంశాలతో తీవ్రమైన అసభ్యకర ప్రవర్తనకు పాల్పడేవాడు. చాలాకాలం తల్లి శ్రీదేవికి ఈ విషయం తెలియలేదు. 2018 మార్చి నెలలో, ఒకరోజు ఇంటికి వచ్చిన తల్లికి నగ్న దృశ్యం కనపడటంతో భర్త మరియదాసును నిలదీసింది. తనకు దెయ్యం పట్టిందని, ఇలా ప్రవర్తించకూడదని క్షమాపణ కోరుకున్నాడు. పెద్దల సమక్షంలో పంచాయతీ కూడా జరిగింది.

**ధైర్యంగా కానిస్టేబుల్ కు బాలిక సమాచారం....**

వరుసకు తండ్రి తనపై శారీరక హింసకు గురిచేయడాన్ని తట్టుకోలేని బాలిక ధైర్యం చేసింది. అదే సమయంలో బాలిక చదివే స్కూల్లో చిలకలూరిపేట పోలీసులు పిల్లలకు "గుడ్ టచ్ బ్యాడ్ టచ్" అనే అంశంపై వివరిస్తున్నారు. తమ స్కూలుకు వచ్చిన పోలీసు టీంలోని మహిళా కానిస్టేబుల్ బిరుదు సరోజకు, ఈ బాలిక తనపై జరుగుతున్న ఆకృత్యాన్ని వివరించింది. ఆశ్చర్యపోయిన పోలీసులు 2019 ఆగస్టు 26వ తేదీన బాలిక నుండి, ఆమె తల్లి నుండి ఫిర్యాదు స్వీకరించి వాస్తవాలను రాబట్టారు. చిలకలూరిపేట పట్టణ ఎస్సై బి.శివరామయ్య కేసు నమోదు చేశారు. అప్పటి చిలకలూరిపేట సి.ఐ వి.సూర్యనారాయణ నిందితుడిని అరెస్ట్ చేశారు. సీఐ టి.వెంకటేశ్వర్లు చార్జిషీటు దాఖలు చేశారు. పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తీగల దుర్గాప్రసాద్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో యావజీవ కారాగార శిక్ష పది వేల రూపాయలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సుల్తానా బేగం తీర్పు చెప్పారు. ఈ కేసులో బాధితురాలు అయిన మైనర్ బాలికకు, ప్రభుత్వం ద్వారా ఐదు లక్షల రూపాయల పరిహారం అందించాలని ఆదేశించారు.

## శ్యామలా నగర్ రైల్వే గేటు వద్ద

# ఆర్.ఓ.బి నిర్మాణానికి చర్యలు

**గుంటూరు కార్పొరేషన్, మే 8 ( ప్రభాత వార్త ) :** గుంటూరు నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా శ్యామలా నగర్ రైల్వే గేటు వద్ద ఆర్.ఓ.బీ నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా, స్థానిక భవన యజమానులకు సమస్యలు లేకుండా శ్యామలా నగర్ రైల్వే గేటు దగ్గర ఆర్.ఓ.బీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయం పై శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని



సమావేశ మందిరంలో శ్యామల నగర్ రైల్వే గేటు పరిసర ప్రాంత యజమాభవనాలనులు, రైల్వేశాఖ , జిఎంసి అధికారులతో సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత రైల్వే అధికారుల ప్రతిపాదనలు, వారు చేసిన ట్రాఫిక్ సర్వే అంశాలను వివరించి, అనంతరం హాజరైన స్థానికుల అభిప్రాయాలను తెలుసుకొన్న కమిషనర్ ఆర్ఓబీ లేదా ఆర్యూబీలు ఏదైనా గుంటూరు నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం చేయడానికేనని, అందరికీ ఆమోదయోగ్యమైన నిర్మాణం చేయడానికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకుంటాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న అంశాలను, ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని, రైల్వే ఇంజినీరింగ్, జిఎంసి పట్టణ ప్రణాళిక అధికారులు త్వరలో సంయుక్త క్షేత్ర స్థాయి పరిశీలన చేయాలన్నారు. అనంతరం తాను కూడా పరిశీలించిన అనంతరం వారం రోజుల్లో మరొక సమావేశం నిర్వహించి, ఆర్ఓబీ లేదా ఆర్యూబీ అనే అంశంపై నిర్ణయానికి వద్దామని తెలిపారు. సమావేశంలో రైల్వే డిప్యూటీ సిఈ నాయుడు, జిఎంసి సిటి ప్లానర్ రాంబాబు, డిసిపీ సూరజ్ కుమార్, ఏసిపీ రెహ్మాన్, శ్యామల నగర్ రైల్వే గేటు పరిసర ప్రాంత భవన యజమానులు పాల్గొన్నారు.

# రోజువారి కూలీ పనులు చేసే కార్మికుల కోసం లేబర్ అడ్డాలు ఏర్పాటు

గుంటూరు కార్పొరేషన్, మే 8 ( ప్రభాత వార్త ) : గుంటూరు పట్టణంలో లేబర్ అడ్డాలు (ఇంటిగ్రేటెడ్ లేబర్ ఆమెనిటీస్ కాంప్లెక్స్) ఏర్పాటు చేసేందుకు అనువుగా వున్న పలు ప్రాంతాలలో స్థలాలను రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ గంధం చంద్రుడు, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్ తో కలిసి శుక్రవారం పరిశీలించారు. హిందూ కాలేజీ జంక్షన్, కంకర గుట్ట ప్రాంతాలను తనిఖీ చేశారు. జిల్లాలోని వివిధ గ్రామాల, ప్రాంతాల నుంచి కార్మికులు పని కోసం వచ్చి రోడ్ల మీద వేచి ఉండకుండా ఈ లేబర్ అడ్డాల్లో కూర్చొంటారని తెలిపారు. పని లేని సమయంలో కార్మికులకు స్కిల్ డెవలప్మెంటులో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వివిధ ప్రాంతాల్లో పనులు నిమిత్తం ఒకచోట కార్మికులు వేచి ఉండే ఆచారం ఉందని, కొంత మంది ఆయా పనులకు వెళ్ళగా మరి కొందరు పనులు ఆ ప్రాంతంలో ఖాళీగా ఉంటున్నారని చెప్పారు. ఇటువంటి వారిని గుర్తించి వారికి లేబర్ అడ్డాల్లో నైపుణ్య శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ అడ్డాల్లో తాగునీరు, మరుగుదొడ్లు సౌకర్యాలను కల్పించడం జరుగుతుందని, రాష్ట్రంలో వివిధ



ప్రాంతాల్లో లేబర్ అడ్డాలు ఏర్పాటు చేయుటకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ ఏ గాయత్రీ దేవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నిర్దేశిత గడువులోగా ప్రజా సమస్యలను పరిష్కరించాలి

## ఎమ్మెల్యే రామాంజనేయులు

**వట్టిచెరుకూరు, మే 8, ప్రభాతవార్త :** ప్రజాసమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్ కార్యక్రమమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అర్జీదారుల నుంచి పెద్దసంఖ్యలో స్పందన వచ్చింది. ప్రతి అర్జీదారుని సమస్యను స్వయంగా విన్నారు. సమస్యను సంబంధిత అధికారికి బదిలీ చేసి నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరియు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలనను ప్రజలకు చేరువ చేస్తున్నారని తెలియజేశారు. ప్రజల



కష్టాలను వారి సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి పరిష్కారం చూపటమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యమని వివరించారు. ప్రధానంగా ఆయా గ్రామాల్లో జరగబోయే మరియు జరగవలసిన అభివృద్ధి పనులు, పింఛన్లు, రేషన్ కార్డులు, రెవెన్యూ, తాగునీటి, విద్యుత్ సమస్యలు, స్థానిక మౌలిక సదుపాయాలు వంటి వివిధ సమస్యలపై ప్రజలు వినతులు సమర్పించినట్లు చెప్పారు. ప్రతి అర్జీని సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి కొన్ని సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించడం, మరికొన్ని సమస్యల పరిష్కారానికి సంబంధించిన అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఆ వివరాలను ఆయా అధికారుల లాక్ బుక్‌లో నమోదు చేసుకోవాలనీ, ఎప్పటిలోగా పరిష్కరిస్తారు? లేకుంటే ఎందుచేత పరిష్కారం కాలేదన్న సమాచారాన్ని సదరు అర్జీదారుని మొబైల్ నంబర్‌కు ఓటిపి రూపంలో తెలియజేయాలని సూచించారు. ప్రజాదర్బార్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో అత్యధిక భాగం భూసమస్యలేననీ, ఇవన్నీ గత వైసిపి ప్రభుత్వ పాపాలని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యువనేత విద్యాశాఖ మంత్రి లోకేష్ ట్యూషన్ల మేరకు ప్రజాదర్బార్ కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమం ఎక్కడ ఏర్పాటు చేసిన ప్రజలు అనేక సమస్యలతో ప్రజా దర్బారుకు వస్తున్నారని తెలిపారు. అనేకమంది పింఛన్లపై అర్జీలు అందించారని త్వరలోనే ప్రభుత్వం కొత్త పాలసీని పింఛన్లపై తీసుకురానుందని వివరించారు. ప్రజల సమస్యల కోసం సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందని, ఇది మీ అందరి ప్రభుత్వమని ప్రజలకు తెలియజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన సంక్షేమ పథకాలు అన్ని ఒక్కొక్కటిగా అమలు చేశామని, గత ప్రభుత్వంలో ఎవరు ప్రజల దగ్గరకు వెళ్ళింది లేదని వివరించారు. ఇకపై ప్రజా ప్రతినిధులు అధికారులు ఉమ్మడిగా పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించిన ఉన్నట్లు చెప్పారు. ఇప్పటివరకు మండలంలో వివిధ సమస్యలపై 1096 అర్జీలు అందగా, వాటిలో 1051 అర్జీలకు పరిష్కారం చూపినట్లు వివరించారు. ఇంకా 45 అర్జీలు పెండింగ్ లో ఉన్నాయని, వాటిని కూడా త్వరలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అధికారులు సమయపాలన పాటిస్తూ అర్జీదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం చూపుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఫిర్యాదులు అందిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ క్షమారాణి, డిప్యూటీ ఎంపీడీవోలు జ్యోతి, ఝాన్సీ రాణి, స్థానిక ఎస్సై బాబురావు, విద్యుత్, పిఆర్, హౌసింగ్ ఏఈలు రవితేజ, కిరణ్ కుమార్, బాబురావు, వైద్యాధికారులు డాక్టర్ శివాని, డాక్టర్ వెంకటేశ్వరరావు, పశు వైద్యాధికారి కోటేశ్వరమ్మ, మండల తెలుగుదేశం పార్టీ ప్రస్తుత, మాజీ అధ్యక్షులు మద్రి సాంబశివరావు, మన్నవ పూర్ణచంద్రరావు, ప్రత్తిపాడు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నార్నె బాబు, ఎంపీటీసీ సభ్యులు గోగినేని కళ్యాణ్ చక్రవర్తి, వెలుగు ఏపిఎం షాలేం రాజు, గొట్టిముక్కల సుబ్బారావు, నాగిశెట్టి నాగరాజు, వీరిశెట్టి జగన్మోహన్రావు, ఎనుముల రాంబాబు, ప్రత్తి తంబి, యూత్ నేత మన్నవ గోపి, పరిటాల హరిబాబు, జాగర్లమూడి రంగారావు, ఎడ్లపల్లి సత్యనారాయణ, ఏదుపాటి శివయ్య, ఉప్పుటూరి సుజాత, తోట అంకమ్మరావు, ముప్పా వాసు, మేదరమెట్ల శివశంకర్, కుర్ర రమేష్,తాటి వీరయ్య, ఉప్పుటూరి సాంబశివరావు, కొర్రపాటి సాంబశివరావు, వివిధ గ్రామాల మాజీ సర్పంచ్ లు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ, నీటి సంఘాల అధ్యక్షులు,బూత్ కన్వీనర్లు, కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు, పంచాయితీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆనందాన్ని పంచుతున్న కళాపరిషత్ నాటికలు

**పొన్నూరు, మే 8,ప్రభాతవార్త:** పొన్నూరు కళాపరిషత్ ఆధ్వర్యంలో నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతున్న రెండు తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికల పోటీలు ప్రేక్షకులకు ఆనందాన్ని ,ఉత్సాహాన్ని, ఆలోచనలను పంచుతున్నాయి. కళాపరిషత్ రజతోత్సవ వేడుకలు జరుపుకొంటున్న వేళ గతంలో కంటే భిన్నంగా నాటిక పోటీలను నిర్వహిస్తున్నారు. సమాజాభ్యుదయానికి, సమాజ అవగాహనకు, కళలను ప్రోత్సహించేందుకు ప్రధాన్యతనిస్తూ పోటీలను నిర్వహిస్తున్నారు. ప్రేక్షకులను కట్టిపడేసేవిధంగా ఏ నాటికలు ఉంటాయో వాటినే ఎంపిక చేసి ప్రదర్శించేవిధంగా కళాపరిషత్ అధ్యక్షుడు సూరినేని ఆంజనేయులునాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలుస్తుంది. ఆధునిక సాంకేతికత పెరిగాక కళలకు ఆదరణ తగ్గుతున్నప్పటికీ ఇక్కడ మాత్రం ఏ మాత్రం ఆదరణ తగ్గకుండా ఉండేవిధంగా ప్రేక్షకులను రాబట్టడంలో కళాపరిషత్ సభ్యులు విజయులయ్యారని చెప్పవచ్చు. కళాపరిషత్ అధ్యక్షుడు ఆంజనేయులునాయుడికి వివిధ అసోసియేషన్లు, ఆర్గనైజేషన్లు, పలు స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులతో పరిచయాలు ఉండడంతో మన ఆంజనేయులు నాయుడు నిర్వహించే కార్యక్రమాలు బాగుంటాయి....చూడాల్సిందేనంటూ ప్రేక్షకులు కూడా పెద్ద సంఖ్యలోనే తరలి వస్తున్నారు. దీంతో ఆశించిన మేర కంటే ఎక్కువగానే ప్రేక్షకుల సంఖ్య పెరిగిందనే చెప్పాలి. శుక్రవారం రెండు నాటికలను కళాకారులు ప్రదర్శించారు. అందులో మొదటి నాటిక బివి క్రియేషన్స్, కాకినాడవారు ప్రదర్శించిన కన్నీటికి విలువెంత అనే నాటిక ప్రేక్షకులను ఆలోచింప చేసింది. డాక్టర్ సరోజినీదేవి మానవసేవయే మాధవ సేవ అని భావిస్తూ వైద్య సేవలు కొనసాగిస్తున్న రోజులవి. ధర్మం కాస్త అధర్మంగా మారి డబ్బుకి విలువిస్తున్నారు సరోజినీదేవి. వైద్యం ప్రస్తుత రోజుల్లో ఖరీదు కావడం, ఖరీదైన వైద్యశాలల్లో డాక్టర్లు ఏ విధంగా డబ్బులు గుంజుతారో అనే విషయాలను ప్రేక్షకుల కళ్ళకు కట్టినట్లు చూయించారు. డబ్బే పరమావధిగా వైద్యాన్ని వ్యాపారంగా మార్చి దోచుకొంటున్న సరోజినిదేవిని న్యాయస్థానానికి అప్పగించే వరకు సితాలు స్త్రీ శక్తిగా తిరుగుబాటు చేయడం వంటి సంఘటనలు ప్రేక్షకులను ఆలోచింపచేశాయి. ఈ నాటికను కొమ్మినేని శేషయ్య కళాశాల సిబ్బంది సమర్పణ చేశారు. రెండవ నాటిక అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి దేవుణ్ణి చూశా నాటిక విశేషంగా ఆకట్టుకొంది. దైవం మానుషరూపేణా అని, దైవము దేవాలయాల్లో, కనిపించని లోకాలలోనే ఉండదు.....కనిపించే మనుషుల హృదయాల్లో కూడా ఉంటుందని నిరూపించిందీ నాటిక. ఎవరి హృదయమైతే ప్రేమ, జాలి, దయ, క్షమ, నిజాన్ని నిర్భయంగా ఒప్పుకోగలిగే సద్గుణము, పరోపకారం, పశ్చాత్తాపములతో నిండి ఉంటుందో వాళ్ళ హృదయాల్లో కూడా దేవుడు ఉంటాడని తెలిపిందీ నాటిక. గంగోత్రి సాయి ఈ నాటికకు దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులునాయుడు, ఆకుల సాంబశివరావు, నన్నపనేని రఘునాథ్, సిహెచ్‌వి రామకృష్ణ, ఎస్ఎం సుబాని, డివిఎస్ఆర్ కోటేశ్వరరావు తదితరులు ఏర్పాట్లు చేశారు.





# 83వ జయంతి కళ్యాణ వార్షిక బ్రహ్మోత్సవాలు

## -హనుమత్ పీఠం నిర్వాహకులు వల్లూరు శ్రీనివాసశర్మ

**పొన్నూరు, మే 8, ప్రభాతవార్త:** మండల పరిధిలోని నండూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ సువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామివారి 83వ జయంతి కళ్యాణ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరుగుతాయని హనుమత్ పీఠం నిర్వాహకులు వల్లూరు శ్రీనివాసశర్మ తెలిపారు. 11వ తేదీన ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనము, దీక్షాధారణ, ధ్వజారోహణ కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ప్రతి రోజు నిత్యవిధితోపాటు పలు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. శ్రీ లలితా,విష్ణు సహస్రనామ పారాయణలు జరుగుతాయన్నారు. 12వ తేదీ హనుమజ్జయంతి సందర్భంగా ఉదయం 6.30గంటలకు నిత్య అనుష్టానములు, అభిషేకాలు, విశేషార్చనలు జరుగుతాయన్నారు. రాత్రికి ఎదురుకోలోత్సవం, కళ్యాణోత్సవం జరుగుతాయన్నారు. 13వ తేదీన ఉదయం 5గంటలకు 108సార్లు హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందన్నారు. సాయంత్రి 6గంటలకు కళ్యాణ మూర్తులకు గ్రామోత్సవం జరుగుతుందన్నారు. ఉత్సవాల సందర్భంగా ప్రతి నిత్యం సాయంత్రం 7గంటలకు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకోవాలని వల్లూరు శ్రీనివాసశర్మ కోరారు.

# రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ

**తెనాలి, మే8,(ప్రభాతవార్త):** పేద మహిళల స్వయం ఉపాధి కింద వారిని ఆర్థికంగా బలపరచడం కోసం మహిళా సాధికారత ద్వారా ఆసరా అనే కార్యక్రమం కింద కుట్టు మిషన్లు సార్ కంపెనీ (సి ఎస్ ఆర్ ఫండ్



)రోటరీక్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్, ఆర్థిక సహకారం తో కలసి రోటరీ క్లబ్ తెనాలి వైకుంఠపురం సభ్యులు ఒక్క ఒక్క మిషన్కు3000/ రూపాయలు సమకూర్చి లక్ష రూపాయలు విలువైన పది కుట్టుమిషన్లు ఉషితముగా పంపిణీ చేయటం జరిగింది. క్లబ్ అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణ చంద్ పాల్గొని ఇవ్వడం జరిగింది.ఈకార్యక్రమంలో కార్యదర్శి గుమ్మడి వెంకటనారాయణ, ఇమిడియెట్ పాస్ట్ ప్రెసిడెంట్ ఈదర శ్రీనివాసరావు, ప్రెసిడెంట్ ఎలెక్ట్ గుమ్మడి సరోజ్ బాబు ప్రసాద్, కార్యదర్శి ఎలెక్ట్ కొల్లి రాజేంద్రప్రసాద్, బత్తుల వెంకటేశ్వరరావు, ఆలపాటి కిరణ్ చౌదరి, రఫీ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# ఎన్.సి.సి శిబిరం పోరాట స్ఫూర్తిని అందిస్తుంది

## ఈగల్ టీమ్ సి.ఐ. విక్టర్

గుంటూరు విద్య మే 8 ప్రభాతవార్త

ఎన్.సి.సి శిక్షణ శిబిరాలు విద్యార్థులలో పోటీ తత్వాన్ని, పోరాట స్ఫూర్తిని పెంపొందించి, వారు ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు దోహదపడతాయని ఈగల్ టీమ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ (సి.ఐ.) విక్టర్ అన్నారు.వివిఐటి (జుజ్జుగి) విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ఎన్.సి.సి 2(ఏ) బెటాలియన్ వార్షిక శిక్షణ



శిబిరంలో భాగంగా మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా ఈగల్ టీమ్ సి.ఐ. విక్టర్, ఎస్.ఐ. సునీల్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సి.ఐ. విక్టర్ మాట్లాడుతూ.. యువతను, విద్యార్థులను మాదకద్రవ్యాల మహమ్మారి నుండి కాపాడటం మరియు డ్రగ్స్ రవాణాను నిర్మూలించడమే ఈగల్ టీమ్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడటం ద్వారా వ్యక్తిగత ఎదుగుదల ఆగిపోతుందని, అది జీవిత ఉన్నతికి పెద్ద ఆటంకంగా మారుతుందని హెచ్చరించారు.అనంతరం ఎస్.ఐ. సునీల్ కుమార్ మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు బానిసలవ్వడం వల్ల సమాజంలో గౌరవం కోల్పోవడమే కాకుండా, నేర ప్రవృత్తి పెరిగి భవిష్యత్తు అంధకారమవుతుందని అన్నారు. డ్రగ్స్ లేదా గంజాయి కి సంభందించిన సమాచారం ఉంటే వెంటనే ఈగల్ టీం కాల్ సెంటర్ 1972కు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఈగల్ టీమ్ సభ్యులు, ఎన్.సి.సి అధికారులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# జలహారతి కార్యక్రమంలో భాగంగా కాలువలు సుందరీకరణ : మున్సిపల్ కమిషనర్

**తెనాలి మున్సిపాలిటీ మే8(ప్రభాతవార్త):** మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు పట్టణం లోని ఐయితానగర్ ప్రాంతంలో జలధార జల హారతి కార్యక్రమంలో భాగంగా, శుక్రవారం,కాలువలను శుభ్రం చేయించే పనులను పరిశీలించారు. పనులు సక్రమంగా జరిగే విధంగా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.40వ వార్డులో ప్రధానకాలువ పూడిక తీత పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కాలువలో ఉన్న షిల్ట్ ను అడుగు వరకు పూర్తిగా తొలగించాలని చెప్పారు. రెండవ వార్డ్ లో జరుగుతున్న సిమెంటు రోడ్ల మరమత్తు పనులను పరిశీలించి పనులు వేగవంతంగా పూర్తయ్యే విధంగా చూడాలని సూచించారు. జలధారజల హారతి కార్యక్రమంలో భాగంగా ఆయా ప్రాంతాల్లో పనులు చేయిస్తున్నట్లు చెప్పారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రధాన ,మధ్యస్థ కాలువలలో పూడికలు తీయిస్తున్నట్టు చెప్పారు. రెండో వార్డులు పాడైపోయిన సిమెంట్ రోడ్డుకు మరమ్మత్తులు చేయిస్తున్నట్లు



చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఇంజనీర్ ఆంజనేయరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాలు పోస్టరు ఆవిష్కరణ

తెనాలి మే8(ప్రభాతవార్త): దివిసీమ గాంధి,కీ.శే మండలి వెంకట కృష్ణారావు శతజయంతి సందర్భంగా, శతజయంతి ఉత్సవాల పోస్టర్ ను,శుక్రవారం శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆవిష్కరించారు.ఈ



సందర్భంగా "మహాపురుషుడు మండలి" నాటకం ప్రదర్శన నిర్వహించబడుతుందని,ఈ ఉత్సవాల్లో,డాక్టర్ వడ్లమూడి బాబు రాజేంద్ర ప్రసాద్,అరవ రామకృష్ణ కు మండలి సేవా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాలు శనివారం సాయంత్రం 6గంటలకు తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయని, కార్యక్రమం లో మహాపురుషుడు మండలి నాటకం ప్రదర్శన చేస్తున్నారని తెలిపారు.శుక్రవారం ఉదయం కార్యక్రమంకు సంబంధించిన ప్రచార ప్రతులను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆవిష్కరించారు.. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలి వెంకట కృష్ణారావు జీవితం ఆదర్శ ప్రాయం అన్నారు.ఆయన జీవితాన్ని నాటకంగా ప్రదర్శించడం ద్వారా సమాజానికి స్ఫూర్తి ప్రదాత ను పరిచయం చేసినట్లు అవుతుందని చెప్పారు.. నాటకాన్ని అందరూ చూడాలని..అదే ఆయనకు మనమిచ్చే నివాళులు అన్నారు.. నిర్వాహకులు చందు సుబ్బారావు మాట్లాడుతూ, కార్యక్రమం లో మండలి విశిష్ట సేవా పురస్కారాలను వి.జి.కె ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ వడ్లమూడి బాబు రాజేంద్ర ప్రసాద్... హైదరాబాద్ బి.హెచ్.ఇ.ఎల్ కు చెందిన ఎ.ఎస్.ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అరవ రామకృష్ణ కు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు.. అంతరిక్ష శాస్త్రవేత్త చందు సాంబశివరావు అధ్యక్షతన జరిగేసభలో అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్,శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ తో పాటు పలువురు నేతలు పాల్గొంటారని చెప్పారు.ఈ కార్యక్రమంలో నాటకం దర్శకుడు గంగోత్రి సాయి,వేజండ్ల సత్య తదితరులు పాల్గొన్నారు.

# డ్రాయింగ్ పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ

**తెనాలి, మే8,(ప్రభాతవార్త):** రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో శుక్రవారం, స్థానిక బస్టాండ్ వద్ద గల ఈకన్వెన్షన్ ఫంక్షన్



హాల్ నందు ప్రపంచ శాంతి అనే అంశంపై డ్రాయింగ్ పోటీలు మరియు వక్తృత్వ పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి తెనాలి పరిసర ప్రాంతాల నుండి 30 మంది విద్యార్థులు పాల్గొని వారి ఆలోచనలను డ్రాయింగ్ రూపంలో మరియు ఉపన్యాస రూపంలో వెలువరించడం జరిగింది ఈ పోటీలలో పాల్గొని విజయం సాధించిన విద్యార్థులకు 9వ తేదీ శనివారం సాయంత్రం ఐదు గంటలకు ఈకన్వెన్షన్ నందు బహుమతి ప్రధాన కార్యక్రమం జరుగుతుందని, దీంతోపాటుగా ఈ ఏడాది స్కూల్స్లో ఏర్పాటుచేసిన ఇంట్రాక్ట్ క్లబ్బులలో అత్యవసర సమయాలలో గాని లేదా వివిధ సమయాలలో గాని ఎవరైతే ఎక్కువ సేవ చేశారు వారికి ఒకేషనల్ అవార్డ్స్ ప్రధాన కూడా జరుగుతుందని, అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వరరావు అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణ చంద్ తెలియజేశారు.

# గుంటూరు పశ్చిమ ఎంఈఓ ను మర్యాదపూర్వకంగా కలిసిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు

**గుంటూరు విద్య, మే 8, ప్రభాతవార్త :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి నూతన ఎంఈఓ గా నియమితులైన సిహెచ్ లక్ష్మణరావు ని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేసి, పూల బొకే ను అందించి, శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గం లోని ఉపాధ్యాయుల జీతాలు సక్రమంగా ఒకటో తారీఖున అందేలా కృషి చేస్తానని, ఎటువంటి బిల్లులు పెండింగ్లో లేకుండా ఉండేలా చూస్తానని నూతన మండల విద్యాశాఖ అధికారి హామీ ఇచ్చారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ వెస్ట్ లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల



సర్వీస్ రిజిస్టర్లు చాలా కాలంగా పెండింగ్లో ఉన్నాయని, వాటిని అప్డేట్ చేసేందుకు కృషి చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు మండల విద్యాశాఖ అధికారి కి సూచించారు. జూన్ నెలలో పాఠశాలల ప్రారంభానికి ముందు అన్ని ఉపాధ్యాయ సంఘాలతో కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించేందుకు ఒక కార్యాచరణ ప్రకటిద్దామని ఎంఈఓ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు, గుంటూరు జిల్లా అధ్యక్షులు పి.సాయి విశ్వనాథ్, రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్ ఖలీల్, రాష్ట్ర మున్సిపల్ కన్వీనర్ పి.లలిత బాబు, నగర అసోసియేట్ అధ్యక్షులు ఎన్. వేణుగోపాల్, అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కె.వి.రాఘవులు, టి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు టి రవి తదితరులు పాల్గొన్నారు.

# ఎండను లెక్కచేయకుండా బడిపిలుస్తోంది కార్యక్రమం

**పొన్నూరు, మే 8,ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశం కోసం ఉపాధ్యాయులు ఎండను సైతం లెక్కచేకుండా ఇంటింటికి



తిరిగి పిల్లలను చేర్పించాలని వేడుకొంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పిస్తే ఎలాంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదని, కార్పోరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయని చెప్తున్నారు. దీంతో ప్రవేశాలు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో పెరుగుతున్నాయనే చెప్పుకోవాలి. ప్రభుత్వం పేద పిల్లల కోసం కల్పిస్తున్న వసతుల గురించి చెప్తున్నారు. మండల పరిధిలోని మామిళ్ళపల్లి గ్రామంలో ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ ప్రవేశాల కోసం కసరత్తు చేస్తున్నారు.

# పొషికను సత్కరించిన పి.ఎ.యస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీర రాఘవయ్య

**పెదనందిపాడు మే 8 (ప్రభాతవార్త):** ఎస్.ఎస్.సి పబ్లిక్ పరీక్షల్లో 589 మార్కులతో 98.2 సాధించిన పెదననందిపాడు మండలం అన్నవరం గ్రామానికి చెందిన కొమ్మాలపాటి ప్రతాప్ కుమార్ మరియు బిందు మాధవిల కుమార్తె పొషికను పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. గుర్రం వీర రాఘవయ్య, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్. పాతూరి శ్రీనివాస్, డి



రాజేష్, ఏ శ్రీనివాసరావు, డి లక్ష్మీనారాయణ, జి. సరస్వతి అధ్యాపకులు మరియు అధ్యాపకేతర సిబ్బంది ఘనంగా సత్కరించి ప్రత్యేక అభినందనలు తెలిపారు . ఈ సందర్భముగా పొషిక మాట్లాడుతూ ఇంటర్మీడియట్ తరువాత ఐ.ఐ.టీ లో సీట్ సాధించి ఇంజనీరింగ్ చదివి ఎమ్.ఎన్.సి కంపెనీ లో ఉద్యోగం సాధించడం తన లక్ష్యమని పేర్కొన్నారు. పొషికకు పి.ఈ.డీ సొసైటీ పాలకవర్గ అధ్యక్షులు కాళహస్తి సత్యనారాయణ, ట్రెజరర్ లావు ఆదిశేషయ్య, జాయింట్ సెక్రటరీ నర్రా బాలకృష్ణ . శ్రేయోభిలాషులు వి ఎన్ శివయ్య తదితరులు శుభాశీస్సులు మరియు శుభాకాంక్షలు తెలిపారు.

# కిశోర వికాసంపై అవగాహన అవసరం

## అడిషనల్ సిడిపిఓ విజయకుమారి

పొన్నూరు, మే 8,ప్రభాతవార్త: తల్లిదండ్రులు కిశోర వికాసంపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని అడిషనల్ సిడిపిఓ విజయకుమారి అన్నారు. స్థానిక 13,14వార్డుల సచివాలయాల పరిధిలో శుక్రవారం కిశోర వికాసంపై అవగాహనా సదస్సు జరిగింది. బాలికల ఆరోగ్య సమస్యలపై తల్లిదండ్రులు ప్రత్యేక



దృష్టి పెట్టాలన్నారు. డాక్టర్ హరిణి మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందజేస్తుందన్నారు. ఐరన్ లోపం వున్నవారికి ప్రథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా మాత్రలను అందజేస్తున్నట్లు చెప్పారు. అనంతరం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మజ, క్రాఫ్ట్ సంస్థ ప్రతినిధి అక్కయ్య తదితరులు హాజరై అవగాహన కల్పించారు.

# పట్టణంలో స్వచ్ఛసర్వేక్షన్ బృందం పర్యటన

**తెనాలి మున్సిపాలిటీ మే8(ప్రభాతవార్త):** స్వచ్ఛ సర్వేక్షన్ 202526లో భాగంగా శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షన్ బృందం తెనాలి పట్టణానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు, అసిస్టెంట్ కమిషనర్ జాస్తి రామారావు, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మొవ్వ యేసుబాబు, తదితరులను కలిసి స్వచ్ఛ సర్వేక్షన్ కు సంబంధించి వివిధ అంశాలపై చర్చించారు.స్వచ్ఛ సర్వేక్షన్ లో భాగంగా, పురపాలకసంఘం తీసుకుంటున్న చర్యలు, ప్రజల సహకారం,సిబ్బంది సహకారం తదితర అంశాలపై బృందం పరిశీలించనుంది.శుక్రవారం నుంచి పట్టణంలో ఈ



బృందం పర్యటించనున్నట్లు కమిషనర్ తెలిపారు.

# పోలీసుల ఆధ్వర్యంలో వేసవి చలివేంద్రం ఏర్పాటు

**తెనాలి, మే8,(ప్రభాతవార్త):** తెనాలి పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్ వద్ద,శుక్రవారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేసవి చలివేంద్రాన్ని డిఎస్పి బి.జనార్ధన రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎస్పి జనార్ధనరావు మాట్లాడుతూ, వేసవికాలం అధిక ఉష్ణోగ్రతల కారణంగా,తెనాలి పోలీసుల ఆధ్వర్యంలో, ప్రయాణికులు, పాదాచారుల కోసం చలివేంద్రం ఏర్పాటుచేస్తున్నట్టు డిఎస్పి తెలిపారు. వేసవిలో రద్దీ ఎక్కువగా వుండే ప్రాంతాల్లో ప్రజల దాహర్తి తీర్చే విధంగా, చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు,కావున ప్రజలు వీటిని సద్వినియోగించుకోవాలన్నారు.ఈ కార్యక్రమం లో పట్టణంలోని మూడు పోలీస్ స్టేషన్ల సిబ్బంది, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. తెనాలి రూరల్ నందివెలుగు గ్రామంలో రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో వేసవి చలివేంద్రాన్ని డిఎస్పి బి. జనార్ధనరావు ప్రారంభించారు.తెనాలి నుండి గుంటూరు విజయవాడ వెళ్లే ప్రయాణికులకు ప్రధాన కూడలి ఐన నందివెలుగు జంక్షన్ లో చలివేంద్రం ఏర్పాటు చెయ్యటం అభినందనీయమని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐలు కే.ఆనంద్,డి. శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## 10వ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

**యడ్లపాడు, మే 8, ప్రభాతవార్త:** పదవ తరగతి తప్పిన విద్యార్థులకు ప్రత్యేక రెమిడియల్ శిక్షణతో నూరు శాతం పాస్ అయ్యే విధంగా చర్యలు చేపట్టటం జరిగిందని ఎంఈవో నాగరత్నం పేర్కొన్నారు. మండల పరిధిలో మొత్తం 48మంది విద్యార్థులు వివిధ సబ్జెక్టులలో తప్పటం జరిగిందని, వారికి ప్రత్యేక శిక్షణ అందజేసి నూరు శాతం పాస్ అయ్యేవిధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవటం జరిగిందని,



ఇందులో భాగంగానే వారికి ప్రత్యేక శిక్షణ అందజేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా మినిమం స్టడీమెటీరియల్ మరియు 20రోజుల ప్రణాళికను కూడా ఇవ్వటం జరిగిందని, దానిని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు అందరూ విధిగా శిక్షణకు హాజరు అయ్యే విధంగా చర్యలు జరిగిందన్నారు. వీరందరికి ఈ నెల 25వ తేదిన చిలకలూరిపేటలో జరిగే పరీక్షలకు హాజరు అవుతారన్నారు. యడ్లపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనే 50శాతం విద్యార్థులు పరీక్షలకు తప్పటం జరిగిందన్నారు.

## జాతీయ బేస్బాల్ టీంకు తిమ్మాపురం విద్యార్థి ఎంపిక



**యడ్లపాడు, మే 8, ప్రభాతవార్త:** ఈ నెల 4,5,6 తేదీలలో కర్నూల్లో జరిగిన రాష్ట్రస్థాయి బేస్బాల్ పోటీల్లో పల్నాడు జిల్లా సిల్వర్ మెడల్ సాధించడం జరిగింది. ఆ టోర్నమెంట్ లో అత్యున్నత ప్రదర్శన ప్రదర్శించి జాతీయస్థాయికి ఎస్ మల్లికార్జున జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తిమ్మాపురం విద్యార్థి ఎంపిక అయ్యాడని ఆంధ్రప్రదేశ్ సెక్రెటరీ ఎం మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఒడిస్సా రాష్ట్రం భువనేశ్వర్ లో మే 24 నుంచి 29 వరకు జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పల్నాడు జిల్లా సెక్రెటరీ వేమారెడ్డి చెప్పారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఏ వెంకటాద్రి నాయుడు మరియు పి ఈ టి వేమారెడ్డి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మరియు గ్రామ పెద్దలు అభినందనలు తెలియజేశారు.

## నేడు విలేజ్ క్లినిక్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న ఎంపి, ఎమ్మెల్యే

**యడ్లపాడు, మే 8, ప్రభాతవార్త :** మండల పరిధిలోని బోయపాలెం గ్రామంలో శనివారం ఉదయం పది గంటల సమయంలో 42లక్షల నిధులతో నిర్మించబడనున్న విలేజ్ క్లినిక్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించటం జరగుతుందని, మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు కామినేని సాయిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, నర్సరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొనటం జరుగుతుందన్నారు.

## సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపిన శ్రీనివాస్

**గురజాల, మే8, ప్రభాతవార్త:** టీడీపీ అత్యంత ప్రతిష్టాత్మంగా నెల్లూరులో నిర్వహించనున్న మహానాడు - 2026 కార్యక్రమంలో భాగంగా రక్తదానం, వైద్య శిభిరాల కమిటీలో పట్టణానికి డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాస్‌కు చోటు దక్కింది. దీనిపై సీఎం చంద్రబాబు, టీడీపీ జాతీయ నిర్వాహక కార్యదర్శి, మంత్రి నారా లోకేష్‌లకు డాక్టర్ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.



## ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

**కారంపూడి, మే 8, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దకొదమగుండ్ల



గ్రామ పంచాయతీలో మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గురజాల క్లస్టర్ ఏపీడీ సత్యనారాయణ శుక్రవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఉపాధి కూలీలు తప్పనిసరిగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండలో పనిచేసే సమయంలో తరచూ నీరు తాగడం, తలపై గుడ్డ లేదా టోపీ ధరించడం, మధ్యమధ్యలో విశ్రాంతి తీసుకోవడం, అవసరమైనప్పుడు ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవడం ద్వారా నీరసం, అలసట వంటి సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు. ఎంత తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఉదయం పూట పనులు చేసుకోవాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు మెడికల్ కిట్లు, మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ కట్టా నాగేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ రాంబాబు, సునీల్, క్లస్టర్ టీఏ గోవిందరాజులు, ఉపాధి శ్రామికులు

## గ్రామ పంచాయతీల్లో మెడికల్ కిట్ల ఏర్పాటు

**కారంపూడి, మే 8 ప్రభాతవార్త:** మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీల్లో మెడికల్ కిట్లు ఏర్పాటు చేస్తున్నట్లు కారంపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి డా॥ కె.లక్ష్మీమౌనిక అన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో మెడికల్ కిట్‌లను పంచాయతీలకు అందజేశారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మాత్రలు, కట్టుగుడ్డ దూది, టించర్ కిట్‌లో ఉంటాయన్నారు.



కార్యక్రమంలో సీహెచ్ఓ కె.మల్లయ్య, సిబ్బంది లాలునాయక్, ఫార్మాసిస్టు కె.శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో వ్యక్తి మృతి

**నూజెండ్ల,మే8,ప్రభాతవార్త:** మండలంలోని గురుపనాయుడుపాలెం గ్రామ సమీపంలో శుక్రవారం విషాద ఘటన చోటుచేసుకుంది. ట్రాక్టర్ తిరగబడిన ప్రమాదంలో లింగంగుంట్ల దావీదు (35) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ఒక పాప,బాబు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ప్రమాద వార్త తెలిసి కుటుంబ సభ్యులు,గ్రామస్తులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు అందజేసిన పోలీసులు

**నూజెండ్ల, మే 8, ప్రభాతవార్త:** మండలంలో పోయిన మొబైల్ ఫోన్లను ఐనవోలు పోలీసులు గుర్తించి బాధితులకు అప్పగించారు. ఇటీవల పలువురు తమ ఫోన్లు పోగొట్టుకున్నట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ కృష్ణారావు ప్రత్యేక దృష్టి సారించి సిఈఐఆర్ వెబ్‌సైట్ సహాయంతో 4





మొబైల్ ఫోన్లను ట్రేస్ చేశారు. అనంతరం వాటిని స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశారు. పోయాయనుకున్న ఫోన్లు తిరిగి దక్కడంతో బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రుద్రపోగు మహితకు డాక్టర్ గజ్జల పరామర్శ

**సత్తెనపల్లి, మే 8, ప్రభాతవార్త:** గీతా మల్టీస్పెషల్టీ హాస్పిటల్ నందు చికిత్స తీసుకుంటున్న సత్తెనపల్లి రూరల్ మండలం దీపాల దిన్నె పాలెం గ్రామానికి చెందిన రుద్రపోగు మహితను సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు ,నాయకులు, పాల్గొన్నారు.



# పల్నాడు జిల్లా వార్త



## సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

**చిలకలూరిపేట, మే 8, ప్రభాతవార్త:** చిలకలూరిపేట నియోజకవర్గం, యడ్లపాడు మండలం, తిమ్మాపురం గ్రామానికి చెందిన చుక్క ఇందిరా ప్రియదర్శినికి క్యాన్సర్ చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 6 లక్షల రూపాయల విలువైన చెక్కును ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అందజేశారు. అనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేద ప్రజల గురించి నిరంతరం ఆలోచించే ప్రభుత్వం అని, ఎంతోమందికి ముఖ్యమంత్రి సహాయనిది ద్వారా ఆదుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపురం యువ నాయకులు నాగండ్ల రాంబాబు గారు తిమ్మపురం గ్రామ పార్టీ అధ్యక్షులు బోల్లినేని వీర శేఖర్ , చుండూరి లోకా బ్రహ్మయ్య ,జంగా ప్రసన్న, పుల్లగూర సేవిరీలు పుల్లగూర కిరణ్, దావల రాము చనాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



## అభివృద్ధి చెందాలంటే మెరుగైన రవాణా వ్యవస్థే కీలకం : ప్రత్తిపాటి

**నాదెండ్ల, మే 8, ప్రభాతవార్త:** గ్రామాలైన, దేశమైన వేగంగా అభివృద్ధి చెందాలంటే మెరుగైన రవాణా వ్యవస్థే కీలకమని, గ్రామీణ మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టడం ద్వారా కూటమి ప్రభుత్వం ప్రజల నమ్మకం, విశ్వాసం చూరగొందని శాసనసభ్యులు ప్రత్తిపాటి, ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు అభిప్రాయపడ్డారు. శుక్రవారం వారు ఇరువురూ నాదెండ్ల మండలంలో పర్యటించారు. రూ.60 లక్షల ఎన్.ఆర్.ఈ.జీ.ఎస్ నిధులతో కేశాను పల్లి నుంచి నాదెండ్ల వరకు మల్లాయపాలెం



మీదుగా వేసిన నూతన మెటల్ రోడ్డును ఎంపీ, ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇద్దరు నాయకులు గ్రామస్తులతో సమావేశమై ప్రభుత్వ పనితీరుపై వారి అభిప్రాయాలు, ఆలోచనలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు.పల్లె పండుగతో పవన్ కల్యాణ్ గ్రామీణ రోడ్ల రూపురేఖలు మార్చారు పల్లె పండుగ కార్యక్రమంతో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో గ్రామీణ రోడ్ల రూపు రేఖలు మారిపోయాయని ఎంపీ, ఎమ్మెల్యే తెలిపారు. గత పాలకులు కేంద్రమిచ్చిన నిధుల్ని దుర్వినియోగం చేస్తే, ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వ పథకాలన్నింటినీ సమర్థవంతంగా సద్వినియోగం చేసుకుంటున్నారని నేతలు పేర్కొన్నారు.కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, జవ్వాజి మధన్ మోహన్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు జయ ప్రసాద్, వజ్జ సింగయ్య, జయరాజు, దార్ల ఇన్నయ్య, దార్ల రాయన్న, అల్లం రామారావు, పునాటి కోటేశ్వరరావు, బండారుపల్లి మస్తాన్ రావు, చుండు అనిల్, నాతని అంజి, డి.ఈ సుబ్రమణ్యం, ఏ.ఈ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తాలీంపహునర్ టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట టౌన్, మే 8 ప్రభాతవార్త :** ప్రతిభ కనబరిచిన ముస్లిం విద్యార్థులకు ఉన్నత చదువులు అభ్యసించడానికి తల్లిదండ్రులుపై భారం పడకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక చేయూతనిస్తుందని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. శుక్రవారం స్థానిక గుంటూరు రోడ్డులోని శాసనసభ్యుల కార్యాలయంలో ఏపీ వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో రూపొందించిన తాలీంఏహునర్ (వక్ఫ్ ఎడ్యుకేషన్ మిషన్) టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ను ఎమ్మెల్యే అరవిందబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. చదువుకున్న ముస్లిం పిల్లలు కుటుంబాలకు భారం కాకుండా అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లేందుకు ప్రభుత్వం తాలీంఏహునర్ అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం ప్రకారం ఈ మిషన్ ద్వారా 10వ తరగతిలో 450 మార్కులు దాటిన ముస్లిం విద్యార్థులంతా ఈ టాలెంట్ టెస్ట్ కు దరఖాస్తు చేసుకోవాలి. తెల్ల రేషన్ కార్డు ఉన్న వారు సీబీఎస్ఈ/ ఐసిఎస్సి విద్యార్థులైతే 75 పైగా మార్కులు ఉండాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిలో మెరిట్ ఆధారంగా 250 మంది విద్యార్థులను ఎంపిక చేస్తారని వివరించారు. వీరికి కార్పొరేట్ విద్యా విధానంలో ఇంటర్మీడియట్ విద్యను పూర్తిగా ఉచితంగా అందిస్తారని తెలిపారు. వారు ఏ కళాశాలలో చదవాలనుకుంటే ఆ కళాశాలలో ప్రభుత్వం బాధ్యత వహించి వక్ఫ్ బోర్డు తరఫున చదివిస్తారని అన్నారు. దీనితో పాటు ఐఐటీ జెఈఈ, నీట్, ఎంసెట్ లకు ఉచిత శిక్షణ ఇస్తారని అన్నారు. హాస్టల్, భోజనం, పుస్తకాలు కూడా పూర్తిగా ఉచితంగా ఇస్తారని తెలిపారు. ఆడపిల్లలకు 33 ప్రత్యేక రిజర్వేషన్ కల్పించారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు తెలిపారు.

## జనసేన కేంద్ర కార్యాలయంలో వినతిపత్రం అందించిన నాగలక్ష్మి

**రొంపిచర్ల , మే 8 ప్రభాతవార్త :** రొంపిచర్ల మండలం టిడిపి అధ్యక్షుడు పల్లెల నాగిరెడ్డి, రొంపిచెర్ల మండల ఏపీఎంలు, విఓఏగా పనిచేస్తున్న తనను మానుకోవాలని



బలవంతం చేస్తున్నారని మండలంలోని నల్లగార్లపాడు గ్రామానికి చెందిన కోమ్మలపాటి నాగలక్ష్మి గత నెల సోషల్ మీడియా మాధ్యమంగా ఇటీవల తెలియజేశారు. సీఎం నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పల్నాడు జిల్లా కలెక్టర్, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలకు తన బాధను వినతి పత్ర రూపంలో తెలిపారు. ఐతే, రోజులు గడుస్తున్న నియోజకవర్గంలో తనకు ఎటువంటి న్యాయం జరగకపోవడంతో శుక్రవారం మంగళగిరి జనసేన పార్టీ జాతీయ కార్యాలయంలో జరిగిన జనవాణి కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షులు వెంకటేశ్వరరావు రిప్రెంటేషన్ అందజేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యక్తిగత కార్యదర్శికి కొమ్మలపాటి నాగలక్ష్మి నియోజకవర్గ పార్టీ నాయకులతో కలిసివెళ్లి తనకు న్యాయం చేయాలని కోరారు . తాను గత 7 ఏళ్లుగా నల్లగార్లపాడు గ్రామంలో విఓఏగా పనిచేస్తున్నానని చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన అన్నయ్య రొంపిచర్ల మండల జనసేన ప్రధాన కార్యదర్శి కావడంతో నువ్వు కూడా జనసేన పార్టీ సానుభూతి పరురాలివే అంటూ నీ ఉద్యోగం ఎలా ఆపాలో తనకు బాగా తెలుసని గత కొన్ని నెలలుగా టిడిపి నాయకులు బెదిరిస్తున్నారని పేర్కొంది. తనకు ఆర్థికంగా హస్పిటల్లో చూపించుకోవడం కోసం ఈ ఉద్యోగమే జీవనాధారమని పేర్కొంది. దయచేసి నాకు న్యాయం జరిగేలా చూడాలని విన్నవించుకుంది. కార్యక్రమంలో జనసేన నాయకులు షేక్. అద్రుఫ్, అచ్చుల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించాలి

### -సత్తెనపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజ్ పాల్

సత్తెనపల్లి, మే 8, ప్రభాతవార్త: తమిళనాడులో టీవీకే పార్టీ 108 స్థానాలలో విజయం సాధించి అతి పెద్ద పార్టీగా అవతరించినప్పటికీ ఆ రాష్ట్ర గవర్నర్ ప్రభుత్వ ఏర్పాటుకి అంగీకరించక పోవటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని సత్తెనపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజ్ పాల్ పేర్కొన్నారు. సత్తెనపల్లిలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తమిళనాడు గవర్నర్ నియంతృత్వ వైఖరికి నిరసనగా ర్యాలీ నిర్వహించి అనంతరం తాలూకా సెంటర్ లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన సభ నిర్వహించారు...ఈ సందర్భంగా జ్ఞానరాజ్ పాల్ ప్రసంగిస్తూ గతంలో ఎన్నో రాష్ట్రాలలో విజయం సాధించిన అతి పెద్ద పార్టీలను ప్రభుత్వ ఏర్పాటుకు ఆయా రాష్ట్రాల గవర్నర్ లు ఆమోదం తెలిపారని, కానీ తమిళనాడులో బీజేపీ కుట్ర పూర్వకంగా గవర్నర్ ద్వారా మోకాలు అడ్డు పెట్టించి కుట్ర రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. దేశంలో చాలా రాష్ట్రాలలో బీజేపీ ఇదే తరహాలో మోసపూరిత రాజకీయాలు చేసి అధికారంలోకి వచ్చిందని, తమిళనాడులో కూడా నీచ రాజకీయాలకు తెర తీసిందని ఆరోపించారు...అంబేద్కర్ ప్రజా సంఘం అధ్యక్షుడు దావులూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఉత్తర భారతదేశంలో మత ప్రాతిపదికన ఎన్నో రాష్ట్రాలలో అధికారంలోకి వచ్చిన బీజేపీ, దక్షిణాదిలో కూడా పాగా వేయటానికి కుట్ర చేస్తోందని పేర్కొన్నారు...వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్



కార్యదర్శి కోడిరెక్క దేవదాస్, లోక్ జనశక్తి (రామ్ విలాస్ పాశ్వాన్) అధ్యక్షులు జొన్నలగడ్డ విజయకుమార్,అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జిల్లెళ్ళ పాల్ రాజ్, జడా ప్రసాద్, పెద్దింటి నాగేశ్వరరావు, కాటుమాల ఇశ్రాయేల్, గంజిమాల రాజారావు, ఏకుల దావీదు, కాశీమాల ఓబయ్య, కట్టమూరు సర్పంచ్ దార్ల ఏడుకొండలు, న్యాయవాదులు కాంద్రు లాజర్, చావా జోజిబాబు తదితరులు పాల్గొన్నారు .

## పసుమర్రులో వైభవంగా శ్రీ కోదండ రామాలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

**చిలకలూరిపేట, మే 8, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పసుమర్రు గ్రామంలో వేంచేసి ఉన్న సుమారు 100 సంవత్సరాల చరిత్ర కలిగిన పురాతన శ్రీ కోదండ రామాలయంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. గత మూడు రోజులుగా ఆలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఈరోజు ధ్వజస్తంభ ప్రతిష్ఠతో పరాకాష్టకు చేరుకున్నాయి ఆధ్యాత్మిక శోభతో పులకించిన పసుమర్రు ధ్వజస్తంభ జీర్ణోద్ధరణలో భాగంగా వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ



శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మికతతో వెల్లివిరిసింది. గత మూడు రోజులుగా దేవస్థానంలో: విశేష హోమాలు,పంచామృత అభిషేకాలు,శాంతి పూజలు కమనీయంగా, రమణీయంగా నిర్వహించారు. భక్తుల జయజయధ్వానాల మధ్య ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. తరలివచ్చిన భక్తులు భారీ అన్నదానం ఈ మహోత్సవాన్ని వీక్షించేందుకు పసుమర్రు గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తుల రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ పునరుద్ధరణ పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## సమర్థ వంతమైన నాయకత్వానికి దక్కిన గుర్తింపు

### టీడీపీ పొలిట్ బ్యూరో ఎక్స్ అఫీషియో పదవీ బాధ్యతలు చేపట్టిన ఎంపీ శ్రీకృష్ణదేవరాయులుకు అభినందన

**చిలకలూరిపేట, మే 8, ప్రభాతవార్త:** నూతనంగా టీడీపీ పొలిట్ బ్యూరో ఎక్స్ అఫిషియో పదవీ బాధ్యతలు చేపట్టిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలను జిల్లా టీడీపీ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.డి హనీఫ్ కలిసి అభినందనలు తెలిపారు. శ్రీకృష్ణదేవరాయులు బాధ్యతలు స్వీకరించటంతోనే



తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొందని, సమర్థవంతమైన నాయకత్వానికి దక్కిన గుర్తింపు అని హనిఫ్ చెప్పారు. నూతన పదవుల నియామకం కార్యకర్తల్లో ఉత్సాహానికి, నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గ అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యకర్తల్లో విశ్వాసం. నమ్మకం ఉన్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయులకు ఈ కీలక పదవి లభించటం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కేడర్‌లో నూతన ఉత్సాహం వచ్చిందని హనీఫ్ అభిప్రాయపడ్డారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**సత్తెనపల్లి, మే 8, ప్రభాతవార్త:** ఈనెల 9వ తేదీ ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు సబ్ స్టేషన్ మరియు లైన్ల మరమ్మత్తుల కోసం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ అధికారులు తెలిపారు. దీనివలన సత్తెనపల్లి మున్సిపాలిటీ ఏరియా లో విద్యుత్తు అంతరాయం జరుగుతుందని తెలియజేవారు. .కావున విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని కోరారు.

## సత్తెనపల్లిలో దొంగల బీభత్సం

సత్తనపల్లి, మే 8, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలోని గోళ్లమూడివారి వీధిలో అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు రెండు బంగారు దుకాణాల్లో చోరీకి పాల్పడ్డారు. దుకాణాల తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించిన దొంగలు, ఒక షాపులో సుమారు మూడు కిలోల వెండి వస్తువులను అపహరించారు. ఉదయం యజమానులు వచ్చి చూసేసరికి వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.. పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## షకూర్‌షా కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ

**చిలకలూరిపేట, మే 8, ప్రభాతవార్త:** యూనియన్ బ్యాంకు మాజీ మేనేజర్ షకూర్ షా మృతి విషయం విదితమే. శుక్రవారం



చిలకలూరిపేట పట్టణం, సుభానినగర్ లోని వారింటికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

## రాధాకృష్ణమూర్తికి ఎమ్మెల్సీ ఘన నివాళి

**చిలకలూరిపేట, మే 8, ప్రభాతవార్త:** నాదెండ్ల మండలం అప్పాపురం గ్రామ వాస్తవ్యుడు కందుల రాధాకృష్ణమూర్తి గత నెల 23న మృతిచెందారు. శుక్రవారం దశదినకర్మ సందర్భంగా శాసన మండలి సభ్యులు మర్రి రాజశేఖర్ ,సోమేపల్లి వాసు ,గొట్టిపాటి సాంబ శివరావు తదితరు లు పాల్గొని నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమం లో వారివెంట దొప్పలపూడి అప్పారావు,,



పెదవల్లి చినబాబు , రావూరి నాగేశ్వరరావు ,మండెపూడి శ్రీనివాసరావు,కక్కెర శ్రీనివాసరావు ,తూబాటి అప్పయ్య , గుమ్మడి గోపి , కొల్లా పేరయ్య , కందుల హనుమంతరావు , పెదవల్లి శ్రీధర్ తదితరులున్నారు.

## ఎంఏఎం, కాలిబో ఏఐ సంస్థ మధ్య ఒప్పందం

**నరసరావుపేట, మే 8, ప్రభాతవార్త :** ఎంఏఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల, కాలిబో ఏఐ సంస్థల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది.ఈ మేరకు శుక్రవారం ఒప్పందంపై ఎంఏఎం కళాశాల చైర్మన్ ఎం.ఆర్. శేషగిరిరావు, మరియు కాలిబో ఏఐ సంస్థ ప్రోగ్రామ్ హెడ్ యూనివర్సిటీ రిలేషన్స్ పద్మిని ప్రదీప్ సంతకాలు చేశారు. వివరాలను చైర్మన్ ఎమ్మార్ శేషగిరిరావు తెలియజేశారు. ఈ ఒప్పందం యొక్క ప్రధాన ఉద్దేశ్యం బి.టెక్ 3, 4వ సంవత్సరం విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో ప్రత్యేక శిక్షణ అందించి, ప్రముఖ బహుళజాతి సంస్థల్లో ఏఐ ఉద్యోగ అవకాశాలు కల్పించడమని కళాశాల డైరెక్టర్ దారువూరి శ్రావ్య తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని, కాలిబో ఏఐ సంస్థ ఆధ్వర్యంలో ఏఐ కరికులమ్ రూపకల్పనతో పాటు విద్యార్థులకు ప్రాక్టికల్ పరిజ్ఞానం అందించే సాండ్‌బాక్స్ ఎన్విరాన్‌మెంట్‌ను కూడా అందించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాదినేని రామారావు తెలిపారు. అలాగే విద్యార్థుల అభివృద్ధి కోసం ఇన్ఫ్యాట్ కళాశాల మరిన్ని ప్రముఖ సంస్థలు మరియు కంపెనీలతో త్వరలో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్లు చైర్మన్ ఎమ్మార్ శేషగిరిరావు పేర్కొన్నారు.

## జిల్లా ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్ట్ భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట టౌన్, మే 8 ప్రభాతవార్త :: పల్నాడు జిల్లాలోని అంగన్వాడీ పోషణ్ 2.0 నందు ఖాళీగా ఉన్న డిస్టిక్ ప్రాజెక్టు అసిస్టెంట్ పోస్ట్ భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. వివరాలను శుక్రవారం జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి ఉమాదేవి తెలియజేశారు. జిల్లా అంగనవాడి పోషణ్ 2.0లో ఖాళీగా ఉన్న డిస్టిక్ ప్రాజెక్టు అసిస్టెంట్ పోస్ట్ ను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయడం జరుగుతుందన్నారు. పోస్ట్ కు కావలసిన అన్ని అర్హతల కలిగిన సర్టిఫికెట్లతో స్థానిక కార్యాలయంలో సంప్రదించాలని, పూర్తి వివరాలను తీసుకోవాలని వారు సూచించారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు కాంట్రాక్టు పద్ధతిలో పోస్ట్ భర్తీ చేయడం జరుగుతుందని జిల్లా అధికారి ఉమాదేవి తెలిపారు.

## ఆంజనేయస్వామికి మోపిదేవి పూజలు



**రేపల్లె, మే 8, ప్రభాతవార్త:** మండలంలోని తుమ్మల పంచాయతీ గ్రామంలో శుక్రవారం జరిగిన శ్రీశ్రీశ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. ప్రముఖ వ్యాపారవేత్త,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న మోపిదేవి శ్రీనివాసరావు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.భక్తులతో పాటు మోపిదేవి శ్రీనివాసరావు అనుచరగణం అధిక సంఖ్యలో పాల్గొన్నారు.భక్తులు అభయాంజనేయస్వామికి మొక్కులు తీర్చుకున్నారు.ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

# బాపట్ల జిల్లా వార్త



## ఘనంగా ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవ వేడుకలు

**రేపల్లె, మే 8, ప్రభాతవార్త:** పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో శు క్రవారం రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ కార్యాలయంలో ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రేపల్లె సబ్ బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య మాట్లాడుతూ రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు స్వర్గీయ జాన్ హెన్రీడూన్ హంట్ జన్మదినం సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా రెడ్ క్రాస్ దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్నామని చెప్పారు.రెడ్ క్రాస్ ప్రాథమిక సూత్రాలైన మానవత్వం,నిష్పాక్షికత,తటస్థత,స్వాతంత్ర్యం,స్వచ్ఛంద సేవ,ఐక్యత,విశ్వవ్యాప్తత పాటించాలన్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని సూచించారు.రక్త దానం చేయాలని చెప్పారు.మానవత్వాన్ని సజీవంగా ఉంచడంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివన్నారాయణ,వైద్యులు రత్నరాజు,జీవన్,శ్వేత,ప్రభావతి,రమణ,కరీముల్లా,బ్లడ్ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా దర్బార్‌కు పోటెత్తిన అర్జీ దారులు

**బాపట్ల,మే8, ప్రభాతవార్త ప్రతినిధి:** నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే పరమావధిగా బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ (శ4) కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి ప్రజలు పెద్ద



ఎత్తున తరలివచ్చారు. తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యేకు విన్నవించుకునే అవకాశం కలగడంతో బాపట్ల నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాల నుంచి బాధితులు బారులు తీరారు.ఉదయం నుంచే ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, వారి వద్ద నుంచి స్వయంగా అర్జీలను స్వీకరించారు. వృద్ధాప్య పింఛన్లు, రేషన్ కార్డులు వంటి వ్యక్తిగత సమస్యల నుంచి గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ, తాగునీరు, రోడ్ల మరమ్మతుల వంటి మౌలిక వసతుల కల్పన వరకు ప్రజలు అనేక సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. బాధితుల ఆవేదనను సావధానంగా విన్న ఎమ్మెల్యే, వాటి పరిష్కారానికి తక్షణ హామీ ఇచ్చారు.

**అధికారులకు ఫోన్లోనే ఆదేశాలు**

అర్జీల స్వీకరణతోనే సరిపెట్టకుండా, ఎమ్మెల్యే అక్కడికక్కడే అధికారులతో ఫోన్లో మాట్లాడటం విశేషం. తీవ్రత ఎక్కువగా ఉన్న సమస్యలపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండటం, వారి సమస్యలనుపరిష్కరించడమే ప్రజాప్రతినిధిగా నా బాధ్యత. కేవలం వినతులు తీసుకోవడమే కాదు, ప్రతి ఫిర్యాదు కొలిక్కి వచ్చే వరకు నిరంతరం పర్యవేక్షిస్తాం అని అన్నారు.నియోజకవర్గ అభివృద్ధిని శాస్త్రీయ పద్ధతిలో ముందుకు తీసుకెళ్లేందుకు ఏర్పాటు చేసిన శ4 కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు, క్షేత్రస్థాయి ఫీడ్‌బ్యాక్ ఆధారంగా నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయడమే ఈ యూనిట్ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తమ సమస్యల పట్ల ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ

**రేపల్లె, మే 8, ప్రభాతవార్త:** పట్టణంలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం జూబ్లీహిల్స్,రేపల్లె రోటరీ క్లబ్‌లు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆర్థికంగా,సామాజికంగా వెనుకబడిన 7గురు మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జరిగిన సభకు రోటరీ క్లబ్ అధ్యక్షుడు జీఎస్.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు.రోటరీ రీజినల్ ఛైర్మన్ ఎంఎస్ సక్సేనా మాట్లాడుతూ సేవా



కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని చెప్పారు.రోటరీ సంస్థ నిర్వహిస్తున్న సేవలను ముఖ్య అతిథి పరుచూరి శ్రీనాథ్ ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి టిఎస్.రామకృష్ణ,వేపూరి సాయి,ప్రభల సుబ్రహ్మణ్యం,గొట్టుముక్కలబాబారావు, కిషోర్,యార్లగడ్డ బుచ్చిరావు,వి.రాఘవేంద్ర,రావి మురళీకృష్ణ,విఠల్ ముక్కామల,కేసన పూర్ణచంద్రరావు,వాలేశ్వరరావు,కుడితిపూడి హరిత,కొమ్మూరి నాగలీల,కుడితిపూడి నరసింహారావు,కోడూరి ప్రవీణ్,తలశిల రామారావు,పి.శివశంకర ప్రసాద్,చెన్ను సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

## మౌళిక సదుపాయాలు కల్పిస్తాం... ఉపాధి పనులకు హాజరుకండి

### -డ్వామా పీడీ ఏపీడీ శివన్నారాయణ

**కొల్లిపర,మే 8 ప్రభాతవార్త:** ఉపాధి హామీ పనుల వద్ద మెడికల్ కిట్లు..టెంట్లు వంటి మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేసామని పనులకు కూలీలు అధిక సంఖ్యలో హాజరుకావాలని డ్వామా ఏపీడీ శివన్నారాయణ పేర్కొన్నారు.శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో



ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి పనులపై తగిన సూచనలు..సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా శివన్నారాయణ మాట్లాడుతూ ఉపాధి పనులకు కూలీలు తక్కువగా హాజరు అవుతున్నారని..జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ పనులకు వచ్చే విధంగా చూడాలన్నారు.కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు .సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ భార్గవ్,పరిపాలనాధికారి కిషోర్‌కుమార్;డిప్యూటి ఎంపీడీఓ దానయ్య,ఏపిఓ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాపట్లలో అత్యాధునిక గ్రంథాలయ భవన నిర్మాణానికి సన్నాహాలు

**బాపట్ల,మే8, ప్రభాతవార్త ప్రతినిధి:** బాపట్ల పట్టణంలో సకల సౌకర్యాలతో కూడిన నూతన శాఖా గ్రంథాలయ భవన నిర్మాణానికి ముమ్మర ప్రయత్నాలు సాగుతున్నాయి. శుక్రవారం ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ శ్రీమతి భీమనేని వందనా దేవి బాపట్లలో పర్యటించి, గ్రంథాలయ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె బాపట్ల శాసనసభ్యులు వేగేసిన నరేంద్ర వర్మను కలిసి నూతన భవన నిర్మాణ ఆవశ్యకతపై చర్చించారు. బాపట్ల జిల్లా కేంద్రంగా మారిన నేపథ్యంలో, పెరుగుతున్న పాఠకుల సంఖ్యకు అనుగుణంగా ఆధునిక వసతులతో కూడిన శాశ్వత భవనం ఉండాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. ప్రస్తుతం గ్రంథాలయం అద్దె భవనంలో కొనసాగుతుండటంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారని, వీలైనంత త్వరగా భవన నిర్మాణ పనులు చేపట్టేలా చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ, ప్రజల సౌకర్యార్థం అన్ని హంగులతో భవనాన్ని



నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గౌడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాతా జయప్రకాష్ నారాయణ, గ్రంథాలయాధికారి ఏ. శివాజీ గణేషన్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సలహాదారులు కళ్ళం హరినాథ్ రెడ్డి, అధ్యక్షులు చేపల సుబ్రహ్మణ్యం, కార్యదర్శి శేషాద్రి నాయుడు పాల్గొన్నారు. అలాగే కమిటీ సభ్యులు శీలం శ్రీనివాసరావు, సీత ఉపేంద్ర, న్యాయవాది గంట శంకర్ రావు మరియు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఐఆర్ఇఫ్ అధినేత ఇమ్మానియేల్‌తో మోహన్‌కృష్ణ భేటీ

**రేపల్లె, మే 8, ప్రభాతవార్త:** పట్టణంలోని ప్రముఖ ఐఆర్ఇఫ్ సంస్థ అధినేత డాక్టర్ రెబ్బా ఇమ్మానియేల్‌తో శుక్రవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్‌కృష్ణ సమావేశమయ్యారు.పార్టీ తీరు తెన్నులపై చర్చించారు.ఈ కార్యక్రమంలో వైకాపా రేపల్లె పట్టణ కన్వీనర్ కరేటి శేషగిరిరావు,రాష్ట్ర కార్యదర్శి



యార్లగడ్డ మదన్‌మోహన్,రాష్ట్ర జాయింట్ సెక్రటరీలు చిత్రాల ఒబేదు,చిమట బాలాజీ, రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి నీలం వీరేంద్ర,రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కొప్పుల గోపి,జిల్లా అధికార ప్రతినిధి కర్రి వెంకటకృష్ణారెడ్డి,జిల్లా క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు సముద్రాల ప్రభుకిరణ్,రమేష్,వాకా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సంపదపై దృష్టి పెట్టండి పంచాయతీలకి ఆదాయం పెంచండి

### -ఇన్‌ఛార్జి ఎంపీడీఓ భార్గవ్

**కొల్లిపర,మే 8 ప్రభాతవార్త:** స్వచ్ఛ సంపదపై ప్రత్యేక దృష్టి పెట్టినప్పుడే పంచాయతీలకి ఆదాయం పెరుగుతుందని ఇన్‌ఛార్జి ఎంపీడీఓ భార్గవ్ అన్నారు.శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో జరిగిన శిక్షణా



కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.డిప్యూటి ఎంపీడీఓ దానయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో భార్గవ్ మాట్లాడుతూ తడి..పొడి చెత్తలను వేరు వేరుగా సేకరించి చెత్తనుండి సంపద తయారు చేసే కేంద్రానికి తరలించాలన్నారు.గ్రామాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా చూడాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందన్నారు.కార్యక్రమంలో పరిపాలనాధికారి కిషోర్‌కుమార్ ,పంచాయతీరాజ్ ఏఈ అవుతు సాంబిరెడ్డి,వివిధ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పారా లీగల్ వాలంటీర్ల నియామకం

**రేపల్లె, మే 8, ప్రభాతవార్త:** రేపల్లె మండల లీగల్ సర్వీసెస్ కమిటీలో 8 మంది పారా లీగల్ వాలంటీర్లను నియమిస్తూ జిల్లా న్యాయస్థానం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి.రేపల్లె,నగరం మండలాలకు చెందిన సిహెచ్.నాగమల్లేశ్వరరావు ,ఆర్.శ్రీనివాసరావు,సయ్యద్ తాహిర్ అహ్మద్,ఆలా మోషె,జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం,కనపర్తి వెంకయ్య,వాగోలు బాబూరావు,మండె చిన్న యానాదిరావులను నియమించారు.

## 10న అవగాహనలో ఆరోగ్యసభ

**గుంటూరు కల్చరల్,మే 8,ప్రభాతవార్త :** అవగాహన సంస్థ గత 18సంవత్సరాల నుండి క్రమం తప్పకుండా ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఆరోగ్యసభల్లో భాగంగా ఈవారం కేన్సర్ వ్యాధి–కారణాలు–చికిత్స అంశంపై సభ నిర్వహించనుందని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు.మే 10 ఆదివారం ఉదయం 11గంటలకు నిర్వహించే ఆరోగ్యసభకు ప్రముఖ కాన్సర్ వ్యాధి నిపుణులు డాక్టర్ ప్రియదర్శిని ప్రధానవక్తగా పాల్గొంటారన్నారు.

## స్కూల్ బస్సుల్లో భద్రత పాటించాల్సిందే

### డీటీవో పరంధామ రెడ్డి

**బాపట్ల,మే8, ప్రభాతవార్త ప్రతినిధి:** పాఠశాల బస్సులు ఖచ్చితంగా భద్రతా ప్రమాణాలు పాటించాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని బాపట్ల జిల్లా రవాణా శాఖాధికారి (డీటీవో) టి.కె. పరంధామ రెడ్డి హెచ్చరించారు. రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మే 1వ తేదీ నుంచి



జిల్లావ్యాప్తంగా స్కూల్ బస్సుల తనిఖీలు ముమ్మరం చేసినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనిఖీల వివరాలను వెల్లడించారు.జిల్లాలోని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లతో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తునామన్నారు. జిల్లాలో మొత్తం 703 స్కూల్ బస్సులు ఉండగా, ఇప్పటివరకు 655 బస్సులు ఫిట్‌నెస్ కలిగి ఉన్నాయని, మిగిలిన 48 బస్సులకు గడువు ముగిసిందని గుర్తించామన్నారు.. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో పాఠశాలల ఆవరణలోనే తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే నోటీసులుఆంధ్రప్రదేశ్ మోటార్ వెహికల్ రూల్స్ 1989 (రూల్ నెం. 185జి), ఏఐఎస్63 నిబంధనల ప్రకారం బస్సుల్లో సౌకర్యాలు ఉండాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా అత్యవసర ద్వారం సక్రమంగా ఉండాలన్నారు.

**అగ్నిమాపక యంత్రాలు అందుబాటులో ఉంచాలి.**

ఫైర్ డిటెక్షన్ సిస్టమ్, వెహికల్ ట్రాకింగ్ డివైజ్‌లు పనిచేయాలన్నారు.ఇప్పటివరకు 120 బస్సులను తనిఖీ చేశామని, మిగిలిన వాహనాలను ఈ నెల 20వ తేదీలోపు పూర్తి చేస్తామని పరంధామ రెడ్డి తెలిపారు. లోపాలు ఉన్న వాహనాలకు నోటీసులు జారీ చేస్తున్నామని, వారం రోజుల్లో వాటిని సరిచేసుకుని మళ్లీ తనిఖీ చేయించుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించకుండా రోడ్డెక్కితే వాహనాలను సీజ్ చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

## నేడు భట్టిప్రోలు మండలంలో విద్యుత్తు సరఫరా నిలిపివేత

**రేపల్లె, మే 8, ప్రభాతవార్త:**

భట్టిప్రోలు మండలంలో శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రేపల్లె విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.శ్యామ్ సుధాకర్ బాబు శుక్రవారం తెలిపారు.భట్టిప్రోలు 33 కెవి ఫీడర్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా భట్టి ప్రోలు సబ్ స్టేషన్,పెదపులివర్రు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయమేర్పడుతుందని చెప్పారు.విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

**రేపల్లెలో..**

రెండో శనివారం సందర్భంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు రేపల్లె పట్టణంలోని 33 కెవి,11 కెవి స్టేషన్ల పనుల కారణంగా ఇసుకపల్లి,గరువురోడ్, ఉప్పూడి రోడ్,నిజాంపట్నం రోడ్,హౌసింగ్ కాలనీ,బేతపూడి,గుడ్డికాయలంక,ఉయ్యూరువారిపాలెం తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రేపల్లె విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.శ్యామ్ సుధాకర్ బాబు తెలిపారు.

## శతాధిక వృద్ధుని కుటుంబానికి పరామర్శ

**రేపల్లె, మే 8, ప్రభాతవార్త:** మండలంలోని ఉయ్యూరువారిపాలెంకు చెందిన శతాధిక వృద్ధుడు కేసన రామారావు(102) మృతి చెందిన సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను శుక్రవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ



రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్‌కృష్ణ పరామర్శించి సంతాపం తెలిపారు.రామారావు తనయుడు ప్రయుఖ న్యాయవాది కేసన గోపాలరావుకు సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వైకాపా మండల కన్వీనర్ మేడికొండ అనిల్,రేపల్లె పట్టణ కన్వీనర్ కరేటి శేషగిరిరావు,రాష్ట్ర కార్యదర్శి యార్లగడ్డ మదన్‌మోహన్,రాష్ట్ర జాయింట్ సెక్రటరీ చిమట బాలాజీ,జిల్లా అధికార ప్రతినిధి కె.వెంకట కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దాహార్తిని తీర్చేందుకు గ్రామాలలో చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయాలి : ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

**వట్టిచెరుకూరు, మే 8, ప్రభాతవార్త :** వేసవి తాపము నుండి ప్రజలను ఆదుకునేందుకు, వారి దాహార్తిని తీర్చేందుకు గ్రామాలలో చలివేంద్రాలు,



మజ్జిగ పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రత్తిపాడు శాసనసభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు పేర్కొన్నారు. మండలంలోని కాట్రపాడు గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే మజ్జిగ చలివేంద్రాన్ని ఆ పార్టీ నేతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఈ ఏడాది వేసవి ఉధృతి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజలు ఎండ బారిన పడకుండా ఎక్కడికక్కడ చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీ కేంద్రాలు ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు, ఎన్నారైలు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. వడగాల్పులు, అధిక ఉష్ణోగ్రతతో కూడిన ప్రతికూల వాతావరణం వలన ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు కాట్రపాడు తెలుగుదేశం పార్టీ నేతలు ముందుకు రావడం అభినందించదగ్గ విషయమని తెలియజేశారు. వేసవి మొత్తం మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించాలని, స్వచ్ఛంద సంస్థలు వేసవి తాపం నివారించేందుకు సేవలు ఉధృతం చేయాలని కోరారు. ఎండల తీవ్రత దృష్ట్యా వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తగు జాగ్రత్తలు వహించాలని సూచించారు. ప్రతిరోజు ఈ చలివేంద్రంలో 30 లీటర్ల మజ్జిగ పంపిణీ చేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్ మేదరమెట్ల శివశంకర్, అయినంపూడి శేషమ్మ, టిడిపి మండల మాజీ అధ్యక్షులు మన్నవ పూర్ణచంద్రరావు, గుంటుపల్లి కిరణ్ కుమార్, ప్రత్తిపాడు యార్డు వైస్ చైర్మన్ నార్నె బాబు, ముట్లూరు ఎంపిటిసి సభ్యులు గోగినేని కళ్యాణ్ చక్రవర్తి, మండల యూత్ అధ్యక్షులు మన్నవ గోపి, మండల తెలుగు రైతు అధ్యక్షులు పరిటాల హరిబాబు, కుర్ర ఏసుబాబు, ఎడ్లపల్లి సత్యనారాయణ, నల్లూరి సాంబశివరావు, అయినంపూడి శ్రీనివాసరావు, ఎనుముల పోతురాజు, మదమంచి రమణయ్య, మక్కెన అమ్మారావు వివిధ శాఖల అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై చర్యకు 7రోజుల గడువు

**రేపల్లె, మే 8, ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మార్చి 23వ తేదీ అందిన సమస్యల అర్జీపై తీసుకునే చర్యల వివరాలను 7 రోజులలోపు తెలియజేయాలని రేపల్లె మండల పరిషత్ అభివృద్ధి అధికారిని రేపల్లె మండల తహశీల్దార్ ఎం.శ్రీనివాసరావు ఆదేశించారు.రేపల్లె నియోజకవర్గ పరిధిలోని పంచాయతీలలో చెరువులను తవ్వించి తుఫాన్ షెల్టర్లు నిర్మించాలని,భారీ లోడ్ లారీల వలన దెబ్బతింటున్న రహదారులను సరిచేయించాలని రేపల్లెకు చెందిన పిన్ని సాంబశివరావు అర్జీ దాఖలు చేసిన నేపథ్యంలో ఎటువంటి చర్యలు తీసుకున్నారో తెలియజేయాలంటూ తహశీల్దార్ ఎం.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు.

## అనాథ మృతదేహం మార్చురీకి తరలించిన శ్రీశివలింగేశ్వర సేవాసమితి సభ్యులు

**తెనాలి మే8(ప్రభాతవార్త):** మద్యంమత్తులో, అనుమానస్పద స్థితిలో కాలువలో పడి మృతిచెందిన, తమిళనాడు కి చెందిన లారీడ్రైవర్ సెందిల్ కుమార్(55)మృతదేహాన్ని, త్రీ టౌన్ పోలీసుల సూచనల మేరకు,పట్టణానికి చెందిన శ్రీశివలింగేశ్వర స్వామి భక్తబృంద సేవాసమితి సభ్యులు తమ సొంత



వాహనంలో,జిల్లా ప్రభుత్వ వైద్యశాల లోని మార్చురీ కి తరలించారు.మృతుని స్నేహితుని కథనం ప్రకారం, మృతుడు లారీడ్రైవర్ సెందిల్ కుమార్, మూడురోజుల క్రితం నిమ్మకాయల లోడింగ్ కోసం,తెనాలి మార్కెట్ యార్డ్ కి వచ్చినట్టు,అధికమద్యం సేవించటం కారణంగా, కాలువలో పడి మృతిచెందినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మల్లెల వాసు,బి. శ్రీను, మరియు సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

## నేడు డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

**రేపల్లె, మే 8, ప్రభాతవార్త:** భట్టిప్రోలు మండలంలోని పెదపులివర్రు అంబేద్కర్ నగర్‌లో శనివారం సాయంత్రం 5 గంటలకు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు జైభీం రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దోవా రమేష్‌రాంజీ తెలిపారు.శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాన్ని మాజీ న్యాయమూర్తి,హై కోర్టు ప్రముఖ న్యాయవాది,



జైభీమ్ రావ్ భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడా శ్రావణ్ కుమార్ అవిష్కరిస్తారని చెప్పారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మాజీ ఉన్నతాధికారులు,ప్రజాసంఘాలనాయకులు,రేపల్లె,వేమూరు నియోజకవర్గాల పరిధిలోని అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పోతార్లంక శివ వెంకటేశ్వరరావు,రేపల్లె మండల కన్వీనర్ కర్రా బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## పచ్చిరొట్ట ఎరువులతో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవచ్చు

**వట్టిచెరుకూరు, మే 8, ప్రభాతవార్త :** పచ్చిరొట్ట ఎరువుల వినియోగంతో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవచ్చని గుంటూరు వ్యవసాయశాఖ ఏడిఏ ఎన్.మోహన్రావు పేర్కొన్నారు. ఫిరంగిపురం మండలంలోని నుదురుపాడు గ్రామంలో భూమాతను అధిక ఎరువుల బారి నుండి రక్షించడానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో దాత్రి మాత బచావో అభయాన్ కార్యక్రమంపై రైతులకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ మోహన్రావు పాల్గొని మాట్లాడుతూ..భూసారాన్ని కాపాడే బాధ్యత రైతులందరిపై ఉందని దీనికోసం రైతులు తొలకరి వర్షాలు కురవకముందే సేంద్రియ ఎరువులైన పశువుల ఎరువు, వానపాముల ఎరువులను భూమిలో వేసుకొని కలియ దున్నిన యెడల భూసారం పెరగడమే కాకుండా రసాయనక ఎరువులను గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. అలాగే పశువులు, వానపాముల ఎరువు తగు మోతాదులో దొరకని కారణంగా పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగా, పిల్లిపెసర పచ్చిరొట్ట విత్తనాలు తొలకరి వర్షాలు పడిన వెంటనే చల్లుకుని మొలకెత్తిన తర్వాత 40 45 రోజుల పూతదశలో వాటిని భూమిలో కలియదున్నాలని పేర్కొన్నారు. దీనివల్ల భూసారం పెరగటమే కాకుండా నీరు నిలుపుదల సామర్థం నేలకు పెరుగుతుందని, అంతేకాకుండా రసాయనిక ఎరువులు అధికముగా వాడడం వలన లోపాలు మరియు చీడపీడలు అధికంగా ఆశిస్తాయన్నారు. రసాయనిక ఎరువులు వాడుకునేటప్పుడు రైతులు విచ్చలవిడిగా యూరియా లాంటి నత్రజని ఎరువులను అధికముగా వాడుట వలన పైర్లు పచ్చగా కనపడతాయే కానీ, వెంటనే చీడపీడలకు లోనవుతాయని చెప్పారు. భాస్వరం ఎరువులను అందరూ అన్ని రకాల పంటలకు దుక్కి మరియు దమ్ములో మాత్రమే వినియోగించాలని, తరువాత వేసిన ఎడల అది పనిచేయకపోగా జింకు లోపాన్ని కలిగిస్తుందని వెల్లడించారు. పంట ఉత్పత్తుల నాణ్యత పెంచడం కొరకు కచ్చితంగా పొటాష్ ఎరువులను సూచించిన మోతాదులో రెండు దఫాలుగా వాడాలని, ప్రకృతి వ్యవసాయాన్ని కూడా రైతులు ప్రోత్సహించాలని తెలిపారు. వ్యవసాయశాఖ అందించు 20 రకాల విత్తనాల పిఎండిఎస్ కిట్టును తొలకరి పడినప్పుడు భూమిలో వెదజల్లుకొని 30రోజుల వ్యవధిలో దానిని పొలంలో కలియదున్నాలని చెప్పారు. రైతు భరోసా కేంద్రాలలో 15 కేజీల సంచి రూ.1500లకు దొరుకుతుందని వివరించారు. ప్రకృతి వ్యవసాయం



లో వాడే బీజామృతం, ఘన, ద్రవ జీవామృత వాడడం వలన గణనీయంగా ఎరువులు తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జె.వాసంతి మాట్లాడుతూ రైతులు అవసరం మేరకే పైరు మొత్తం మీద యూరియాను మూడుసార్లు వాడాలన్నారు. రైతులు ఫార్మర్ యాప్ ని తమ ఆండ్రాయిడ్ ఫోన్ లలో ఇన్స్టాల్ చేసుకుని సమస్త వ్యవసాయ సమాచారాన్ని పొందవచ్చునని తెలిపారు. ప్రతిరైతు ఫార్మర్ ఐడిని పొందాలని కోరారు. ఈ ఖరీఫ్ లో ఎరువులకు ఎటువంటి కొరత లేదని, రైతులు తమ భూముల్లో పంటలు వేయగానే, పట్టాదారు పాస్ పుస్తకాలతో విడతలు వారీగా ఎరువులు తీసుకోవచ్చన్నారు. అనంతరం గ్రామంలోని మన గ్రోమోర్ కేంద్రన్ని తనిఖీ చేసి, సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. మన గ్రోమోర్ సిబ్బంది రైతుల దగ్గర పాసు పుస్తకాల జెరాక్స్ తీసుకుని విడతలవారీగా ఎరువులు అందివ్వాలని ఆదేశించారు. కార్య క్రమంలో ఏఈవో సుభాని, విఏఏ సాంబశివరావు మరియు రైతులు పాల్గొన్నారు.

## తిరుమల సమాచారం



# భక్తులకు మెరుగైన సౌకర్యాలు

### • శ్రీవారి సేవలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ

**తిరుమల, మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రతిరోజూ లక్షమంది వరకు వస్తున్న భక్తులకు టిటిడి అధికారులు సకల సౌకర్యాలు కల్పిస్తున్నారని, స్వామివారి దర్శనం మెరుగైందని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తెలిపింది. శుక్రవారం ఉదయం తిరుమలకు చేరుకున్న ఈకమిటీ సభ్యులు ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికారు. దర్శనానంతరం శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయడంలో తుడ చేపడుతున్న అభివృద్ధి పనులను, హౌసింగ్, అర్బన్ ప్లానింగ్‌లో అనుసరిస్తున్న విధానాలను పార్లమెంటరీ కమిటీ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక సేవల విభాగం, లోక్ సభ చైర్మన్ మాగుంట శ్రీనివాసులురెడ్డి, లోక్ సభ సభ్యులు, ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్, ఎంఎయుఎండి డి.కరుణ, స్వచ్ఛఆంధ్ర ఎండి బి.అనిల్ కుమార్ రెడ్డి, టిటిడి బోర్డు సభ్యుడు సి.దివాకర్‌రెడ్డి ఉన్నారు.



## శ్రీవారి సేవలో జమ్మూకాశ్మీర్ గవర్నర్ మనోజ్‌సిన్హా

**తిరుమల, మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగురాష్ట్రాల్లోని, జమ్మూకాశ్మీర్ ప్రజలకు అంతా మంచి జరగాలని ఆకాంక్షిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్‌సిన్హా స్వామివారిని ప్రార్థించారు. శుక్రవారం ఉదయం ఆయన అధికారులతో కలసి తిరుమల ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ ఇఒ ముద్దాడ రవిచంద్ర, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, డిప్యూటీ ఇఒ భాస్కర్ స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. వేదపండితులు వేదాశీర్వచనం అందించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# వైభవంగా వేదనారాయణుని రథోత్సవం

### • భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగిన భక్తజనం



**తిరుమల, మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి అనుబంధంగా ఉన్న తిరుపతి జిల్లా నాగలాపురంలోని వేదనారాయణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం రథోత్సవం భక్తి పారవశ్యంలో అంగరంగ వైభవంగా జరిగింది. గోవింద నామస్మరణలు, మంగళ వాయిద్యాలు, భజనల నడుమ స్వామివారి రథయాత్ర గ్రామ వీధులను ఆధ్యాత్మిక కాంతులతో నింపింది. ఉదయం 6.25 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత వేదనారాయణ స్వామి మహారథాన్ని అధిష్ఠించి నాలుగు మాడ వీధుల్లో విహరించారు. డప్పు వాయిద్యాలు, కోలాటాలు, భజన బృందాల నృత్యాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. "గోవిందా.. గోవిందా.." నామస్మరణల మధ్య భక్తులు భక్తి శ్రద్ధలతో రథాన్ని లాగి తమ భక్తిని చాటుకున్నారు. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు. రథం యథాస్థానానికి చేరుకున్న అనంతరం వేదపారాయణం, ప్రబంధం, శాత్తుమొర నిర్వహించి మహాహారతి సమర్పించారు. రథోత్సవం ఆధ్యాత్మికంగా విశిష్టమైన తత్వాన్ని తెలియజేస్తుంది. శరీరమే రథం, బుద్ధి సారథి, మనస్సు పగ్గం, ఇంద్రియాలే గుర్రాలు, ఆత్మ రథికుడనే భావన ద్వారా ఆత్మానాత్మ వివేకాన్ని ఈ ఉత్సవం భక్తులకు బోధిస్తుంది. ఆ తరువాత మధ్యాహ్నం 12గంటల వరకు స్వామివారు, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఆలయ అధికారులు, సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, ఇన్‌స్పెక్టర్ చెంగల్ రాయులు, భక్తులు పాల్గొన్నారు.



# రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలి

### • తిరుపతి తాతయ్యగుంట గంగమ్మకు సారె సమర్పించిన మంత్రి సత్యకుమార్

**తిరుపతి, మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** పుణ్యక్షేత్రం తిరుపతినగరంలో గ్రామదేవతగా కొలువై భక్తుల పూజలందుకుంటున్న తాతయ్యగుంట గంగమ్మ ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, గంగమ్మ ఆశీస్సులతో సకాలంగా వర్షాలు కురవాలని ప్రార్థించినట్లు తెలిపారు. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మజాతర సందర్భంగా రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ శనివారం ఉదయం ఆలయం వద్దకు చేరుకున్నారు. ఇక్కడ ఆయన స్వయంగా తలపై సారెను తీసుకుని అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ చైర్మన్ నైనార్ మహేశ్‌యాదవ్, ఆలయ ఇఒ జయకుమార్, అర్చకులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రి వెంట తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, జిల్లా బిజెపి నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి, లోక ప్రభాకర్ నాయుడు, అనూష రామకృష్ణ, దీపక్ యాదవ్, చంద్రశేఖర్ రాయల్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, సాయిప్రసాద్, వరప్రసాద్, భాస్కర్, నవీన్ రాయల్, రెడ్డి బాబు, పార్థసారథి, మల్ల కుప్పం శేఖర్ పాల్గొని గంగమ్మకు సారె సమర్పించారు.



# సత్యసాయిబాబాకు మాటిచ్చా!

### • సత్యసాయి స్కీముల మెయింటెనెన్స్‌కు నిధులు ఇవ్వాల్సిందే
### • సీనియర్ ఐఏఎస్ అధికారులను ఆదేశించిన సిఎం చంద్రబాబు
### • జిల్లా కలెక్టర్ ఆనంద్ లేవనెత్తిన సమస్యపై స్పందించిన సిఎం




**అనంతపురం, మే 8 ప్రభాతవార్త బ్యూరో:** శ్రీ సత్యసాయి మంచినీటి పథకాల నిర్వహణ బాధ్యత ప్రభుత్వానిదే. నేను అప్పట్లో సిఎంగా ఉన్నప్పుడు పుట్టపర్తి సత్యసాయి బాబాకు మాటిచ్చాను. సత్యసాయి స్కీముల నిర్వహణకు ఏదో స్కీం కింద నిధులు ఇవ్వాల్సిందే అంటూ సీనియర్ ఐఏఎస్ అధికారులను శుక్రవారం అమరావతిలో నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేయడం విశేషం. ఆసక్తికరంగా సాగిన అధికారుల చర్చలో సిఎం చంద్రబాబు స్పందన అభినందనీయం. వివరాల్లోకి వెళ్తే.. కలెక్టర్ల సమావేశంలో అనంతపురం తాగునీటి సమస్యలపై అనంతపురం కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ "సార్, అనంతపురంలో తాగునీటి సమస్యల గురించి. మనకు అక్కడ సత్యసాయి వాటర్ సప్లయ్ బోర్డు, రూరల్ వాటర్ సప్లయ్‌కి సంబంధించిన చాలా స్కీమ్స్ ఉన్నాయి. వాటికి సంబంధించిన పేమెంట్స్ అన్నీ కూడా రూరల్ లోకల్ బాడీస్ లేదా అర్బన్ లోకల్ బాడీస్ ద్వారా జరగాలి. కానీ వారి దగ్గర నుండి పేమెంట్స్ క్రమం తప్పకుండా రావడం లేదు. దీనివల్ల తాము ప్రాపర్‌గా మంచినీటి పథకాల నిర్వహణ పనులు చేపట్టలేకపోతున్నాం. ఈ వేసవి కాలంలో ఇది ఇబ్బందిగా మారుతోంది. పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖ విభాగాలకు తగిన ఆదేశాలు ఇస్తే, ఒక సెంట్రలైజ్డ్ లెవెల్‌లో ఆ నిధులను ఆర్.డబ్ల్యూ.ఎస్‌కి కేటాయిస్తే బాగుంటుంది" అని విజ్ఞప్తి చేశారు. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందిస్తూ సీనియర్ ఐఏఎస్ అధికారులు శశిభూషణ్‌ను చూస్తూ "దీనిపై మీరు వర్క్ చేయండి. మీరు ఈ స్కీమ్‌ను టేకాఫ్ చేయండి. సెంట్రలైజ్డ్‌గా ఉండాలి, జిల్లా పరిషత్ జోక్యం లేకుండా ఒక అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా వాళ్లకు నీళ్లు అందేలా చూడాలి" అని ఆదేశించారు. ఆ సమయంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ముఖ్య అధికారి శశిభూషణ్ స్పందిస్తూ "తప్పకుండా సార్, అనంతపురం కలెక్టర్ కోరిన విధంగా తగిన పరిష్కారం చూపిస్తాం. ప్రస్తుతం మా పని తీరుకు ఇది కొంచెం భిన్నంగా ఉన్నప్పటికీ ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీ కూడా దీనికి అంగీకరించారు. ఒక మంచి పరిష్కారం కనుగొంటాం" అని సమాధానం ఇచ్చారు. దీనిపై సిఎం చంద్రబాబు మళ్లీ జోక్యం చేసుకుంటూ "చూడండి, నాకు ఇవేమీ తెలియవు. పుట్టపర్తి సత్యసాయిబాబా ప్రత్యేక చొరవతో శ్రీ సత్యసాయి మంచినీటి ప్రాజెక్ట్ ప్రారంభించే ముందు నన్ను పిలిచి ఒకటే రిక్వెస్ట్ చేశారు. "నేను ఎంతో కష్టపడి ఈ ప్రాజెక్ట్ కట్టాను, దీని మెయింటెనెన్స్ బాధ్యత మీరే తీసుకోవాలి" అని అడిగారు. అప్పుడు నేను సత్యసాయి బాబాకు మాట ఇచ్చాను, మీరు ప్రాజెక్ట్ కడితే నీళ్ల ఇచ్చే బాధ్యత, మెయింటెనెన్స్ బాధ్యత నేను తీసుకుంటానని చెప్పాను. అది నా కమిట్‌మెంట్. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు చోట్ల ఇటువంటి ప్రాజెక్టులు కట్టారు. ఇక్కడ, మహబూబ్‌నగర్, మెదక్, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సత్యసాయి మంచినీటి పథకాలను అమలు చేశారు. గత ప్రభుత్వంలో దీన్ని సరిగ్గా మెయింటైన్ చేయకుండా అంతా గందరగోళం చేశారు. ఇకపై అలా జరగకూడదు. పాత సిస్టమ్‌నే మళ్ళీ పునరుద్ధరించండి. అవసరమైన నిధులు విడుదల చేయండి అంటూ సిఎం చంద్రబాబు నాయుడు కలెక్టర్ల సమావేశంలో రాష్ట్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆనంద్ చొరవతో సమస్యలను దృష్టికి తీసుకెళ్లడం సిఎం స్పందించడం విశేషంగా చెప్పొచ్చు.






# భూసమస్యల పరిష్కారంలో డిజిటల్ విప్లవం

### • బ్లాక్ చైన్ టెక్నాలజీతో రికార్డులకు పూర్తి భద్రత: భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జి.జయలక్ష్మీ

**సచివాలయం, మే 8 ప్రభాతవార్త:** రాష్ట్రంలో భూముల సర్వే, రికార్డుల డిజిటలైజేషన్, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో ప్రభుత్వం తీసుకొచ్చిన సరికొత్త సంస్కరణలను కలెక్టర్ల సదస్సులో శుక్రవారం భూ పరిపాలన ప్రధాన కమీషనర్ జి.జయలక్ష్మీ సవివరంగా వివరించారు. 'రీసర్వే 2.0'లో తీసుకొచ్చిన మార్పుల గురించి చెబుతూ, భూముల సర్వే సమయంలో పూర్తి పారదర్శకత కోసం ఇకపై క్షేత్రస్థాయి పరిశీలన, 9(2) నోటీసుల జారీ దశల్లో భూ యజమానులకు తప్పని సరిగా ఆన్‌లైన్ ద్వారా 'ఇ-కెవైసి విధానాన్ని అమలు చేయనున్నట్లు ఆమె తెలిపారు. ముసాయిదా పట్టాదారు పాస్‌బుక్‌ల తయారీకి కూడి యజమానులు నుండి నేరుగా ఇ-కెవైసి తీసుకుంటామన్నారు. గతంలో ఒక్కో గ్రామంలో సర్వే పూర్తి చేయడానికి 135 రోజులు మాత్రమే ఉండగా, పనులు మరింత పకడ్బందీగా తప్పులేకుండా జరగాలనే ఉద్దేశ్యంతో ఆ గడువును 223రోజులకు పెంచినట్లు స్పష్టం చేశారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో 2027 మార్చి నెలాఖరు నాటికి లక్ష్యాల మేరకు పట్టాదారు పాస్ బుక్‌ల పంపిణీ వంద శాతం పూర్తి చేయడానికి పక్కా కార్యాచరణ సిద్ధం చేశామని కలెక్టర్లకు భరోసా ఇచ్చారు. దశాబ్దాల నాటి పాత రెవెన్యూ రికార్డులను అత్యంత సురక్షితంగా భద్రపరచడంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని జయలక్ష్మీ పంచుకున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ టెక్నాలజీ ద్వారా డేటాను సులభంగా విశ్లేషించి, అధికారులు అడిగిన వెంటనే నిమిషాల్లో వెతుక్కునేలా పాత రికార్డులన్నింటినీ డిజిటలైజ్ చేస్తున్నామన్నారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో అత్యంత తక్కువ ఖర్చుతో పైలట్ ప్రాజెక్టుగా ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేశామని ఆమె సగర్వంగా చెప్పారు. ఇదే స్ఫూర్తితో మాన్యువల్ 1బి రిజిష్టర్లు, పాత అడంగళ్ళు, 10-1రిజిష్టర్ డిజిటలైజేషన్ పనుల మొదటి దశను జులై 31, 2026కల్లా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఇక భూముల రికార్డుల భద్రత కోసం ప్రభుత్వ చరిత్రలోనే తొలిసారిగా అత్యాధునాతన బ్లాక్ చైన్ టెక్నాలజీని తీసుకొస్తున్నామని ఆమె వెల్లడించారు. ఈ అధునాతన విధానం ద్వారా భూముల వివరాల్లో భవిష్యత్తులో ఎటువంటి తారుమారు జరగకుండా, అందరికీ ఒకే ఖచ్చితమైన సమాచారం (సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్) అందుబాటులో ఉంటుందని, బెంగళూరు ఎన్ఐసి సహకారంతో ఇప్పటికే 5గ్రామాల్లో ఈ పైలట్ ప్రాజెక్టు విజయవంతమైందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. భూ వివాదాల పరిష్కారం, ప్రజల ఫిర్యాదుల పట్ల కూడా రెవెన్యూ శాఖ ఎంతో బాధ్యతగా పనిచేస్తుందని ఆమె గణాంకాలతో వివరించారు. ముఖ్యంగా సెక్షన్ 22ఏ కింద ఉన్న వివాదాస్పద భూముల కేసుల పరిష్కారంలో అనంతపురం 851కేసులు, కృష్ణా 353, శ్రీకాకుళం 332, జిల్లాలు అత్యుత్తమ పనితీరు కనబరిచాయని కలెక్టర్లను అభినందించారు. అయితే అన్నమయ్య 433, ప్రకాశం 416, మార్కాపురం 408 జిల్లాల్లో ఈ దరఖాస్తులు భారీగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించేలా ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ఇక రాష్ట్రస్థాయి పబ్లిక్ గ్రీవెన్స్ (పిజిఆర్ఎస్-మీకోసం) పరిష్కారంలో రెవెన్యూ శాఖ పనితీరు అద్భుతంగా మెరుగుపడిందని అన్నారు. ప్రజల సమస్యలను అత్యంత వేగంగా, నాణ్యంగా పరిష్కరించడం వల్లే రాష్ట్రస్థాయిలో రెవెన్యూ శాఖ ర్యాంకు 11వ స్థానం నుండి ఏకంగా 4వ స్థానానికి ఎగబాకిందని వివరిస్తూ, ఈ అద్భుతమైన పనితీరును ఇలాగే కొనసాగిస్తూ భూ సమస్యల్లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

# వేగంగా గృహ నిర్మాణాలు

### • రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ స్పెషల్ సిఎస్ అజయ్ జైన్

**సచివాలయం, మే 8 ప్రభాతవార్త:** రాష్ట్రంలో గృహ నిర్మాణ కార్యక్రమాల అమల్లో భాగంగా 2015-16నుంచి ఇప్పటివరకు పిఎంఎవై అర్బన్, పిఎంఎవై గ్రామీణ, పిఎంజన్మన్ తదితర పథకాల క్రింద మొత్తం 17.67లక్షల ఇళ్ళకు మంజూరు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఏడవ కలెక్టర్ల సమావేశంలో గృహ నిర్మాణ శాఖ స్పెషల్ సీఎస్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మాత్రమే 5.81లక్షల ఇళ్ళు పూర్తి కాగా, మొత్తం పూర్తైన ఇళ్ళ సంఖ్య 13.09లక్షలకు చేరిందని వెల్లడించారు. ప్రస్తుతం మరో 4.86లక్షల ఇళ్ళు నిర్మాణ దశలో ఉండగా, 01.06.2024 నుంచి ఇప్పటివరకు రూ.19,708.86 కోట్ల వ్యయం జరిగినట్లు పేర్కొన్నారు. పిఎంఏవై అర్బన్ బెనిఫిషియరీ లెడ్ కన్‌స్ట్రక్షన్ కింద 13.21లక్షల ఇళ్ళల్లో 9.86లక్షల ఇళ్ళు పూర్తయ్యాయని, పిఎంఏవై-ఏహెచ్‌పి కింద 2.61లక్షల ఇళ్ళల్లో 1.88లక్షల ఇళ్ళు పూర్తియ్యాయని వివరించారు. అలాగే పిఎంఏవై గ్రామీణ పథకం కింద 1.77లక్షల ఇళ్ళలో 1.15లక్షల ఇళ్ళు, పిఎంజన్మన్ కింద 36,932 ఇళ్లలో 19,963ఇళ్ళు పూర్తయ్యాయని తెలిపారు. జిల్లాల వారీగా గృహ నిర్మాణ పురోగతిని వివరిస్తూ చిత్తూరు, అనకాపల్లి, శ్రీకాకుళం, పశ్చిమగోదావరి, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలు అత్యుత్తమ ప్రగతి కనబరిచినట్లు వెల్లడించారు. చిత్తూరు జిల్లాలో 89శాతం గృహాలు పూర్తికాగా, అనకాపల్లిలో 84శాతం, శ్రీకాకుళంలో 83శాతం గృహాలు పూర్తయ్యాయి. మరోవైపు పోలవరం, బాపట్ల ఎన్టీఆర్, ఏలూరు, కర్నూలు జిల్లాల్లో పనులు వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. 2026డిసెంబర్ నాటికి నిర్మాణంలో ఉన్న 4.88లక్షల ఇళ్ళను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లకు లక్ష్యాలు నిర్ధేశించడం జరిగింది. పిఎంఏవై 1.0కింద చేపట్టిన ఇళ్ళలో మెటీరియల్ రీకన్సిలియేషన్, నాణ్యత లోపాల సవరణను పూర్తి చేయాలని ఆదేశించారు. లబ్ధిదారుల జాబితాలను స్వర్ణగ్రామం, స్వర్ణవార్డు కార్యాలయాల్లో ప్రదర్శించాలని, హౌసింగ్ శాఖపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెంపొందేలా తక్కువ పనితీరు ఉన్న సచివాలయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాలు, హౌసింగ్ అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఒలు తదితర శాఖలతో నిరంతర సమీక్షలు నిర్వహించడంతోపాటు, ఫీల్డ్ విజట్లు చేసి లబ్ధిదారులతో నేరుగా మాట్లాడాలని కలెక్టర్లకు సూచించారు. గృహ లేఅవుట్లలో మౌలిక సదుపాయాల కల్పనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అనుసంధానంతో దశలవారీగా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు.

# పట్టణ మౌలిక వసతులు మెరుగ్గా కల్పించాలి

**తిరుమల, మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి నగరంతోబాటు దేశంలోని అన్ని ప్రధాన నగరాలు, పట్టణాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సూచించింది. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయడంలో తుడా చేపడుతున్న అభివృద్ధి పనులను, హౌసింగ్ అర్బన్ ప్లానింగ్‌లో అనుసరిస్తున్న విధానాలను పార్లమెంటరీ కమిటీ సభ్యులు అభినందించారు. శుక్రవారం మధ్యాహ్నం ఈ కమిటీ తిరుపతిలోని ఓ హోటల్‌లో సమావేశమైంది. పార్లమెంటరీ కమిటీ అధ్యయన పర్యటనలో భాగంగా నిర్వహించిన సమావేశంలో కేంద్ర గృహనిర్మాణ శాఖ, అర్బన్ అఫైర్స్ మంత్రిత్వ శాఖకు చెందిన పథకాల అమలు పురోగతిపై సమీక్షించారు.

### వీధి వ్యాపారులకు రూ.15.69 కోట్లు మంజూరు




అమృత్, అమృత్ 2, స్వచ్ఛభారత్ మిషన్, ప్రధానమంత్రి అవాజ్‌యోజన కార్యక్రమాలపై చర్చించారు.

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్, ఇతర పట్టణ స్థానిక సంస్థల మానవ వనరుల సామర్థ్యం, ఆదాయ వనరుల సమీకరణ, బడ్జెట్ నిర్వహణ అంశాలపై ప్రత్యేక సమీక్ష చేశారు. తిరుపతి వంటి వారసత్వ ఆధ్యాత్మిక నగరాల స్థిరమైన పట్టణాభివృద్ధి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్లమ్ పునర్వ్యవస్థీకరణ, పునరావాస కార్యక్రమాల అమలు తదితర అంశాలపై కూడా చర్చలు జరిపారు.

ఈ ఉన్నత స్థాయి సమావేశంలో లోక్ సభ చైర్మన్, ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, లోక్ సభ మెంబర్లు, ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్, మెప్మా ఎండి డి.కరుణ, స్వచ్ఛాంధ్ర ఎండి బి.అనిల్ కుమార్ రెడ్డి, టిడ్కో ఎండి ప్రభాకర్, తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు, తుడ చైర్మన్ సి.దివాకర్ రెడ్డి, తిరుపతి జిల్లా సంయుక్త కలెక్టర్ గోవింద రావు, నగరపాలక కమిషనర్ శారదాదేవి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# రాయలసీమకు 'రాయల్ కళ'




**విజయవాడ, మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** రాయలసీమకు "రాయల్ కళ" వస్తోందని ప్రతిబింబించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాయల సీమ ఇక రాయల్ సీమని శ్లాఘించారు. ఆ దిశలో సామాజిక మాధ్యమంలో ఓ పోస్టు పెట్టారు. రాయల సీమకు "రాయల్" కళ వస్తోందని ప్రతిబింబించేలా చంద్రబాబు పోస్ట్ ఉంది. పోస్టులో ఆయన ట్యాగ్ చేసిన మోటారు సైకిల్ నూతన వర్షన్‌లో ఆకర్షణీయంగా ఉంది, రాయలసీమ "రాయల్" సీమ అంటూ సిఎం ఈ ఆసక్తికర పోస్ట్ పెట్టారు. దిగ్గజ మోటార్ సైకిల్ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ తిరుపతిలో భారీ పెట్టుబడులకు సిద్ధవ్వగా ఇక రాయల్‌సీమ అంటూ సిఎం రాసుకొచ్చారు. నిజానికి ఈ పోస్టులో బండి అందరంగా ఉంది.

# వేసవి సెలవుల్లోనూ తిరుమలలో భక్తులకు విస్తృత వసతి

### • అందుబాటులోకి పిఎసిలలో లాకర్లు, విశ్రాంతి హాళ్లు





**తిరుమల, మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు ప్రతిరోజూ ప్రపంచ నలుమూలల నుండి వేలాది మంది భక్తులు తిరుమలకు విచ్చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం తిరుమల తిరుపతి దేవస్థానం విస్తృత స్థాయిలో వసతి, విశ్రాంతి, లాకర్, స్నాన, అన్నప్రసాదం తదితర సదుపాయాలను కల్పిస్తోంది. భక్తులు దర్శనానికి ముందు తిరుమలకు చేరుకుంటే స్నానమాచరించి పవిత్రంగా స్వామివారి దర్శనానికి వెళ్లడం ఆనవాయితీ. భక్తుల ఆచారాలు మనోభావాలను దృష్టిలో ఉంచుకుని తిరుమల, తిరుపతిలో అనేక వసతి గదులు, యాత్రికుల వసతి సముదాయాలను టిటిడి నిర్మించింది.

**గదుల కేటాయింపు విధానం:** తిరుమలలో వసతి గదులు పొందదలచిన భక్తులు సిఆర్ఓ జనరల్ కౌంటరులో ఆధార్ కార్డు, ఫోన్ నంబరు తదితర వివరాలను నమోదు చేసుకోవాలి. అనంతరం కేటాయించబడిన గది నంబరు, ఆ ప్రాంత వివరాలు ఎస్ఎంఎస్ ద్వారా భక్తులకు పంపబడతాయి. భక్తులు సంబంధిత ఉప విచారణ కార్యాలయంలో యూపీఐ/కార్డు ద్వారా చెల్లింపు చేసి గదిని పొందవచ్చు. తిరుమలలో స్థలాభావం కారణంగా 7,800 వసతి గదులు మాత్రమే అందుబాటులో ఉన్నందున, కుటుంబాలతో వచ్చిన భక్తులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోంది. ఒంటరి, అవివాహిత స్త్రీ, పురుష జంటలకు గదులు కేటాయించడంలేదు. వసతి గదులు లభించని భక్తుల కోసం తిరుమలలో ఐదు యాత్రికుల వసతి సముదాయాలను టిటిడి ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాలలో భక్తులు ఆధార్ కార్డు, ఫోన్ నంబరు నమోదు చేసి ఉచిత లాకర్లు, ఇతర సౌకర్యాలను పొందవచ్చు.

**సిఆర్ఓ సమీపంలోని పిఎసి1:** గోవర్ధన్ సత్రం ఎదురుగా ఉన్న ఈ సముదాయంలో నాలుగుహాళ్లు, 1,256 లాకర్లు ఉన్నాయి. ప్రస్తుతం పునరుద్ధరణ పనుల కారణంగా 870 లాకర్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అన్నప్రసాదం సౌకర్యం ఉంది.

**పిఎసి 2 (మాధవ నిలయం):** బాలాజీ బస్ స్టాండ్ ఎదురుగా ఉన్న ఈ సముదాయంలో 12 హాళ్లు, 3,300 లాకర్లు ఉన్నాయి. అన్నప్రసాదం, తలనీలాలు సమర్పించే సదుపాయం, ప్రథమ చికిత్స కేంద్రం, విశ్రాంతి సదుపాయాలు కల్పించబడ్డాయి.

**పిఎసి 3:** జీఎన్సీ టోల్ గేట్ నుండి రాంభగీచా బస్ స్టాండ్‌కు వెళ్లే ఔటర్ రింగ్ రోడ్డులో ఉన్న ఈ భవనంలో 9 హాళ్లు, 1420 లాకర్లు ఉన్నాయి. తలనీలాలు సమర్పించే సదుపాయం, విశ్రాంతి సౌకర్యం కలదు.

**పద్మనాభ నిలయం:** బాలాజీ బస్ స్టాండ్ లోపల ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో మూడు హాళ్లు, 960 లాకర్లు ఉన్నాయి. ఇక్కడ విశ్రాంతి, లాకర్, స్నాన సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి.

**పిఎసి5 (వేంకటాద్రి నిలయం):** భక్తుల సౌకర్యార్థం నిర్మించిన ఈ ఆధునిక సముదాయాన్ని 2025 సెప్టెంబర్ 25న ప్రారంభించారు. ఈ భవనంలో 16 హాళ్లు, 2400 లాకర్లు ఉన్నాయి. అన్నప్రసాదం, తలనీలాలు సమర్పణ, ప్రథమ చికిత్స, విశ్రాంతి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి.

**భక్తులకు అందుబాటులో 9,336 ఉచిత లాకర్లు:** తిరుమలలోని ఈ ఐదు యాత్రికుల వసతి సముదాయాలన్నింటిలో కలిపి మొత్తం ఉన్నాయి. భక్తులు తమ విలువైన వస్తువులను భద్రపరచుకోవడానికి వీటిని వినియోగించుకోవచ్చు. ఈ కేంద్రాలలో ఉచిత వేడి నీటి స్నాన గదులు, మరుగుదొడ్లు, చాపలు, రగ్గులు, అన్నప్రసాదం, తలనీలాలు సమర్పించే సదుపాయం, ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేశారు. దర్శనం అనంతరం భక్తులు లాకర్లు ఖాళీ చేసి, తీసుకున్న చాపలు, రగ్గులు తిరిగి అప్పగించాల్సి ఉంటుంది. భక్తులు ఈ యాత్రికుల వసతి సముదాయాలను వినియోగించుకుని స్వామివారి దర్శనాన్ని సుఖసంతోషాలతో పూర్తి చేసుకోవాలని, దర్శనం అనంతరం గదులు, లాకర్లు వెంటనే ఖాళీ చేసి ఇతర భక్తులకు కూడా అవకాశం కల్పించాలని టిటిడి విజ్ఞప్తి చేస్తోంది.

# కుమార్తె పై అత్యాచారం కేసు
# తండ్రికి జీవిత ఖైదు




- బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం
- కేసు నమోదులో మహిళ కానిస్టేబుల్ చొరవ

**గుంటూరు లీగల్, మే 8 ప్రభాతవార్త:** జీవితాంతం అండగా ఉంటానంటూ ఓ మహిళకు దగ్గరై, ప్రేమ, సహజీవనం, వివాహం అనంతరం, ఆమెకు పుట్టిన 12 ఏళ్ల బాలికపై అత్యంత పాశవికంగా అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ గుంటూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం శుక్రవారం సంచలనాత్మక తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం చిలకలూరిపేట, రెడ్ల బజారుకు చెందిన రాయపూడి శ్రీదేవికి 2006లో వివాహమై, ఒక పాప పుట్టాక భర్తతో విడిపోయింది. తిమ్మాపురం క్వార్టర్స్‌లో ఉంటుండగా 2009లో ఆప్రాంతానికి చెందిన పెయింటర్ రాయపూడి మరియదాసుతో పరిచయమై, ప్రేమగా మారి, కొంతకాలం సహజీవనం చేసిన అనంతరం వివాహం చేసుకున్నారు. శ్రీదేవికి కలిగిన కుమార్తె కూడా వీరితోనే కలిసి ఉండేది. శ్రీదేవి కూలి పనులకు వెళ్లిన సమయంలో బాలికపై మరియదాసు అత్యాచారానికి ప్రయత్నించేవాడు. రాయటానికి అవకాశం లేని అంశాలతో తీవ్రమైన అసభ్యకర ప్రవర్తనకు పాల్పడేవాడు. చాలాకాలం తల్లి శ్రీదేవికి ఈ విషయం తెలియలేదు. 2018 మార్చి నెలలో, ఒకరోజు ఇంటికి వచ్చిన తల్లికి నగ్న దృశ్యం కనపడటంతో భర్త మరియదాసును నిలదీసింది. తనకు దెయ్యం పట్టిందని, ఇలా ప్రవర్తించకూడదని క్షమాపణ కోరుకున్నాడు. పెద్దల సమక్షంలో పంచాయతీ కూడా జరిగింది.

**ధైర్యంగా కానిస్టేబుల్‌కు బాలిక సమాచారం:** వరుసకు తండ్రి తనపై శారీరక హింసకు గురిచేయడాన్ని తట్టుకోలేని బాలిక ధైర్యం చేసింది. అదే సమయంలో బాలిక చదివే స్కూల్లో చిలకలూరిపేట పోలీసులు పిల్లలకు "గుడ్ టచ్... బ్యాడ్ టచ్" అనే అంశంపై వివరిస్తున్నారు. తమ స్కూలుకు వచ్చిన పోలీసు టీంలోని మహిళా కానిస్టేబుల్ బిరుదు సరోజకు, ఈ బాలిక తనపై జరుగుతున్న అకృత్యాన్ని వివరించింది. ఆశ్చర్యపోయిన పోలీసులు 2019 ఆగస్టు 26వ తేదీన బాలిక నుండి, ఆమె తల్లి నుండి ఫిర్యాదు స్వీకరించి వాస్తవాలను రాబట్టారు. బాలికకు 10 ఏళ్ల వయసు నుండి మరియదాసు ఈ దుర్మార్గానికి పాల్పడుతున్నట్లు తేలింది. బాలిక నుండి పూర్తి విషయాలను కానిస్టేబుల్ సరోజ సేకరించగలిగారు. చిలకలూరిపేట పట్టణ ఎస్ఐ బి.శివరామయ్య కేసు నమోదు చేశారు. అప్పటి చిలకలూరిపేట సి.ఐ వి.సూర్యనారాయణ నిందితుడిని అరెస్ట్ చేశారు. సిఐ టి.వెంకటేశ్వర్లు చార్జిషీటు దాఖలు చేశారు. పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తీగల దుర్గాప్రసాద్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో యావజీవ కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సుల్తానా బేగం తీర్పు చెప్పారు. ఈ కేసులో బాధితురాలు అయిన మైనర్ బాలికకు, ప్రభుత్వం ద్వారా రూ.5 లక్షల పరిహారం అందించాలని ఆదేశించారు.

# మహానాడు నిర్వహణకు 19 కమిటీలు

- మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో 10 మందితో సమన్వయ కమిటీ ఏర్పాటు



**విజయవాడ, మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** మహానాడు నిర్వహణకు తెలుగుదేశం పార్టీ 19 కమిటీలను ఏర్పాటు చేసింది. సీనియర్లు, జూనియర్ల కలయికతో కమిటీ ఏర్పాటు చేశారు. ఈనెల 27, 28,29 తేదీల్లో నెల్లూరు జిల్లాలోని ఇఫ్కో సెజ్ ప్రాంగణంలో మహానాడు నిర్వహించనున్నారు. దీని కోసం సమన్వయ కమిటీ ఏర్పాటు చేశారు. "మహానాడు" నిర్వహణకు టిడిపి అధిష్ఠానం 19 కమిటీలను ఏర్పాటు వేసింది. ఈ క్రమంలో టిడిపి కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో 10 మందితో సమన్వయ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి కో కన్వీనర్‌గా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావులను నియమించింది. మంత్రి గొట్టిపాటి రవికుమార్ నేతృత్వంలో జనసమీకరణ కమిటీ ఏర్పాటు అయ్యింది. మంత్రులు ఎన్ఎండి ఫరూఖ్, అనగాని సత్యప్రసాద్, బిసి జనార్దన్‌రెడ్డి, కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కిలారు రాజేష్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్, పార్టీ జోనల్ కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణరాజులు కమిటీలో సభ్యులుగా ఉన్నారు. పలు కమిటీల్లో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల పార్టీ నేతలను భాగస్వాముల్ని చేశారు. తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడి నేతృత్వంలో తీర్మానాల కమిటీ ఏర్పాటు చేశారు. కో-కన్వీనర్లుగా ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కాలవ శ్రీనివాసులు, పార్టీ నాలెడ్జ్ కమిటీ ఛైర్మన్ గురజాల మాల్యాద్రి, మంత్రి సవిత, పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనంద్‌బాబు, ఎంఎ షరీఫ్, వర్ల రామయ్య, ఎమ్మెల్యేలు కళా వెంకట్రావు, కూన రవికుమార్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, మాజీ ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు, ఎపి కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి.కృష్ణయ్య, జీవవైవిధ్య బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్, నేతలు చిలువేరు కాశీనాథ్, సామా భూపాల్‌రెడ్డి, నెల్లూరి దుర్గాప్రసాద్‌లను సభ్యులుగా నియమించారు.

**ఎపి, టిజి కీలక నేతలతో ఆహ్వాన కమిటీ**

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నరసింహులు (తెలంగాణ), అండమాన్-నికోబార్ అధ్యక్షుడు మాణిక్యం యాదవ్‌లు కన్వీనర్లుగా ఆహ్వాన కమిటీని నియమించారు. పయ్యావుల కేశవ్ కన్వీనర్‌గా సభా నిర్వహణ కమిటీ ఏర్పాటు చేశారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు పలువురు నేతలు ఇందులో సభ్యులుగా ఉన్నారు. మంత్రులను కమిటీలకు కన్వీనర్లుగా నియమించారు. మంత్రి అచ్చెన్నాయుడు కన్వీనర్‌గా వసతి ఏర్పాట్ల కమిటీ, బిసి జనార్దన్‌రెడ్డి కన్వీనర్‌గా భోజనాల ఏర్పాట్ల కమిటీ, హోంమంత్రి వంగలపూడి అనిత కన్వీనర్‌గా మీడియా కమిటీ, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ కన్వీనర్‌గా ఆర్థిక వ్యవహారాల కమిటీ, గుమ్మిడి సంధ్యారాణి కన్వీనర్‌గా సాంస్కృతిక కార్యక్రమాల కమిటీ, నిమ్మల రామానాయుడు కన్వీనర్‌గా సభా ప్రాంగణ పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేశారు. వీటితో పాటు చిత్ర ప్రదర్శన, ప్రతినిధుల నమోదు, అలంకరణ, రవాణా, వాహన పార్కింగ్, రక్తదానం వైద్య క్యాంపు, వాలంటీర్ల నిర్వహణ, జనసమీకరణ, పరిశుభ్రత సుందరీకరణకు కమిటీలను ఏర్పాటు చేశారు.



# బ్యాటరీ దొంగల ముఠా గుట్టురట్టు

- ముగ్గురు అరెస్ట్, రూ.1.45 లక్షల సొత్తు స్వాధీనం

**నెల్లూరు క్రైమ్, మే 8 ప్రభాతవార్త:** నగరంలోని ఆటోనగర్ ప్రాంతంలో వరుసగా లారీ బ్యాటరీల దొంగతనాలకు పాల్పడుతూ లారీ యజమానులను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ముఠాను వేదాయపాలెం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు, వారి వద్ద నుంచి భారీగా చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన వివరాలను శుక్రవారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగర ఏఎస్పీ దీక్ష వెల్లడించారు.

**అసలేం జరిగిందంటే..!:** గత కొంతకాలంగా వేదాయపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటోనగర్‌లో రిపేర్ కోసం నిలిపి ఉంచిన లారీల నుండి బ్యాటరీలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్తున్నారు. ఈ దొంగతనాలపై ఫిర్యాదులు రావడంతో జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సిహెచ్ సౌజన్య, టౌన్ ఏఎస్పీ దీక్షల పర్యవేక్షణలో వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసరావు, ఎస్ఐ యు.సాయి కళ్యాణ్ ఇతర సిబ్బంది ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో చంద్రబాబు నగర్ మెయిన్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. నిందితులు చింతగుంట వెంకటేశ్వర్లు (19), పారి నరసింహులు (21), ఇలగనూరు శ్రీనివాసులు(24) అని గుర్తించారు. నిందితులు ముగ్గురూ చెడు వ్యసనాలకు బానిసై, జల్సాల కోసం సులభంగా డబ్బు సంపాదించాలని దొంగతనాల బాట పట్టారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు వీరు ఒక హ్యుందాయ్ ఐ20 కారును దొంగతనాల కోసం ఉపయోగించడం గమనార్హం. పోలీసులు నిందితుల నుంచి 14 లారీ బ్యాటరీలు, కారును స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.1,45,000లు ఉంటుందని తెలిపారు. కేసును అత్యంత వేగంగా ఛేదించిన వేదాయపాలెం పోలీసు బృందాన్ని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ప్రతిభ కనబరిచిన అధికారులకు, సిబ్బందికి రివార్డులు అందజేశారు.

# చెన్నూరులో యువకుడు హత్య



**గూడూరు రూరల్ (నెల్లూరు), మే 8 ప్రభాతవార్త:** గూడూరు మండలం చెన్నూరులో ఓ యువకుడు హత్యకు గురైన సంఘటన శుక్రవారం చోటుచేసు కుంది. రూరల్ పోలీసుల కథనం మేరకు ఉత్తరప్రదేశ్‌కి చెందిన ఐదు మంది యువకులు తుంగ పాలెంలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేసేందుకు వచ్చారు. చెన్నూరులో ఈ ఐదు మంది యువకులు ఈనెల 5వ తేదీన ఓ గదిని అద్దెకు తీసుకున్నారు. మరో రెండు రోజుల్లో కంపెనీలో పనికి వెళ్లేందుకు అక్కడ పనులను కుదిర్చే కాంట్రాక్టర్‌తో మాట్లాడుకున్నారు. ఇంతలో ఈ ఐదు మందిలో ఏం జరిగిందో ఏమో కానీ శుక్రవారం ఓ యువకుడు ఒంటిపై కత్తిపోట్లుతో హత్యకు గురై మృతి చెంది ఉండటాన్ని ఇంటి యజమాని గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో సంఘటనా స్థలాన్ని ఏఎస్పీ సౌజన్య, ఇన్చార్జ్ డీఎస్పీ గిరిధర్, సిఐలు కిషోర్‌బాబు, శేఖర్‌బాబు, ఎస్ఐలు తిరుప తయ్యా, శేఖర్ బాబులు పరిశీలించి వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న వారికోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# అమరావతి నడిబొడ్డున అంతర్జాతీయ ఆతిథ్యం
# రాజధానిలో గ్లోబల్ వైబ్స్

- కోర్టుయార్డ్ బై మారియట్ హోటల్‌కు మంత్రులు కందుల దుర్గేష్, టిజి భరత్ భూమి పూజ
- 175 గదులు, అత్యున్నత వసతులతో 2028 నాటికి అందుబాటులోకి రానున్న హోటల్



**విజయవాడ, మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో పర్యాటక, పారిశ్రామిక రంగాలు సరికొత్త పుంతలు తొక్కుతున్నాయి. కృష్ణా తీరానికి సమీపంలో రాజధాని నడిబొడ్డున ప్రతిష్టాత్మక కోర్టుయార్డ్ బై మారియట్ హోటల్ ప్రాజెక్టుకు శుక్రవారం ఘనంగాభూమి పూజ నిర్వహించారు. సదరన్ గ్లోబ్ హోటల్స్ రిసార్ట్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో పర్యాటక మంత్రి కదుల దుర్గేష్, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కందు దుర్గేష్ మాట్లాడుతూ ప్రజా రాజధాని అమరావతిలో అంతర్జాతీయ బ్రాండ్ అయిన మారియట్ హోటల్ శంకుస్థాపన జరగడం శుభపరిణామం. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ ప్రకారం అమరావతిని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దుతున్న క్రమంలో ఇటువంటి భారీ ప్రాజెక్టులు పర్యాటక రంగానికి వెన్నెముకగా నిలుస్తాయి. మారియట్ గ్రూప్ ప్రమాణాలకు అనుగుణంగా 175 రూమ్స్, విశాలమైన స్విమ్మింగ్ పూల్, బ్యాంకెట్ హాల్, బిజినెస్ లాంజ్, మల్టీ కుజీన్ రెస్టారెంట్ తదితర సకల హంగులతో రాజధానికి వచ్చే అంతర్జాతీయ పర్యాటకులకు, వ్యాపార వేత్తలకు ఇది అత్యున్నత స్థాయి వసతిని కల్పిస్తుంది. అని పేర్కొన్నారు. తుళ్లూరు మండలం లింగాయ పాలంలోని ఏపీ సీఆర్డీయే కార్యాలయం ఎదురుగా నిర్మితమవు తున్న ఈ హోటల్ 2028 డిసెంబర్ నాటికి పూర్తిచేస్తామని హోటల్ ప్రతినిధులు వెల్లడించారు. అమరావతి లాంటి అభివృద్ధి చెందుతున్న ప్రాంతంలో తాము ఈ హోటల్ నిర్మిస్తుండటం సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. సదరన్ ట్రావెల్స్ గ్లోబ్ సివిల్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్, డెల్టా ప్యూర్ కంపెనీలు ఈ ప్రాజెక్టులో కీలక భాగస్వాములుగా వ్యవహరిస్తున్నాయి. రాజధాని ప్రాంతంలో అంతర్జాతీయ స్థాయి ఆతిథ్య రంగానికి ఈ ప్రాజెక్ట్ ఒక చిరునామాగా మారుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# అమరావతి అభివృద్ధిలో రైతులు భాగస్వాములు కావాలి

- సిఆర్‌డిఎ కమిషనర్ వి.విజయరామరాజు

**విజయవాడ, మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజారాజధాని అమరావతి నగర నిర్మాణాన్ని వేగవంతం చేసే చర్యల్లో భాగంగా లింగాయ పాలెం, ఉద్దండరాయునిపాలెం గ్రామాల్లో శుక్రవారం ఎపిసిఆర్‌డిఏ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల్లో ఎపిసిఆర్‌డిఏ కమిషనర్ వి.విజయరామరాజు పాల్గొని, భూసమీకరణ, గ్రామ కంఠం సమస్యల పరిష్కారం రైతులతో సుదర్ఘీంగా చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ గారు మాట్లాడుతూ రాజధానిలో చేపట్టిన రహదారులు ఎల్పీఎస్ జోన్ల అభివృద్ధి ప్రాజెక్టుల నిమిత్తం భూసేకరణ నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికి రైతులు ఇప్పటికీ భూసమీకరణ విధానంలో చేరే అవకాశం ఉందని స్పష్టం చేశారు. భూసేకరణ కంటే భూసమీకరణ ద్వారా రైతులకు మెరుగైన ప్రయోజనాలు చేకూరుతాయని కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# సచివాలయంపై డ్రోన్ అంటూ తప్పుడు ప్రచారం: ప్రభుత్వం సీరియస్

**విజయవాడ, మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా కలెక్టర్ల సదస్సు జరుగుతున్న సమయంలో సచివాలయంపై డ్రోన్ కలకలం అంటూ కొందరు సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేశారు. ఈ అంశాన్ని ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా తీసుకుంది. శాంతిభద్రతల దృష్ట్యా కీలకమైన సమయంలో ఇలాంటి పుకార్లు పుట్టించడం వెనుక కుట్ర కోణం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. సచివాలయంలో కలెక్టర్ల సదస్సు జరుగుతోంది. ఈ క్రమంలోనే ఆకాశంలో కనిపించిన ఓ విమానాన్ని.. డ్రోన్‌గా చిత్రీకరిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు కలకలం రేపాయి. కలెక్టర్ల సదస్సు జరుగుతున్న వేళ భద్రతా వైఫల్యం జరిగిందంటూ విమర్శలు చేసే ప్రయత్నం చేశారు. అయితే, పోలీసుల విచారణలో అసలు నిజం బయటపడింది. ఢిల్లీ నుంచి విజయవాడ వస్తున్న ఎఐ2903 విమానాన్ని చూపించి, అది డ్రోన్ అంటూ తప్పుడు ప్రచారం చేశారని పోలీసులు నిర్ధారించారు. సదరు విమానం నిర్ణీత షెడ్యూల్ ప్రకారమే ల్యాండింగ్ కోసం ఆ మార్గంలో ప్రయాణించిందని అధికారులు స్పష్టం చేశారు.

# వ్యవసాయ ఆక్వా వ్యర్థాలతో అద్భుత సంపద సృష్టి

- పశ్చిమ గోదావరి జిల్లా సర్క్యులర్ ఎకానమీ బ్లూప్రింట్‌ను ప్రశంసించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** కలెక్టర్ల సదస్సులో పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేసిన ప్రజెంటేషన్ సర్క్యులర్ ఎకానమీ బ్లూప్రింట్ అందరి దృష్టినీ విశేషంగా ఆకర్షించింది.

వ్యవసాయం, ఆక్వా రంగాల ద్వారా వచ్చే వ్యర్థాలను పర్యావరణానికి ముప్పుగా కాకుండా అత్యంత విలువైన బయో ఉత్పత్తులుగా సంపదగా ఎలా మార్చవచ్చో ఆమె తన ప్రజంటేషన్‌లో కళ్లకు కట్టినట్లు వివరించారు. పశ్చిమగోదావరి జిల్లా వ్యవసాయం పరంగా ఎంతో సంపన్నమైనదని, 2026 నాటికి తలసరి ఆదాయం రూ.3.5 లక్షలు దాటబోతోందని, కానీ పారిశ్రామిక రంగం మాత్రం కేవలం 16శాతం వాటాతో వెనుకబడి ఉందన్న వాస్తవాన్ని ఆమె సభ ముందు ఉంచారు. కేవలం వ్యవసాయంపైనే ఆధారపడకుండా, జిల్లాను పారిశ్రామికంగా కూడా అభివృద్ధి చేయడానికి ఈ వ్యర్థాల నుంచి సంపద సృష్టించే మోడల్ ఒక గొప్ప పరిష్కారమని కలెక్టర్ స్పష్టం చేశారు.



# ఆర్‌టిసి బస్సు డ్రైవర్‌పై ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆగ్రహం

**విజయవాడ, మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రయాణికులు స్టాప్‌లో ఉన్న ఆగకుండా వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయాణికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొస్తే సహించేది లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కృష్ణా జిల్లా కంకిపాడు సినిమా హాల్ సెంటర్‌లోని బస్టాప్‌లో పలువురు ప్రయాణికులు బస్సు కోసం వేచి చూస్తున్నారు. ఇంతలో అటుగా వచ్చిన ఓ ఆర్టీసీ బస్సు, ప్రయాణికులు ఉన్నప్పటికీ ఆగకుండా ముందుకు వెళ్లిపోయింది. అదే సమయంలో తన కారులో బస్సు వెనకే వస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఈ విషయాన్ని గమనించారు. వెంటనే ఆయన తన కారుతో బస్సును ఓవర్‌టేక్ చేసి అడ్డంగా ఆపారు. అనంతరం బస్సులోకి ఎక్కి డ్రైవర్, కండక్టర్‌ను నిలదీశారు. బస్టాప్‌లో ప్రయాణికులు ఎదురుచూస్తుంటే బస్సు ఎందుకు ఆపలేదని డ్రైవర్‌ను ఎమ్మెల్యే ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని, కానీ కొందరు ఆర్టీసీ సిబ్బంది తీరు వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని మండిపడ్డారు. "బస్సు ఖాళీగానే ఉంది కదా, ఎందుకు ఆపలేదు? ఒకవేళ సీట్లు లేకపోతే ప్రయాణికులు నిల్చుని వస్తారు. మీరు బస్సులు ఆపకపోతే ప్రజలు ప్రభుత్వాన్ని తిట్టుకుంటారు. ఈ ఒక్కచోటే కాదు, చాలా ప్రాంతాల్లో ఇలాంటి ఫిర్యాదులు వస్తున్నాయి" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైవర్, కండక్టర్ పొంతనలేని సమాధానాలు చెప్పి కవర్ చేసుకునేందుకు ప్రయత్నించగా తాను స్వయంగా చూశానని, బస్సు ఆపలేదనేది వాస్తవమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సిబ్బంది తీరు ఇలాగే ఉంటే ఫ్రీ బస్సు పథకం పెట్టినా ప్రయోజనం ఏముంటుందని ప్రశ్నించారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకూడదని గట్టిగా హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ గోసాల సెంటర్ వరకు అదే బస్సులో ప్రయాణించి, ప్రయాణికులతో మాట్లాడారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికులు ఉచిత బస్సు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# హైకోర్టును ఆశ్రయించిన వెంకట్రామిరెడ్డి

**విజయవాడ, మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు కె. వెంకట్రామిరెడ్డి తనను సర్వీసు నుంచి తొలగించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ నిర్ణయంపై న్యాయ పోరాటం చేస్తానని ప్రకటించిన నేపథ్యంలో వెంకట్రామిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు, ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన, పంచాయతీరాజ్ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులతో పాటు విచారణాధికారిగా వ్యవహరించిన కడప జిల్లా కలెక్టర్‌కు కూడా నోటీసులు పంపింది. తదుపరి విచారణను జూన్ నెలకు వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ డి. రమేశ్ తెలిపారు. తనను ఉద్యోగం నుంచి తొలగిస్తూ జారీ చేసిన జిఒను రద్దు చేయాలని వెంకట్రామిరెడ్డి తన పిటిషన్‌లో కోరారు.

# పెండింగ్ సమస్యల పరిష్కారానికి 'ఒకనెల ఒకగ్రామం'

**విజయవాడ, మే 8 ప్రభాతవార్త:** పెండింగ్ సమస్యల పరిష్కారానికి రాష్ట్రప్రభుత్వం కొత్తగా 'ఒకనెల-ఒకగ్రామం' పేరుతో కార్యక్రమం చేపట్టినట్లు అదనపు సిసిఎల్ఏ జె.వెంకటమురళి తెలిపారు. జి.కొండూరు మండలం కుంటముక్కల గ్రామంలో 'ఒకనెల-ఒకగ్రామం' నాలుగు పర్యటనలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మురళీ గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకుని అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా మురళి మాట్లాడుతూ 'ఒకనెల-ఒకగ్రామం' కార్యక్రమం ద్వారా నెలకు ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఆ గ్రామానికి అధికారుల బృందం వారానికి ఒకరోజు చొప్పున నాలుగు రోజులు పర్యటిస్తుందన్నారు. గ్రామంలోని ప్రజల సమస్యలను పూర్తిగా పరిష్కరించేందుకు ఈకార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. గ్రామస్తుల నుండి వచ్చిన అర్జీలను నెలలోపు పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా రెవెన్యూ పెండింగ్ సమస్యలను పరిష్కరించటానికి ఈకార్యక్రమం దోహదపడుతుందన్నారు.

# హైకోర్టు జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ పదవీ విరమణ వీడ్కోలు



**విజయవాడ, మే 8 ప్రభాతవార్త ప్రతినిధి:** హైకోర్టు న్యాయమూర్తి గన్నమనేని రామకృష్ణ ప్రసాద్‌కు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ ఆధ్వర్యంలో ఫుల్ బెంచ్ ఘన వీడ్కోలు పలికారు. హైకోర్టు న్యాయమూర్తి గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ పదవీ విరమణ చేయనున్న సందర్భాన్ని పురస్కరించుకుని వీడ్కోలు కార్యక్రమం హైకోర్టు మొదటి కోర్టు హాల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ మాట్లాడుతూ జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ నిబద్ధత కలిగిన జడ్జి అని కొనియాడారు. జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ ప్రకాశం జిల్లా కారంచేడులో జి.గాంధీ చౌదరి, విజయలక్ష్మి దంపతులకు మే 28, 1964లో జన్మించారని, ప్రాథమిక విద్యాభ్యాసంను కారంచేడులో ఆపై గుంటూరులోని లొయోలా పబ్లిక్ స్కూల్లో పూర్తి చేసి, గుంటూరులోని ఎసి కాలేజీలో ఎల్ఎల్బి పూర్తి చేసి 1991లో బార్ కౌన్సిల్‌లో సభ్యత్వం తీసుకున్నారని తెలిపారు. గుంటూరు న్యాయ కళాశాలలో న్యాయశాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తూ సుప్రింకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారని తెలిపారు. ఫిబ్రవరి 14, 2022న ఎపి హై కోర్టు న్యాయమూర్తిగా నియామకం అయ్యారన్నారు. అనంతరం అడిషనల్ సోలిసిటర్ జనరల్ చల్లా ధనుంజయ్, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, ఎపి హైకోర్టు బార్ అసోసియేషన్ ప్రసిడెంట్ ప్రభునాథ్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఎపి ఛైర్మన్ ద్వారకానాథ్ రెడ్డిలు జస్టిస్ జి.రామృష్ణ ప్రసాద్‌కు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలుపుతూ తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. తన విద్యార్థి దశ నుండి న్యాయవాదిగా, న్యాయమూర్తిగా ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి ప్రతి దశలోనూ ఉత్తమ సలహాలు అందించిన పెద్దలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, అడిషనల్ అడ్వకేట్ జనరల్, పబ్లిక్ ప్రాసిక్యూటర్, పలువురు న్యాయవాదులు జస్టిస్ జి. రామకృష్ణ ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

# మే 12న హనుమజ్జయంతి వేడుకలు

**ఇంద్రకీలాద్రి, మే 8 ప్రభాతవార్త:** ఇంద్రకీలాద్రిపై ఈనెల 12న ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. "హనుమజ్జయంతి" పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వైదిక కమిటీ వారి సూచనల మేరకు హనుమజ్జయంతి వేడుకలలో భాగంగా మంగళవారం ఉదయం 6 గంటల నుండి పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఘాట్ రోడ్డులో వేంచేసియున్న శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి ఆలయం, అమ్మవారి ప్రధాన ఆలయ ప్రాంగణంలోని క్షేత్రపాలక శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం, మరియు మెట్ల మార్గంలోని శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయాలలో ప్రత్యేక పూజలు జరుగుతా యన్నారు. ఈ మూడు ఆలయాల్లో స్వామివారికి 'అభిషేకములు', తమలపాకులతో "నాగవల్లీ దళార్చన" (ఆకుపూజ) శాస్త్రోక్తంగా నిర్వహిస్తారన్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా మూడు ఆంజనేయ స్వామి ఆలయాలను రంగురంగుల పుష్పాలతో ప్రత్యేక పూల దండలతో శోభాయమానంగా అలంకరిస్తారన్నారు. భక్తులందరూ ఈ విశేష పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఈవో కోరారు.

**ఇంద్రకీలాద్రిపై భక్తులకు మెరుగైన మౌలిక వసతులు:** ఇంద్రకీలాద్రిపై ప్రశాంతంగా అమ్మవారి దర్శనాల ఏర్పాట్లను ఈవో శీనా నాయక్ పర్యవేక్షి ంచారు. వేసవి సెలవులు, శుక్రవారం అయినప్పటికీ, ఈరోజు భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. ఇఓ క్షేత్రస్థాయిలో పర్యటించి ఆలయ ప్రాంగణంలోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన పాలకొండ తులసి రాంబాబు రమాదేవి దంపతులు శుక్రవారం రూ.1,01,116ల విరాళం అందజేశారు. దాతలకు అమ్మవారి దర్శనం కల్పించి, అనంతరం వేదపండితులతో ఆశీర్వచనం చేయించారు. వారికి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటాన్ని బహూకరించారు.



పలు విభాగాలు పరిశీలిస్తున్న ఇఓ శీనా నాయక్

# తాలీం-ఏ-హునూర్‌కు 3వేల దరఖాస్తులు

**విజయవాడ, మే 8 ప్రభాతవార్త:** దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ వక్ఫ్‌బోర్డు చేపట్టిన తాలీం-ఏ-హునూర్ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా విశేషస్పందన లభిస్తున్నదని, కార్యక్రమం ప్రకటించిన మూడురోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా 3వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. ఈకార్యక్రమంలో భాగంగా ముస్లిం విద్యార్థినీ విద్యార్థులకు కార్పోరేట్ కళాశాలలో ఉచితంగా ఇంటర్‌మీడియట్ విద్యను అందించటంతో పాటు, నీట్, ఐఐటి, జెఇఇ వంటి పోటీపరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తారు. ప్రతిభ కలిగిన విద్యార్థుల చదువుకు పేదరికం అడ్డుకాకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనతో ఈకార్యక్రమాన్ని కొత్తగా ఈఏడాది చేపట్టినట్లు చెప్పారు. 2026-27 విద్యాసంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా ధరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పరీక్ష నిర్వహించి వారిలో మెరిట్ విద్యార్థులకు అవకాశం కల్పిస్తామన్నారు. మొత్తం 250 మంది విద్యార్థులను ఎంపిక చేస్తామని, ఇందులో బాలికలకు 30శాతం రిజర్వేషన్ ఇస్తున్నట్లు వివరించారు. ఆసక్తికల విద్యార్థులు ఈనెల 12వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అజీజ్ సూచించారు.

MN 11 Final:MN 11 Final 01/01/2001 14:47 Page 1



# గుంటూరులో స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్-2026లో పాల్గొన్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు, మే 8,ప్రభాతవార్త :** చదరంగం అనేది కేవలం ఒక గేమ్ మాత్రమే కాదని, అది ఏకాగ్రత, సహనం, అంకితభావం, మానసిక ప్రశాంతతను పెంచే ప్రత్యేకమైన మానసిక క్రీడ అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. శుక్రవారం గుంటూరు




జేకేసీ కాలేజీ రోడ్డులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ 2026 కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ చెస్ ఇతర ఆటలతో పోలిస్తే దానికి ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. "ధ్యానం చేసినంత ప్రశాంత చెస్ ఆడితే వస్తుంది" అని, ఒక ఆటగాడు ప్రతి మూవ్‌ను ఆలోచిస్తూ, ఎలాంటి దృష్టి మరల కుండా గంటల తరబడి దృష్టిని ఒకే చోట నిలబెట్టడం సాధారణ విషయం కాదన్నారు. పిల్లల్లో ఏకాగ్రత, క్రమశిక్షణ, ప్రశాంతత పెంపొందించేందుకు తల్లిదండ్రులు చెస్‌ను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ పిల్లలను చదరంగం వైపు మళ్లించడం, మంచి శిక్షకుల వద్ద శిక్షణ ఇప్పించడం, టోర్నమెంట్లలో పాల్గొనేలా ప్రోత్సహించడం చాలా గొప్ప విషయమన్నారు. "నేర్చుకోవడం మాత్రమే కాదు.. మన స్థాయి ఏమిటో తెలుసుకుని ఇంకా ఎలా మెరుగుపడాలో అర్థం చేసుకోవడానికి టోర్నమెంట్లు ఉపయోగపడతాయి" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి కనీసం ఇద్దరు గ్రాండ్ మాస్టర్లు దేశానికి అందాలని ఆకాంక్షించారు. టోర్నమెంట్‌లో పెద్ద సంఖ్యలో అమ్మాయిలు పాల్గొనడం ఆనందంగా ఉందని, మహిళలు కూడా చెస్‌లో ముందంజలో ఉండటం గర్వకారణమన్నారు. అదే విధంగా వివిధ వయసుల వారు పాల్గొనడం ఈ గేమ్‌కు వయస్సుకు సంబంధం లేదని నిరూపిస్తోందన్నారు. పెద్దవారు పాల్గొనడం చిన్నారులకు స్ఫూర్తిగా నిలుస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా భారత చెస్ గర్వకారణం కోనేరు హంపీ తండ్రి కార్యక్రమానికి హాజరై పిల్లలతో మమేకమవడం గొప్ప ఇన్స్పిరేషన్ అని ఎమ్మెల్యే కొనియాడారు. "ఇక్కడి నుంచి మరెంత మంది కోనేరు హంపీలు తయారవుతారో చూడాలి" అని ఆశాభావం వ్యక్తం చేశారు. డ్రగ్స్ నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈగల్ టీం సేవలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. యువతను మాదక ద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో ఈగల్ టీం సమర్థంగా పనిచేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ టీం కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు.

# జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో జిసికేవిఎన్ డిగ్రీ కళాశాల విద్యార్థిని విజయకేతనము

**గుంటూరు విద్య మే 8 ప్రభాతవార్త :** గుంటూరు స్థానిక సంగడిగుంట లోని గుంటూరు చలమయ్య కర్పూరపు వెంకటనారాయణ డిగ్రీ కళాశాల బీకాం., ( ఫైనల్ ఇయర్) విద్యార్థిని తుపాకుల. నాగజ్యోతి ఖిఖిఇండియన్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ఖిఖి వారి ఆధ్వర్యంలో ఏప్రిల్ 26 నుండి రాజస్థాన్ లోని ఉదయపూర్ నందు జరిగిన జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచి,



జాతీయస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన సందర్భంగా కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమములో విద్యార్థిని నాగజ్యోతిని ఘనంగా సన్మానించారు. తుపాకుల నాగజ్యోతి తృతీయ సంవత్సర బీ.కాం., ( కంప్యూటర్స్ ) 76 . కేజీల విభాగము లో గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమానికి కళాశాల కార్యదర్శి కర్పూరపు సూర్యనారాయణ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థిని ఘనముగా సన్మానించారు. కార్యదర్శి కర్పూరపు సూర్యనారాయణ మాట్లాడుతూ, క్రీడల వలన చురుకైన మేధాశక్తి కలిగి ఉంటారని, తద్వారా చదువులలో మంచి ఉత్తీర్ణత సాధించడానికి దోహదపడుతుందని అన్నారు. అయితే నేటితరం విద్యార్థులు సెల్ ఫోన్లపై మక్కువ కలిగి, విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారని, తద్వారా ఊబకాయాన్ని కోరి తెచ్చుకుంటున్నారని అన్నారు. శారీరక శ్రమ ఇటువంటి క్రీడల లోనే దొరుకుతుందని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ మహంకాళి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థిని నాగజ్యోతి రాష్ట్రస్థాయి మరియు జాతీయస్థాయిలలో అనేక పతకాలు సాధించడం మా కళాశాలకు గర్వకారణమని, జ్యోతిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిదాయకంగా పెట్టుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థిని నాగజ్యోతిని శాలువా కప్పి, బొకే అందించి, మెమెంటోతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కోచ్ కమ్రుద్దీన్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్. కో ఆర్డినేటర్స్ శ్రీధర్ మరియు చంద్రశేఖర్లు, అధ్యాపకులు హరిలాల్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సుభద్ర, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నిడమర్రు ఆర్వోబీ శంఖుస్థాపన కార్యక్రమంలో ఏ లోపాలు లేకుండా అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలి

**గుంటూరు కార్పొరేషన్, మే 8, ( ప్రభాతవార్త ) :** నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జి శంఖుస్థాపన కార్యక్రమానికి ఏ లోపాలు తలెత్తకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని గుంటూరు నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆయా విభాగాల అధికారులకు స్పష్టం చేశారు. ఈ నెల 13న నిడమర్రు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న, కేంద్ర గ్రామీణాభివృద్ధి,సమాచార శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ లు శంఖుస్థాపన చేయనున్న నేపథ్యంలో శంఖుస్థాపన శిలాఫలకం, వేదిక ప్రాంతాన్ని రైల్వే, ఎంటిఎంసి, పోలీస్, రెవెన్యూ అధికారులతో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శిలాఫలకం, సభావేదిక ఏర్పాట్లను రైల్వే అధికారులు భాధ్యత తీసుకొని నిర్దేశిత ప్రోటోకాల్ మార్గదర్శకాల మేరకు సిద్దం చేయాలన్నారు. కేంద్ర మంత్రి పర్యటన మార్గం, సభావేదిక ప్రాంతాల్లో



ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంటిఎంసి డిప్యూటీ కమిషనర్ ని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రణాళికాబద్దంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పార్కింగ్ ఏర్పాటు చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను, సభకు హాజరయ్యే వారికి మొబైల్ టాయ్ లెట్స్ ఏర్పాటు చేయాలని, ట్రాక్ కి ఇరువైపులా ప్యాచ్ వర్క్ లు, పిచ్చి చెట్ల తొలగింపు చేపట్టాలని ఎంటిఎంసి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమ నిర్వహణకు విధులు కేటాయించబడిన ప్రతి అధికారి తమ సిబ్బందితో కార్యక్రమం పూర్తి అయ్యే వరకు భాధ్యతగా ఉండాలనిఆదేశించారు. ఏ విధమైన లోపాలు తలెత్తడానికి వీలు లేదని స్పష్టం చేశారు. ఆయా విభాగాల అధికారులు ముందుగానే కార్యకమ ప్రదేశానికి వెళ్లి పరిశీలించుకోవాలన్నారు. పర్యటనలో ఎంటిఎంసి డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, డిసిపి అశోక్ కుమార్, రైల్వే అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసాదరావు, డిఎస్పీ మురళీకృష్ణ, రూరల్ సిఐ వెంకట బ్రహ్మం, తహశీల్దారు రాఘవేంద్ర, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# తాగునీరు,మురుగు కాలువల సమస్యలు లేకుండా చూడండి : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు, మే 8,ప్రభాతవార్త :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గములో ఉన్న చిన్న, సన్నగల్లీలో కూడా తాగునీరు, మురుగు కాలువల సమస్యలు లేకుండా చూడాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి, అధికారులకు సూచించారు.



శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజల నుండి అర్జీలు స్వీకరించి, సమస్యలను విని వెంటనే స్పందించారు. పింఛన్లు, రేషన్ కార్డులు, తాగునీరు, మురుగు కాలువలు, రోడ్ల నిర్మాణం వంటి పలు సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. భారత్‌పేటకు చెందిన పొందూరు అనురాధ తనకు ఒంటరి మహిళ పింఛన్ మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరగా, సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అలాగే వడ్లమూడి వెంకట నారాయణ తనకు తెల్ల రేషన్ కార్డు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయగా, అర్హత మేరకు సహాయం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

42వ డివిజన్‌కు చెందిన జే. వెంకటేశ్వరావు వికలాంగుల పింఛన్ మంజూరు చేయాలని కోరగా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీ ఇచ్చారు. ఇదే సందర్భంగా గుజ్జనగుండ్ల మసీదు ఆర్చి రోడ్డు ప్రాంత ప్రజలు తమ కాలనీలో మంచి నీటి పైప్‌లైన్, మురుగు కాలువ మరియు సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరియు గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి చేపడుతున్న ప్రజా సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు యువకులు ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బెజ్జం అనిల్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

# స్త్రీ శక్తి..మహిళల ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పెంచింది : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మే 8, ప్రభాతవార్త: స్త్రీ శక్తి పథకంతో మహిళల ఆర్థిక స్వాతంత్రం పెరిగిందని, వారి సాధికారతలో ఎప్పుడూ కూటమి ప్రభుత్వానిదే పైచేయి అని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శుక్రవారం ఆయన



చిలకలూరిపేట ఆర్టీసీ డిపోను సందర్శించి, ప్రముఖ శైవ క్షేత్రం శ్రీశైలానికి ఏర్పాటు చేసిన నూతన బస్ సర్వీస్ ను లాంఛనంగా ప్రారంభించారు. చిలకలూరిపేట కాకతీయ సేవాసమితి విభాగం గారు గతంలో తనను కలిసి శ్రీశైలానికి స్థానిక డిపోనుంచి బస్ సర్వీస్ ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారని, వారి కోరిక మేరకు డిపో మేనేజర్ తో మాట్లాడటం జరిగిందని ప్రత్తిపాటి చెప్పారు. చిలకలూరిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ త్వరితగతిన స్పందించి శ్రీశైలానికి కొత్త సర్వీస్ ఏర్పాటుచేశారన్నారు. ఈ సర్వీస్ కు స్త్రీ శక్తి పథకం వర్తిస్తుందని, మహిళలు ఉచితంగానే శ్రీశైలం వెళ్లి, భ్రమరాంభ సమేత శ్రీ మల్లిఖార్జున స్వామిని దర్శించుకోవచ్చని ఎమ్మెల్యే సూచించారు. చలివేంద్రం ప్రారంభం... ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు స్థానిక ఆర్టీసీ బస్ స్టాండ్ లో డాక్టర్ కొమ్మినేని వీర శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రత్తిపాటి ప్రారంభించారు. ప్రజా రవాణా వ్యవస్థ విభాగం సిబ్బంది, దాతల సహకారంతో చలివేంద్రం ఏర్పాటు చేయడంపై ప్రత్తిపాటి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొమ్మినేని శంకర్ రావుని, డిపో సిబ్బందిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, జిల్లా ఉపాధ్యక్షులు బత్తినేని శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు ముద్దన నాగేశ్వరరావు, కొత్త కోటేశ్వరరావు, బేరింగ్ మోలాలి, డాక్టర్ కొమ్మినేని వీర శంకరరావు, కాకతీయ సేవ సమితి కార్యదర్శి బ్రహ్మానందం, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి, డి.పి.టి.ఓ అజిత్ కుమారి, ఆర్టీసీ డీఎం వేణు, ధనలక్ష్మి చైర్మన్ పేర్ని వీరనారాయణ, చెరుకూరి కాంతయ్య, కంచర్ల శ్రీనివాసరావు, టి.యన్.టి.యు.సి నాయకులు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ లు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ ఇంజిన్ సర్కార్‌లో డబుల్ డెవలప్ మెంట్ : ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, మే 8, ప్రభాతవార్త:** కూటమి సమగ్రతను కాపాడుతూనే డబుల్ ఇంజిన్ సర్కార్ ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. శుక్రవారం ఆయన నరసరావుపేట లోక్ సభ సభ్యులు లావు శ్రీ కృష్ణ దేవరాయలుతో కలిసి పట్టణంలో రూ.43 లక్షల



విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తొలుత పట్టణంలోని 6వ వార్డులోని బింగి రామ్మూర్తి పార్క్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి, ఎంపీ లావు అనంతరం 7వ వార్డులో రూ.23 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు, శంకుస్థాపన చేశారు. అనంతరం ఇరువరు నాయకులు ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

డబుల్ ఇంజిన్ సర్కార్ తో ప్రజలకు కష్టాల నుంచి ఉపశమనం : ప్రత్తిపాటి కూటమి పార్టీల పరస్పర సహకారం, సమన్వయం ప్రజలకు, రాష్ట్రానికి ఎంతో మేలు చేస్తోందని, ఎన్డీయే ప్రభుత్వం సుదీర్ఘకాలం అధికారంలో ఉంటే, భావితరాలకు ఎనలేని ప్రయోజనాలు కలుగుతాయని ప్రత్తిపాటి పేర్కొన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ లో జరుగుతున్న డబుల్ స్పీడ్ డెవలప్ మెంట్, సమగ్ర పాలన వల్లే గత పాలకుల అసమర్థ పాలన.. కష్టాల నుంచి ప్రజలకు ఉపశమనం లభించిందన్నారు.

# ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత

**నరసరావుపేట టౌన్, మే 8 ప్రభాతవార్త :** స్థానిక కోటబజారు పులుపులవారి వీధిలో వేంచేసియున్న శ్రీ వీరాంజనేయ సహిత శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ



స్వామి వారి దేవాలయ రాతి నిర్మాణానికి భక్తులు విరాళం అందజేశారు. నరసరావుపేట వాస్తవ్యులు, లక్ష్మీ ౖ బాలాజీ క్యాటరింగ్ అధినేత గట్టా వెంకటశ్రీనివాసరావు ధర్మపత్ని రత్నకుమారి దంపతులు రూ.1,01,116/ లు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులు వనమా సాంబశివరావు, వనమా కృష్ణ,కోవూరు శివ శ్రీనుబాబు, గజవల్లి మురళి లకు శుక్రవారం అందజేశారు. విరాళం అందజేసిన దాతలకు కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే వారికి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందించారు.

# ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు :ఎస్సై అరుణ రెడ్డి

**నరసరావుపేట క్రైమ్, మే8, ప్రభాతవార్త :** పట్టణంలోని ప్రధాన కుడళ్ళ వద్ద పోలీసులు,ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. వివరాలను ఎస్ఐ అరుణ రెడ్డి తెలియజేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తనిఖీల్లో భాగంగా హెల్మెట్ లేని ప్రయాణికులను, సరైన పత్రాలు లేని వాహనదారులపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా వారికి నిబంధనలపై కౌన్సిలింగ్ జరిగిందని తెలియజేశారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడంతోపాటు జరివ ˜నాలను విధించామని పేర్కొన్నారు. ప్రతి వాహనానికి తప్పనిసరిగా ఆర్ సి, హెల్మెట్, మరియు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని ఎస్సై అరుణ రెడ్డి సూచించారు.

# తొమ్మిది మంది వ్యక్తులు అరెస్టు

**గుంటూరు క్రైమ్,మే8,ప్రభాతవార్త:** గుట్టు చప్పుడు కాకుండా ఓ ఆఫీసులో పేకాట ఆడుతున్నారని సమాచారంతో పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు మెరుపు దాడులు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం బుధవారం రాత్రి అరండల్ పేట పోలీస్ స్టేషన్ పరిధి నందు కొరటిపాడు సెంటర్, దుర్గా జనరల్ స్టోర్ పైన గోపి కృష్ణ మ్యారేజ్ బ్యూరో ఆఫీస్ నందు పేకాట జరుగుతున్నదని టాస్క్ ఫోర్స్, సిబ్బందికి రాబడిన సమాచారం మేరకు ఎస్పి డిఎస్పీకి తెలియపరిచి టాస్కోర్స్ సీఐ ఆదేశాల మేరకు టాస్కోర్స్ సిబ్బంది రైడ్ చేయగా ఆర్గనైజర్ ఏ.సుబ్బారావు,9 మంది వ్యక్తులు,9సెల్ ఫోన్లు,రూ.26,300 / రూపాయలు ను సీజ్ చేసి తదుపరి విచారణ కొరకు అరండాలపేట పోలీస్ స్టేషన్ కి తరలించారు.

# పొన్నపల్లిలో వైభవంగా శివ కళ్యాణం

చెరుకుపల్లి, మే 8, ప్రభాతవార్త : మండలంలోని పొన్నపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సత్య ప్రసూనాంబ సమేత సోమేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం స్వామి వారి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను విశేషంగా అలంకరించి స్వామివారి యొక్క కళ్యాణ మహోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు కారంచేటి శివరామ శర్మ ఆధ్వర్యంలో కన్నుల పండుగగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు గ్రామం, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వీక్షి ంచారు. ఈ సందర్భంగా చావలి శ్రీధర్ శర్మ కళ్యాణ మహోత్సవం యొక్క ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో మల్లెల కృష్ణమూర్తి, పొన్నపల్లి శివరామకృష్ణ, అన్నదానం సత్యనారాయణ ,చావలి శివ, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు,

# అవగాహనతోనే టీబీ నియంత్రణ సాధ్యం

**వట్టిచెరుకూరు, మే 8, ప్రభాతవార్త :** అవగాహనతోనే టీబీ నియంత్రణ సాధ్యమని ప్రత్తిపాడు శాసనసభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు పేర్కొన్నారు. ప్రతిపాడు టీబీ యూనిట్ పరిధిలో టీబీఎంబీ 2.0 కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో టీబీపై




అవగాహన శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామాంజనేయులు పాల్గొని మాట్లాడుతూ..భారతదేశంలో 2026 నాటికి క్షయవ్యాధిని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష ్యంతో, ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ 2.0 కార్యక్రమం విస్తృతంగా కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమం కేవలం వైద్య చికిత్స మాత్రమే కాకుండా, సామాజిక భాగస్వామ్యంతో రోగులకు మద్దతు ఇచ్చేలా రూపొందించబడిందని వివరించారు. క్షయ వ్యాధి 2 వారాల కంటే ఎక్కువ దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, రాత్రి చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉన్నవారు ముందుగా గుర్తించి చికిత్స ప్రారంభించాలని తెలిపారు. నిక్షయ్ పోర్టల్ ద్వారా టీబీ రోగులకు ఉచిత పరీక్షలు, మందులు మరియు చికిత్స అందించడం జరుగుతుందన్నారు. సమాజంలోని వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు నిక్షయ్ మిత్రులుగా మారి, టీబీ రోగులను దత్తత తీసుకుని, వారికి అవసరమైన పౌష్టికాహారాన్ని మరియు వైద్య మద్దతును అందించాలని కోరారు. చికిత్స తీసుకుంటున్న రోగులకు పౌష్టికాహారం కోసం ప్రభుత్వం ప్రతినెల రూ.500 నుండి రూ. 1000ల వరకు నగదు సహాయం నేరుగా బ్యాంక్ ఖాతాలో జమ చేస్తుందని పేర్కొన్నారు. టీబీపై ఉన్న కళంకాన్ని తొలగించడానికి మరియు వ్యాధి నివారణ చర్యలపై గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు తప్పనిసరిగా ముక్కు, నోటికి రుమాలు అడ్డుపెట్టుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రోగనిరోధక శక్తిని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా 2026 నాటికి భారతదేశాన్ని టీబీ రహిత దేశంగా మార్చడమే కాకుండా, రోగుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం దీని ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శివాని డాక్టర్ వెంకటేశ్వరరావు ఎంపిహెచ్ఎస్ వెంకటేశ్వర్ రావు, ఏఎన్ఎం లలిత, ఆశా వర్కర్లు, ఎస్టిఎస్ కొలికపూడి రాంబాబు, ప్రతిపాడు టీవీ యూనిట్ సభ్యులు, టిడిపి పార్టీ నేతలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# శస్త్రచికిత్స చేయించుకున్న చిన రాములును పరామర్శించిన ఎమ్మెల్యే

**వట్టిచెరుకూరు, మే 8, ప్రభాతవార్త :** ఎల్లప్పుడూ ప్రజా సేవలో ముందుండే టిడిపి నేత, పుల్లడిగుంట గ్రామ మాజీ ఉపసర్పంచ్, ఉప్పుటూరి సేవా ట్రస్ట్ అధినేత ఉప్పుటూరి చిన రాములు ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు స్వయంగా పార్టీ నేతలతో కలిసి వారి నివాసానికి వెళ్లి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా చిన రాములు ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకోని, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆరోగ్యపరంగా త్వరగా



కోలుకుని ప్రజాసేవలోకి రావాలని మనస్ఫూర్తిగా కోరుతున్నట్లు చెప్పారు. పుల్లడిగుంట గ్రామంలో తన సొంత నిధులతో అన్నా క్యాంటీన్ ఏర్పాటుచేసి ప్రతిరోజు ఎంతోమంది అభాగ్యులకు, కూలీలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించడం చాలా ఆనందించదగ్గ విషయం అన్నారు. అలాంటి వ్యక్తిని మండలంలోని నేతలు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు. మీరుచేసే ప్రజాసేవా కార్యక్రమాలే దేవుని ఆశీర్వాదములని ఉద్ఘాటించారు. చిన రాములుకు భగవంతుడు మంచి ఆయురారోగ్యాలు ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# బాలాలయం ప్రతిష్ట మహోత్సవం

**గుంటూరు విద్య, మే 8, ప్రభాతవార్త :** గుంటూరు పట్టణం లాలాపేట లోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం పునర్నిర్మాణంలో దేవస్థానం జీర్ణోద్ధరణ బాలాలయం ప్రతిష్టా మహోత్సవంలో భాగముగా శుక్రవారం ఉదయం 7.00గం. లకువిశ్వేకేశన పూజ పుణ్యాహావాచనం కుంభారాధనలు పూర్ణాహుతి అభిషేకాలు, నిర్వహించి తదుపరి ఉదయం 10.41 ని.లకు మూలవిరాటులు అయిన శ్రీ పద్మావతి ఆండాళ్ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని నూతన బాలాలయంలో ప్రతిష్టించడమైనది. తదుపరి బాలాలయంలో శ్రీ స్వామివారికి విశేష పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం ఇవ్వడమైనది. ఈ కార్యక్రమంలో గుంటూరు తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు గౌరవనీయులు మహమ్మద్ నజీర్ అహ్మద్ విచ్చేసి నూతన బాలాలయంలోని స్వామి వారిని దర్శించి పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొనియున్నారుతదుపరి దేవస్థానం ఆవరణలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి శ్రీ స్వామివారి దేవస్థానం పునర్నిర్మాణమునకు సింహభాగం రూ.57,00,000/ విరాళముగా అందజేసిన పద్మావతి సూపర్ స్పెషాలిటీ



హాస్పిటల్ వీరగంధం సువర్ణ పద్మావతి జ్ఞాపకార్థం వారి భర్త డాక్టర్ వీర గంధం వెంకట సుబ్బారావు ని మరియు పునర్నిర్మాణమునకు విరాళముల రూపంలో సహకరించిన దాతలను గౌరవనీయులు శ్రీ మహమ్మద్ నజీర్ అహ్మద్ శాసనసభ్యులు వారు అభినందించియున్నారుకమిషనర్ దేవాదాయ శాఖ ఆంధ్రప్రదేశ్ వారి నుండి టెండరుదారుడు యొక్క ఆమోదపు ఉత్తర్వులు వచ్చిన తదుపరిదేవస్థానం శంకుస్థాపన పనులు జూన్ 2026 నెల నందు ప్రారంభించి నూతన దేవస్థానమును 2 సంవత్సరములలో పూర్తి చేయగలమని దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కార్యనిర్వాహణాధికారి టి. సుభద్ర తెలియచేసియున్నారుఈ కార్యక్రమంలోదేవస్థానం చైర్మన్ మల్లెంపూడి శ్రీనివాసరావు, బాలాలయం నిర్మాణం దాత తిరువల్లూరి వెంకట సుబ్బారావు, పద్మావతి సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ డాక్టర్ వీరగంధం వెంకట సుబ్బారావుదేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు అరుణ, జగదీష్ కుమార్, గిరిబాబు, లలిత, కిరణ్ కుమార్, దుర్గ, అరుణ కుమారి, శివయ్య, గిరి వెంకట ప్రసాద్ రావు, పద్మావతి, ముఖ్య అర్చకులు, ఆర్ టి ఆర్ వి. ప్రసాద్, అర్చకులు మురళి చంద్రకుమార్ శ్రీనివాసాచార్యులు దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు

# ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు ఉచిత కార్పొరేట్ ఇంటర్ విద్య పథకాన్ని పునః ప్రారంభించాలి

**గుంటూరు విద్య,మే 8, ప్రభాతవార్త :** పదవ తరగతి ఫలితాలలో ఎస్సీ ఎస్సీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను చాలా పాఠశాలల్లో ఈ ఏడాది ఫలితాలలో కనబరిచారని ,ఈ విద్యార్థులకు ఇంటర్మీడియట్ ఉచిత కార్పొరేట్ విద్యను కల్పించాలని ,గతంలో ఉన్న పథకాన్ని పునః ప్రారంభించాలని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కి విజ్ఞప్తి చేశారు. అత్యుత్తమ విద్యా ప్రమాణాలు కలిగిన కార్పొరేట్ జూనియర్ కళాశాలలో ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు అత్యుత్తమ ఇంటర్ విద్యను అందించడానికి కార్పొరేట్ ఇంటర్మీడియట్ ఉచిత పథకం గతంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు తెలుగుదేశం ప్రభుత్వం లో ఉందని, జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఈ పథకాన్ని రద్దు చేశారని ,ఈ పథకానికి తెలుగుదేశం ప్రభుత్వం పునాదివేసిందనీ, పేద ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు అత్యుత్తమ ఇంటర్ స్థాయి విద్యను తెలుగుదేశం ప్రభుత్వం అప్పట్లో అందించిందని, ఈ పథకాన్ని తిరిగి ప్రారంభించాలని ఏసుబాబు మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే ఈ తరహా పథకాన్ని ముస్లిం బాల బాలికలకు రాష్ట్ర ప్రభుత్వం అమలకు రెండు రోజుల క్రితం నోటిఫికేషన్ విడుదల చేసిందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పరీక్షా ఫలితాలలో

ఎస్సీ ఎస్టీ పిల్లల్లో విద్యా ప్రమాణాలు పెరగడమే కాకుండా మంచి ప్రతిభను కూడా చూపుతున్న తరుణంలో ఇంటర్ కార్పొరేట్ విద్య ఆయా విద్యార్థులకు ఉచితంగా అందాల్సిన అవసరం ఉందన్నారు. ఇంటర్ విద్య తో పాటు నీట్, ఐఐటి జేఈఈ తదితర అనుబంధ ప్రవేశ పరీక్షలకు ఈ పథకం ద్వారా శిక్షణ లభిస్తుంది అన్నారు. దీనితో అత్యుత్తమ స్థాయిలో ప్రొఫెషనల్ కోర్సులను చదవటానికి కూడా ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు అవకాశం దొరుకుతుందననీ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొని ప్రతిభ ఉన్న పేద ఎస్సీ ఎస్టీ పదో తరగతి విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ఈ సందర్భంగా ఏసుబాబు మాదిగ విజ్ఞప్తి చేశారు .

# హనుమత్ జయంతోత్సవాలలో అఖండ దీపారాధన

**గుంటూరు విద్య మే 8 ప్రభాతవార్త :** గుంటూరు పట్టణం కొత్తపేటలోని శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో శ్రీ స్వామివారి హనుమత్ జయంతోత్సవములలోభాగముగా శుక్రవారంరాత్రి 7.15 ని.లకు అంకురార్పణ, పుణ్యాహావాచన, విశ్వ కేశన పూజ, అఖండ దీపారాధన నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కార్యనిర్వాహణాధికారి టి. సుభద్రదేవస్థానం చైర్మన్ మల్లెంపూడి శ్రీనివాసరావు, శ్రీ హనుమాన్ దీక్షా సమాజం గౌరవ అధ్యక్షులు తిరువల్లూరి వెంకట సుబ్బారావు దీక్ష సమాజం సభ్యులు, నాగేశ్వరరావు, సిహెచ్ రమేష్, మారుతి, వెంకట రమణ, మంశీ ప్రసాద్, బాపి రాజు, కిషోర్ ఆలయ ముఖ్య అర్చక స్వామి నరసింహచార్యులుధర్మకర్తల మండలి సభ్యులు గడదాసు అరుణ, బొల్లి శెట్టి జగదీష్ కుమార్, సందిరెడ్డి గిరిబాబు, యవ్వారం లలిత, తుళ్లూరు కిరణ్ కుమార్, బురుసు దుర్గ, బిట్రా అరుణ కుమారి, గంధం శివయ్య యర్రంశెట్టి గిరి వెంకట ప్రసాద్ రావు, దాసరి పద్మావతి. పాల్గొనియున్నారు



## ఐపిఎల్‌లో గేమ్ ఛేంజర్లు

# తెలుగు తేజాలు




*సన్‌రైజర్స్ హైదరాబాద్... పేరులోనే హైదరాబాద్ ఉన్నా పూర్తిగా ఓన్ చేసుకోలేని పరిస్థితి తెలుగు రాష్ట్రాలది. ఈ జట్టులో నితీష్ కుమార్ రెడ్డి ఒక్కడే తెలంగాణ వాడు. అలాగే పలువురు తెలుగు క్రికెటర్లు వివిధ జట్లకు ఆడుతూ సత్తా చాటుతున్నారు. వారిలో ముఖ్యులు హైదరాబాద్‌కు చెందిన తిలక్ వర్మ, మహ్మద్ సిరాజ్. ఇంకా కొందరు ప్లేయర్లు ఐపీఎల్‌లో ఉన్నా వారికి ఆ జట్ల తరుపున ఆడే ఛాన్స్ రావడం లేదు. వీరిలో కొందరు భారీ విలువ కలిగిన కాంట్రాక్టులను దక్కించుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఈ ఆటగాళ్లు తమదైన ముద్ర వేస్తున్నారు.ఈ ఐపీఎల్ సీజన్‌లో తెలుగు తేజాలు గేమ్ ఛేంజర్లుగా ఆవిర్భవిస్తున్నారు.*

(వార్త క్రీడా విభాగం)

ఐపీఎల్‌లో తెలుగు కుర్రాళ్లు సత్తా చాటుతున్నారు. ముఖ్యంగా నితీష్ కుమార్ రెడ్డి సూపర్ ఆల్‌రౌండర్‌గా మారాడు. నితీష్ (ఆంధ్ర)ను సన్‌రైజర్స్ హైదరాబాద్ 6 కోట్లకు అట్టిపెట్టుకుంది. దానికి తగినట్లే ఇటు బ్యాటింగ్‌లో, అటు బౌలింగ్‌లో కీలకంగా రాణిస్తూ జట్టుకు విజ యాలు అందిస్తున్నాడు. రెండు విభాగాలకు బలం తీసుకొస్తున్న నితీష్ ఆల్‌రౌండర్ పదానికి అసలైన అర్థం చెబుతున్నాడు. హేమాహేమీలు ఉన్న ఈ జట్టులో నితీష్ ఓ గేమ్ చేంజర్‌గా మారి జట్టును విజయ తీరాల వైపు నడిపిస్తున్నాడు. ఈ సీజన్‌లో నితీష్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు నిలకడైన ఆటతీరుతో ఆకట్టుకుంటున్నాడు. నితీష్ 10మ్యాచ్‌ల్లో 166.9 స్ట్రయిక్ రేట్‌తో 222 పరుగులు సాధించాడు. అందులో ఓ అర్ధసెంచరీ ఉంది. ఇక పవర్ ప్లేలో వికెట్లు అందిస్తున్నాడు. ఓ మ్యాచ్‌లో రెండు వికెట్లు సహా కీలక సమయాల్లో మొత్తం ఏడు వికెట్లు పడగొట్టాడు. ఓ మ్యాచ్‌కు నితీష్ దూరమైతే సన్‌రైజర్స్ బ్యాటింగ్ కుప్పకూలింది. ఇది ఒక్కటి చాటు ఆరేంజ్ ఆర్మీ టీమ్ మిడిల్ ఆర్డర్‌కు ఎంతటి మూలస్థంభంగా ఉన్నాడో చాటిచెప్పడానికి.

### సెంచరీ హీరో తిలక్

నిలకడైన మిడిల్‌ఆర్డర్ బ్యాట్స్‌మెన్ అయిన తిలక్‌వర్మ(తెలంగాణ)ను ముంబై ఇండియన్స్ 8 కోట్లకు అట్టిపెట్టుకుంది. టీట్వంటీ ప్రపంచకప్ అందించడంలో తనదైన రోల్ పోషించిన తిలక్ వర్మ ఈ సీజన్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోతున్నాడు. గుజరాత్ టైటాన్స్‌పై ఆహ్మదాబాద్‌లో సెంచరీతో మెరిసి ముంబైకు ఒంటిచేత్తో విజయాన్ని అందించాడు. 50లోపే సగం వికెట్లు కోల్పోయిన ఆ మ్యాచ్‌లో 45 బంతుల్లోనే 8 ఫోర్లు, ఏడు సిక్స్‌లతో అదరగొట్టాడు. మరో మ్యాచ్‌లో చెన్నైపై 37 రన్స్ చేశాడు. ఈ రెండు మ్యాచ్‌లు మినహాయిస్తే తిలక్ మిగతా మ్యాచ్‌ల్లో తన స్థాయికి తగ్గ ఆటతీరు ప్రదర్శించలేకపోయాడు. 2025 సీజన్‌లో343 రన్స్, 2024 సీజన్‌లో 416 రన్స్ సాధించాడు.



### హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ సిరాజ్

టీమిండియాలో ఓపెనింగ్ బౌలరైన మహ్మద్ సిరాజ్(హైదరాబాద్)ను 12.25 కోట్లకు గుజరాత్ టైటాన్స్ అట్టిపెట్టుకుంది. గుజరాత్ టీమ్ నమ్మకాన్ని నిలబెట్టేలా సిరాజ్ బౌలింగ్‌లో చెలరేగుతున్నాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో బ్యాట్స్‌మెన్ గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాడు. జెట్ స్పీడ్‌తో తీసుకువచ్చే సిరాజ్ ఇన్ స్వింగ్, అవుట్ స్వింగ్, యార్కర్లను ఆడడం బ్యాట్స్‌మెన్‌కు కష్టతరంగా మారుతోంది. ఆరంభంలోనే గుజరాత్‌కు వికెట్ పడగొడుతూ బ్రేక్ త్రూలు అందిస్తున్న సిరాజ్... ఇప్పటివరకు పది మ్యాచ్‌ల్లో 8 ఎకానమీతో 11 వికెట్లు పడగొట్టాడు. గత సీజన్‌లో గుజరాత్‌కే ఆడిన సిరాజ్ 16 వికెట్లు తీసుకుని ప్లే ఆఫ్‌కు చేర్చాడు. అంతకుముందు ఆర్సీబీకి ఆడాడు.

### ఛాన్స్ దక్కని తెలుగు ప్లేయర్లు

ఈ ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో పలువురు తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్లేయర్లు ఆయా జట్లలో ఉన్నా ఆడే ఛాన్స్ రావడం లేదు. అందులో సత్యనారాయణ రాజు(ఆంధ్ర) గత ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్‌కు 30 లక్షల బేస్ ప్రైస్‌కు వెళ్లాడు. ఓ రెండు మ్యాచ్‌ల్లో ఆడే అవకాశం వచ్చినా పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. రెండు మ్యాచ్‌ల్లో ఒకే ఒక వికెట్ తీసుకున్నాడు. ఈసారి అయితే తుది జట్టులో ఆడే అవకాశమే రాలేదు. షేక్ రషీద్(ఆంధ్ర) సీఎస్‌కే జట్టులో ఉన్నాడు. 2025 సీజన్‌లో అయిదు మ్యాచ్‌లు ఆడాడు. మొత్తం 71 పరుగులు చేశాడు. ఈసారి రషీద్‌కు ఆడే ఛాన్స్ రాలేదు. ఇక పైల అవినాష్ (ఆంధ్ర)ను పంజాబ్ కింగ్స్ ఎంపిక చేసుకుంది. త్రిపుర్ణ విజయ్(ఆంధ్ర)ఢిల్లీ క్యాపిటల్స్‌తో కాంట్రాక్టును దక్కించుకున్నాడు. ఎర్ర పృథ్వీరాజ్ (ఆంధ్ర)ను ఈ సీజన్ కోసం గుజరాత్ టైటాన్స్ 30 లక్షలకు కొనుగోలు చేసింది. పేరాల అమన్ రావు (తెలంగాణ)తో 2026 సీజన్ కోసం రాజస్థాన్ రాయల్స్ 30 లక్షలకు ఒప్పందం చేసుకుంది. వీరెవరికి ఆడే అవకాశం రాలేదు.



## అపోలో స్పోర్ట్స్ ఇంజురీస్ సెంటర్ ప్రారంభం

**హైదరాబాద్, మే 8(క్రీడా ప్రతినిధి):** క్రీడా గాయాల చికిత్స కోసం అత్యాధునిక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను అపోలో హాస్పిటల్స్ ప్రారంభించింది. ప్రొఫెషనల్ క్రీడాకారులు మాత్రమే కాకుండా ఫిటనెస్‌పై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ క్రీడా గాయాల చికిత్సను సమగ్రంగా అందించేందుకు ఈ అత్యాధునిక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఒకే చోట అడ్వాన్స్‌డ్ డయాగ్నస్టిక్, శస్త్రచికిత్స, రీహాబిలిటేషన్ సేవలను అందించే విధంగా ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు సభ్యులు కొత్తగా ప్రారంభించిన స్పోర్ట్స్ ఇంజూరీస్ సెంటర్‌ను సందర్శించారు. కెప్టెన్ పాట్ కమిన్స్‌తో పాటు ప్రజుల్ హింగే, సాకిబ్ హుస్సేన్‌కు ఈ కేంద్రంలోని అత్యాధునిక సదుపాయాలు, చికిత్సా విధానాలను వివరించారు. ఈ సందర్భంగా ఆటగాళ్లు మాట్లాడుతూ.. క్రీడాకారుల రికవరీ, పనితీరును మెరుగుపరచడంలో ఈ సదుపాయాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు.

## ఫైనల్లో భారత్ ఆర్చర్లు

**షాంఘై:** భారత ఆర్చరీ మహిళల టీమ్ సంచలనం సృష్టించింది.ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-2 టోర్నమెంట్‌లో ఫైనల్లోకి దూసుకెళ్లింది. దీపిక కుమారి, అంకిత, కుంకుమ్‌లతో కూడిన భారత్.. ఒలింపిక్స్ స్వర్ణ విజేత దక్షిణ కొరియాను సెమీస్‌లో బోల్తా కొట్టించింది. 58-55, 56-56, 58-56 స్కోరుతో ఓడించి ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఫైనల్లో చైనాతో భారత్ తలపడుతుంది. తొలి రౌండ్‌లో భారత్ 6-2(53-56, 57-54, 55-54, 55-51) స్కోరుతో ఉజ్బెకిస్తాన్ జట్టుపై, క్వార్టర్ ఫైనల్లో 5-4(53-54, 54-49, 58-56, 55-56, 28-25) స్కోరుతో వియత్నాం జట్టుపై విజయం సాధించింది. మరోవైపు పురుషుల రికర్వ్ టీమ్‌విభాగంలో ధీరజ్, తరుణ్‌దీప్ రాయ్, యశ్‌దీప్‌లతో కూడిన భారత జట్టు పేలవ ప్రదర్శన కనబరిచింది. తొలి రౌండ్‌లో బై పొందిన భారత జట్టు రెండో రౌండ్‌లో 2-6 స్కోరుతో బంగ్లాదేశ్ జట్టు చేతిలో ఓడింది.

## సెంచరీతో చెలరేగిన ఫిన్

# కోల్‌కతా నాలుగో విక్టరీ



**ఢిల్లీ:** ఆరంభంలో వరుస ఓటములు పొందినా... ఆ తర్వాత కోల్‌కతా నైట్ రైడర్స్ జైత్రయాత్ర కొనసాగిస్తోంది. మరుసగా నాలుగో విజయాన్ని అందుకుని ప్లే ఆఫ్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. ఢిల్లీ క్యాపిటల్స్ ఉంచిన 143 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని కేకేఆర్ 14.2 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి అందుకుంది. లక్ష్యచేధనలో రహానే(13), రఘువంశీ(1) రూపంలో తొందరగానే వికెట్లు కోల్పోయినా... కామెరూన్(27 బంతుల్లో 33) అండగా ఓపెనర్ అలెన్ ఫిన్ విరుచుకుపడ్డారు. ఢిల్లీ బౌలర్లపై చెలరేగుతూ కేవలం 47 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. అతని స్కోరులో 5 ఫోర్లు, పది సిక్స్‌లు ఉన్నాయి. అలాగే మూడో వికెట్‌కు 116పరుగులు జోడించి కోల్‌కతాకు విజయాన్ని అందించాడు. ఈ నాలుగో విక్టరీతో మొత్తం9పాయింట్లతో కోల్‌కతా తన స్థానాన్ని మెరుగుపర్చుకుంది.

టాస్ ఓడి బ్యాటింగ్ ఎంచుకున్న ఢిల్లీ ఇన్నింగ్స్‌కు ఓపెనర్లు రాహుల్(14 బంతుల్లో 23), నిస్సాంక(29 బంతుల్లో 50) అయిదు ఓవర్లలోనే 49 పరుగుల ఫ్లయింగ్ స్టార్ట్ ఇచ్చారు. ఈ దశలో రాహుల్‌ను కార్తీక్ త్యాగీ బోల్తా కొట్టించాడు. ఆతర్వాత నుంచి వికెట్ల వేగం పుంజుకుంది. మరో ఎండ్‌లో నితీష్ రాణా(8)ను గ్రీన్, సమీజర్ రిజ్వీ(3)ను నరైన్ అవుట్ చేశారు.టాప్ ఆర్డర్ కుప్పకూలటంతో ఢిల్లీ పీకల్లోతు కష్టాల్లో పడింది.11వ ఓవర్లో హాఫ్ సెంచరీ చేసిన నిస్సాంక, ట్రిస్టన్ స్టబ్(2) వెంటవెంటనే అనుకుల్ రాయ్ అవుట్ చేసి మరింత దెబ్బతీశాడు. నిస్సాంక ఔటయ్యాక ఢిల్లీ పూర్తిగా ఢీలా పడిపోయింది. 15 ఓవర్లకు ఢిల్లీ స్కోర్ 5 వికెట్ల నష్టానికి 98 రన్స్ చేయగలిగింది. స్లాగ్ ఓవర్లలో అశుతోష్ (28 బంతుల్లో 39) దాటిగా ఆడడంతో ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 142 రన్స్ సాధించగలిగింది. ఢిల్లీ బౌలర్లలో అనుకుల్ రాయ్, కార్తీక్ త్యాగి రెండేసి వికెట్లు తీసుకున్నారు. వైభవ్ అరోరా, సునీల్ నరైన్, క్యామెరాన్ గ్రీన్ ఒక్కో వికెట్ పడగొట్టారు. ఈ ఓటమితో ఢిల్లీ ప్లేఆఫ్ ఆశలు మరింత క్లిష్టంగా మారాయి. 11 మ్యాచ్‌ల్లో 8 పాయింట్లతో ఉంది. మరోవైపు కోల్‌కతా నైట్‌రైడర్స్ ప్లే ఆఫ్ రేసులోకి దూసుకొచ్చింది. ఇంకా నాలుగు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. కనీసం మూడు మ్యాచ్‌ల్లో నెగ్గినా ప్లే ఆఫ్ ఛాన్సెస్ ఉంటాయి.

# వారాంతంలో నష్టాల్లో సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబయి, మే 8:** దేశీయ మార్కెట్లు వారాంతంలో నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో ఇరాన్ అమెరికా మధ్య ఉద్రిక్తతలు మళ్లీ భగ్గుమనడంతో భారత మార్కెట్లపై ప్రతికూల ప్రభావం పడింది. దేశీయ సూచీలు నష్టాల్లో కదలాడాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. అలాగే నాలుగో త్రైమాసిక ఫలితాల ప్రకటనలకు ముందు ఇన్వెస్టర్లు అమ్మకాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఎస్‌బీఐ సహా కీలక బ్యాంకింగ్ షేర్లు భారీ నష్టాల్లో ముగిశాయి. ఇన్వెస్టర్లకు భారీ నష్టాలు ఇచ్చాయి. ఈరోజు ఉదయం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ సూచీ సెన్సెక్స్ 77,631 పాయింట్ల వద్ద ట్రేడింగ్ మొదలు పెట్టింది.

ఒక దశలో సూచీలు స్వల్ప లాభాల్లో కదలాడాయి. ఆ తర్వాత పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగడం వంటి వార్తలతో నష్టాల్లోకి జారుకున్నాయి. నాలుగో త్రైమాసిక ఫలితాల్లో కంపెనీలు అంచనాలను అందుకోలేవన్న సంకేతాలూ ఇన్వెస్టర్లను అప్రమత్తం చేయడంతో చివరకు సెన్సెక్స్ 516 పాయింట్ల మేర నష్టపోయింది. దీంతో సెన్సెక్స్ 77,328 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 150 పాయింట్లు నష్టపోయి 24,176 వద్ద ముగిసింది. ఇక డాలర్ తో రూపాయి మారకం విలువ కాస్త కోలుకుని 94.47 వద్ద ట్రేడ్ అయింది. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 50 ఇండెక్స్‌లో టైటాన్ కంపెనీ, అపోలో హాస్పిటల్, ఏషియన్ పెయింట్స్, టాటా న్యూమర్ ప్రోడక్ట్స్, అదానీ పోర్ట్స్ షేర్లు లాభపడ్డాయి. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగంలోని స్టాక్స్ నష్టాలతో ముగిసాయి. ముఖ్యంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లుభారీగా నష్టపోయింది. 6.66 శాతం మేర నష్టంతో రూ.1019 వద్ద ముగిసింది. ఆ తర్వాత కోల్ ఇండియా స్టాక్ 2.20 శాతం పడిపోయి రూ.456 వద్ద ముగిసింది. బ్యాంకింగ్ రంగంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.91 శాతం నష్టంతో రూ.780 వద్ద ముగియగా యాక్సిస్ బ్యాంక్ స్టాక్ 1.89 శాతం నష్టంతో రూ. 1268 వద్ద స్థిరపడింది. బజాజ్ ఫైనాన్స్ షేరు 1.79 శాతం పడిపోయి రూ.955 వద్ద స్థిరపడింది.

బిఎస్‌ఇ మిడ్‌క్యాప్ సూచీ 0.05శాతందిగజారింది. అదే స్మాల్‌క్యాప్‌సూచీ 0.15శాతం పెరిగింది. బిఎస్‌ఇలో 2608 కంపెనీలు పెరిగితే 2148 షేర్లు క్షీణించాయి. 206 షేర్లుమాత్రం స్థిరంగా కొనసాగాయి. ఎంసిఎక్స్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ రూ.1,52,757కిచేరింది. పదేళ్ల అమెరికా బాండ్లు 4.368శాతం ఏట్‌తో ఉన్నాయి. కమొడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురుజులై సెటిల్‌మెంట్ల ధరలు 0.57 సెంట్లుపెరిగి బ్యారెల్‌కు 100.63 డాలర్లుగా కొనసాగింది.

## రూ.800 కోట్లకు తగ్గిన స్విగ్గీ నష్టాలు



**ముంబయి, మే 8:** ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ నాలుగో త్రైమాసికంలో కొంతవరకూ నష్టాలను తగ్గించుకోగలిగింది. గత ఏడాది ఇదే కాలంలోరూ.1081 కోట్లు ఉన్న నష్టాలు ఈఏడాది రూ.800 కోట్లకు తగ్గాయి. క్విక్ కామర్స్ విభాగంలో మంచి వృద్ధి ఉందని, ఇన్‌స్టామార్ట్ కూడా నష్టాల తగ్గింపులోకీలకంగా పనిచేసిందన్నాఉ. మొత్తం రాబడులు రూ.6383 కోట్లుగా ఉంది. గత ఏడాది ఇదేకాలంలో కేవలం రూ.4410 కోట్లు మాత్రమే ఆర్జించింది. మూడో త్రైమాసికంలో కంపెనీ నికరంగా రూ.6148 కోట్లు రాబడులు ఆర్జించింది. 2025లో మొత్తం నష్టం 3117కోట్లు వస్తే మొత్తం పూర్తి సంవత్సరానికి 2026లో 4154 కోట్లు చవిచూసింది.పూర్తికాలానికి గాను రాబడులు రూ.23,053 కోట్లు ఉంది. అదే గత ఏడాదిచూస్తే కేవలం రూ.15,227 కోట్లవరకూ ఉంటుంది. తమ ఫుడ్‌డెలివరీ బిజినెస్ 15 త్రైమాసికాల్లో అత్యధికంగా వృద్ధిని నమోదుచేసింది. స్థూల ఆర్డర్ విలువలు 22.6శాతం వార్షికవృద్ధితో ఉందని, ఎబిడిటా కూడా 39.8శాతంపెరిగి రూ.297 కోట్లకు చేరిందని వివరించింది. స్థూల ఆర్డర్ విలువలు రూ.7881 కోట్లు వరకూ ఉన్నట్లు తెలిపింది. కంపెనీ నెలవారీ కస్టమర్లు 27.2శాతంపెరిగి 25.2 మిలియన్లకు చేరిందని వివరించింది. గడచిన నాలుగేళ్లతోపోలిస్తే ఫుడ్ డెలివరీ భారీ వృద్ధిని నమోదుచేసిందని కంపెనీ ఎండి సిఇఒ శ్రీహర్ష మాజేటి వెల్లడించారు.2027లో కూడా కంపెనీ నష్టాలు మరింతగా తగ్గి లాభాల్లోకి రాగలమని త్రైమాసికం వారీగా వృద్ధినమోదవుతుందని, కొత్త ఆర్డర్లు, కస్టమర్లు కూడా పెరుగుతున్నట్లు ఆయన చెప్పారు. ఆర్థిక ఫలితాల్లో బ్రేక్‌ఈవెన్ సాధిస్తామన్నారు.

## ఎస్‌బిఐ నికరలాభం 19,864 కోట్లు




**ముంబయి, మే 8:** ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బిఐ నాలుగో త్రైమాసికంలో ఏకీకృత నికరలాభం రూ.19684 కోట్లుగా ఉన్నట్లు ప్రకటించింది. రానిబాకీల్లో భారీగా తగ్గుదల నమోదు చేయడంవల్లనే నికర లాభాలు పెరిగాయి. గత ఏడాది ఇదేకాలంలో రూ. 18,643కోట్లు లాభాలు ఆర్జిస్తే ఈ ఏడాది 5.6శాతం పెరిగాయి. మొత్తం రాబడులు మాత్రం కొంతమేర తగ్గాయి. రూ.1,40,412 కోట్లుగా ఉంది. అంతకుముందు ఏడాది ఇదేకాలంలో రూ.1,43,876కోట్లు అని ప్రకటించింది. ఈత్రైమాసికంలో బ్యాంకు వడ్డీ రూపేణా రాబడులు రూ.1,23,098కోట్లు ఆర్జించిందని తెలిపింది. అలాగే ఏడాది క్రితం ఇదేకాలంలో రూ.1,19,666కోట్లు ఆర్జించింది. బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తులు 1.49 శాతానికి తగ్గాయి. అలాగేనికర నిరర్థక ఆస్తులు కూడా మొత్తం అడ్వాన్సుల్లో 0.47నుంచి 0.39శాతానికి తగ్గాయి. ఎస్‌బిఐ పూర్తి ఆర్థికసంవత్సరానికి గాను లాభాల్లో 13శాతం వృద్ధిని నమోదుచేసింది. రూ.70,901 కోట్ల నుంచి రూ.80,032 కోట్లకు పెంచుకోగలిగింది. నికర లాభాలు పెరగడంతో బ్యాంకుప్రతివాటాకు రూ.17.35 చొప్పున డివిడెండ్‌ప్రకటించింది. ప్రతి ఒక రూపాయి ముఖవిలువ ఉన్న షేరుకు ఈ డివిడెండ్ వర్తిస్తుంది. అర్హత కలిగిన వాటాదారులకు ఈ డివిడెండ్ ఈనెల 16 నుంచి అందుతుంది. డివిడెండ్ చెల్లింపు తేదీని మాత్రం జూన్ నాల్గవ తేదీగా ప్రకటించింది. నికరలాభాలు పెరిగినప్పటికీ బ్యాంకు షేర్లు ఆరుశాతం దిగువన అంటే రూ.1027.5గా బిఎస్ఇలో ట్రేడ్ అయ్యాయి. బ్యాంకు రిటైల్, వ్యక్తిగత రుణాలు, బంగారం తనఖా రుణాల్లో అడ్వాన్సులు భారీగా కేటాయించినట్లుప్రకటించింది. ఎంఎస్ఎంఇ రంగానికి కూడా రూ.80 వేల కోట్లకుపైగా రుణపరపతి అందించినట్లు ప్రకటించింది. కేంద్రం ప్రకటించిన రుణపరపతి హామీ పథకం కింద 40శాతం ఎంఎస్ఎంఇలు ఇప్పటివరకూ లబ్దిపొందేందుకు అర్హత సాధించాయని కూడా తెలిపింది.

## ఎంఎస్ఎంఇ రంగానికి ఎస్‌బిఐ

# 80వేల కోట్ల రుణపరపతి



**ముంబయి, మే 8:** పశ్చిమాసియా ఉద్రిక్తతల్లో దెబ్బతిన్న సూక్ష్మచిన్నమధ్య తరహా పరిశ్రమలకు ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్ బ్యాంకు రూ.75 వేలనుంచి 80వేల కోట్లవరకూ రుణపరపతిని అందించినట్లు బ్యాంకు ఛైర్మన్ సిఎస్ షెట్టి తెలిపారు. కేంద్రప్రభుత్వం ప్రకటించిన అత్యవసర రుణలైన్ గ్యారంటీ స్కీం 5.0 కింద ఈ సాయం అందుకున్నట్లు శెట్టి తెలిపారు. ఈ రుణాలకు ఎగువపరిమితి కూడా ఉందని చెపుతూ సుమారు 30 నుంచి 40శాతం మంది ఈ స్కీం ఇప్పటివరకూ వినియోగించుకున్నట్లు తెలిపారు. తమ రికార్డుల ప్రకారం అర్హులైన ఎంఎస్ఎంఇ యజమానులకు ఇసిఎల్‌జిఎస్ 5.0 ప్రకారం రుణపరపతి అందుతుందని అన్నారు. సుమారు 80 వేల కోట్లు ఈ సాయం పొందవచ్చని అంచనావేసిన సిఎస్‌శెట్టి ప్రభుత్వం 2.55 లక్షలకోట్లుగా ఈ స్కీం పరిధిని నిర్ణయించిందన్నారు. అయితే బ్యాంకు మాత్రం 30 నుంచి 40శాతం ఎంఎస్ఎంఇలు మాత్రమే ఈసౌకర్యం వినియోగించుకుంటాయన్నారు.ఇండియన్ బ్యాంక్స్ అసోసియషన్‌కు ఛైర్‌పర్సన్‌కూడా అయిన శెట్టి ఈ స్కీం అమలుకోసం బ్యాంకర్లు, ప్రభుత్వ సంస్థలు వివిధ ఏజెన్సీలను సమన్వయం చేసుకుంటూ ముందుకువెళుతున్నాయన్నారు. ఎఐ, మైథోస్ వంటి వాటి రిస్క్‌లను కూడా అధిగమించే ప్రణాళికలపై శెట్టి బ్యాంకర్లతో భేటీ అయ్యారు. రిటైల్ విభాగంలో రుణాల వృద్ధి ఉందని, హోమ్‌లోన్, వ్యక్తిగత రుణాలు, బంగారం రుణాల్లో కూడా వృద్ధి ఉందన్నారు. 2027 ఆర్థిక సంవత్సరంలో కూడా ఈదే తీరు ఉంటుందని, 13-15 శాతం వార్షిక రుణవృదిద ఉంటుందని ఆయన తెలిపారు. బంగారం ధరలు పెరుగుతుండటంతో రుణగ్రస్తులు ఎక్కువ విలువలతో రుణాలు పొందుతున్నారని,బంగారం తనఖారుణాలకు ఎక్కువ గిరాకీ ఉందన్నారు. డిపాజిట్లు కూడా 2027లో 11నుంచి 12శాతంపెంచే లక్ష్యంతో ఉన్నా మన్నారు. నికరవడ్డీ మార్జిన్‌కూడా కొత్త ఏడాదిలో 3శాతంగావృద్ధినమోదవుతుందన్నారు.



## భారత్‌లో అడోబ్ కొత్త కార్యాలయం

**ముంబయి, మే 8:** అమెరికన్ సాఫ్ట్‌వేర్ సంస్థ అడోబ్ భారత్‌లో కార్యకలాపాలను విస్తరించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత ఆవిష్కరణలపై దృష్టి సారిస్తున్న ఈ టెక్ దిగ్గజం, ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో శుక్రవారం కొత్త కార్యాలయాన్ని ప్రారంభించింది. నోయిడా సెక్టార్ 129లో ఏర్పాటు చేసిన ఈ కొత్త ఆఫీసు, భారత్‌లో అడోబ్‌కు ఏడో కార్యాలయం కాగా, ఉత్తరప్రదేశ్‌లో మూడోది.ప్రస్తుతం ఈ క్యాంపస్‌లో ఇంజినీరింగ్, కస్టమర్ విభాగాలకు చెందిన 700 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఏఐ టెక్నాలజీ ప్రపంచాన్ని మారుస్తున్న ఈ తరుణంలో, ఆవిష్కరణలను పునర్నిర్వచించడంలో అడోబ్ ముందుంది. భారత్ నుంచి ఆవిష్కరణలను ప్రోత్సహించాలన్న మా లక్ష్యంలో ఈ కొత్త ఆఫీస్ ప్రారంభం ఒక ముఖ్యమైన మైలురాయి అని అడోబ్ ఇండియా కంట్రీ మేనేజర్ అభిగ్యాన్ మోదీ తెలిపారు. మారుతున్న టెక్నాలజీ రంగంలో ఉద్యోగులు మరింత సమర్థవంతంగా కలిసి పనిచేసేందుకు ఈ కార్యాలయం దోహదపడుతుందని అడోబ్ ఇండియా ఎంప్లాయీ ఎక్స్‌పీరియన్స్ హెడ్ స్వాతి రుస్తాగీ అన్నారు. 1997లో భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించిన అడోబ్‌కు,ప్రస్తుతం దేశవ్యాప్తంగా 8వేల మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు.అమెరికా తర్వాత అత్యధిక ఉద్యోగులున్న దేశం భారత్ కావడం విశేషం.కంపెనీ గ్లోబల్ ఇన్నొవేషన్‌లో మూడింట ఒక వంతు వాటా భారత్ నుంచే వస్తోంది. ఏఐ నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో ఫైర్‌ఫ్లై, ఫొటోషాప్ వంటి టూల్స్‌ను విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నట్లు అడోబ్ ఈ ఏడాది ప్రారంభంలో ప్రకటించింది.

## ఎఐ క్లౌడ్‌షేర్‌లో 1100 మందికి ఉద్వాసన

**న్యూఢిల్లీ,మే 8:** సైబర్ సెక్యూరిటీ సంస్థ క్లౌడ్‌ఫ్లేర్ సంచలన నిర్ణయం తీసుకుంది. "ఏజెంటెక్ ఏఐ" యుగానికి సిద్ధమయ్యే క్రమంలో భాగంగా, ప్రపంచవ్యాప్తంగా 1,100 మందికి పైగా ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఇది కంపెనీ మొత్తం సిబ్బందిలో 20 శాతానికి సమానం. కంపెనీ మొదటి త్రైమాసిక ఆదాయ వివరాలు వెల్లడించిన అనంతరం, ఉద్యోగులకు ఈ విషయం తెలియజేసింది. ఇది ఖర్చుల నియంత్రణ కోసం తీసుకున్న నిర్ణయం కాదని, ఏఐ యుగంలో కంపెనీని పునర్నిర్మించేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు క్లౌడ్‌ఫ్లేర్ సహ వ్యవస్థాపకులు మాథ్యూ ప్రిన్స్, మిషెల్ జాట్లిన్ ఉద్యోగులకు పంపిన మెమోలో స్పష్టం చేశారు. గత మూడు నెలల్లోనే కంపెనీలో ఏఐ వినియోగం 600 శాతానికి పైగా పెరిగిందని వారు తెలిపారు. ఇంజినీరింగ్, హెచ్‌ఆర్, ఫైనాన్స్‌తో సహా అన్ని విభాగాల్లో వేలకొద్దీ ఏఐ ఏజెంట్ సెషన్లు నడుస్తున్నాయని, అందుకే కంపెనీ నిర్మాణాన్ని మార్చాల్సి వస్తోందని వివరించారు. ప్రస్తుతానికి ఈ తొలగింపుల ప్రక్రియ ఒక్కసారికే పరిమితమని, భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి కోతలు ఉండవని యాజమాన్యం హామీ ఇచ్చింది. పదే పదే చిన్న కోతలు విధించడం వల్ల ఉద్యోగుల్లో అనిశ్చితి నెలకొంటుందని, అందుకే ఒకేసారి ఈ కఠిన నిర్ణయం తీసుకున్నామని పేర్కొంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14